
'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 239

SUNDAY Special | ఆదివారం 20-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నేటి ఫన్‌డే లో ప్రత్యేక కథనం ▲

ఎడారి దేశంలో సాకర్ తుఫాన్

నేటి నుంచి ఖతర్‌లో ఫుట్‌బాల్ ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఐదు నగరాల్లో ఎనిమిది స్టేడియాల్లో 29 రోజుల పాటు ఈ మెగా ఈవెంట్ జరగనుంది. తొలి మ్యాచ్‌లో ఈక్వెడార్ జట్టుతో ఆతిథ్య ఖతర్ ఢీకొంటుంది. డిసెంబర్ 18న ఫైనల్‌తో ఈ టోర్నీ ముగుస్తుంది. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 341 కోట్ల ప్రైజ్‌మనీ లభిస్తుంది. డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్‌తో పాటు అర్జెంటీనా, పోర్చుగల్, ఇంగ్లండ్, బ్రెజిల్, జర్మనీ టైటిల్ ఫేవరెట్స్‌గా బరిలో ఉన్నాయి. - వివరాలు 14లో



దేశం కోసమే నా తపన

దేశ ప్రగతి కోసం తమ ప్రభుత్వం 365 రోజులు, 24/7 పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో



జైలులో సత్యేందర్ జల్సాలు!

ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సత్యేందర్ జైన్ తిహార్ జైల్లో రాజభోగాలు అనుభవిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

వివరాలు 6లో



కాప్ 27లో కాక

ఐరాస ఆధ్వర్యంలో జరుగుతున్న కాప్ సదస్సు ఉద్రిక్తంగా మారింది. చర్చల స్థాయిని దాటి గొడవల దాకా వెళ్లింది.

వివరాలు 6లో



దలైలామాకు అవార్డు

టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా గాంధీ–మండేలా పురస్కారాన్ని హిమాచల్ ప్రదేశ్‌లో అందుకున్నారు.

వివరాలు 6లో

ఓ ఫ్రెండ్.. బ్రదర్.. బాడీగార్డ్.. శభాష్.. 'దిశ'

మహిళల భద్రతకు కొండంత భరోసా.. 1.10 కోట్ల యాప్ రిజిస్ట్రేషన్లు



- అనంతపురానికి చెందిన లావణ్య విజయవాడలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల సెలవులకు ఇంటికి వెళ్లింది. తిరిగి కళాశాల వద్దకు వచ్చి దిగబెట్టడానికి తండ్రికి వీలుపడలేదు. బస్సు ఎక్కిద్దామని బస్టాండ్‌కు వచ్చాడు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సెల్‌ఫోన్‌లోని 'దిశ' యాప్‌ను ఉపయోగించమని చెప్పాడు. ఇలా ఉపయోగించాలని చూపించబోగా 'నాన్నా.. నాకు తెలుసులే' అని లావణ్య చెప్పడంతో జాగ్రత్తలు చెప్పి వెనుదిరిగాడు. ఇలా లక్షలాది మందికి 'దిశ' ఓ ఫ్రెండ్‌గా, ఓ సోదరుడిగా, ఓ బాడీగార్డ్‌గా నిలిచిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

సాక్షి, అమరావతి: సినిమాల్లో చివరి సీన్‌లోనే పోలీసులు వస్తారని ఎన్నో దశాబ్దాలుగా చూపిస్తున్నారు. దుర్ఘటన జరిగాక తీరిగ్గా పోలీసులు వస్తారు తప్ప.. వెంటనే రక్షణ కల్పించరనే అపప్రద దేశ వ్యాప్తంగా పోలీసులపై ఉంది. కానీ, రాష్ట్ర పోలీసు శాఖ ఆ చరిత్రను తిరగరాస్తోంది. ఆపదలో ఉన్నామని ఇలా చెబితే చాలు అలా క్షణాల్లో అక్కడకు చేరుకుని భద్రత కల్పిస్తోంది. మహిళలు సంప్రదించగానే తక్షణం భద్రత కల్పించే వ్యవస్థను రూపొందించాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకు ఆచరణ రూపమే దిశ మొబైల్ యాప్. ఇది రక్షణ కోసం మహిళలకు ప్రభుత్వం అందించిన అస్త్రం. ఆధునిక సమాచార సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ రూపొందించిన ఈ యాప్ మహిళా భద్రతకు పూర్తి భరోసానిస్తోంది. ఈ యాప్‌ను రికార్డు స్థాయిలో మహిళలు డౌన్‌లోడ్ చేసుకుంటుండటమే అందుకు నిదర్శనం. ఇప్పటి వరకు 1,10,40,102 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఏ మొబైల్ యాప్‌ను కూడా ఇంత భారీ స్థాయిలో ఎవరూ డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోలేదు.

క్షణాల్లో ఆపన్న హస్తం..

ఇప్పటి వరకు దిశ యాప్ ద్వారా 9.60 లక్షల ఎస్ఓఎస్ వినతులు దిశ కమాండ్ కంట్రోల్‌కు చేరాయి. యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే యాప్ పని తీరు పరీక్షించేందుకు చేసే ఎస్ఓఎస్ వినతులూ అత్యధికంగా ఉన్నాయి. అలాగే, ఇప్పటి వరకు చర్యలు తీసుకోదగిన 23,039 ఎస్ఓఎస్

మిగతా 2వ పేజీలో ▶

మహిళలకు ఒక భరోసా



ప్రయాణ సమయంలో దిశ యాప్‌లో ఉండే ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ ఉపయోగించి గమ్య స్థానాన్ని నమోదు చేస్తే అనుక్షణం ట్రాకింగ్ చేస్తుంది. ప్రయాణించే వాహనం దారి తప్పితే దిశ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలుస్తుంది. అప్పుడు పోలీసులు వెంటనే స్పందించే తీరు హర్షణీయం. సీఎం వైఎస్ జగన్ మహిళల భద్రతకు ఏర్పాటు చేసిన దిశ యాప్ ఎంతో భరోసా కల్పిస్తోంది.

– జి.రత్నకుమారి, గృహిణి, గుంటూరు

చంద్రబాబువి దుర్మార్గపు రాజకీయాలు


మాట్లాడుతున్న మంత్రి జయరాం. చిత్రంలో కాటసాని, సంజీవ్‌కుమార్

- మా ప్రాంతానికి వచ్చి మమ్మల్నే రెచ్చగొడతారా?
- ఈ ప్రాంత ప్రజలను కించపరుస్తూ మాట్లాడితే ఊరుకోవాలా?
- ఒకే రాజధానికి ఒప్పుకోవాలంటూ బెదిరిస్తే బెదిరిపోవాలా?
- ఇంకోసారిలా నోరుపారేసుకుంటే ప్రజలు తరిమికొడతారు
- వైఎస్సార్‌సీపీ నేతలు గూండాలైతే టీడీపీ భూస్థాపితమయ్యేది
- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మండిపాటు
- సీమ ద్రోహి బాబు : ఎమ్మెల్యే కాటసాని
- విద్యార్థులు, ప్రజలకు క్షమాపణ చెప్పాలి: ఎంపీ సంజీవ్‌కుమార్

3లో

అమరావతిని చంద్రబాబు ఏకపక్షంగా ప్రకటించారు



దొనకొండను రాజధాని చేయమన్నాం.. పట్టించుకోలేదు

'సాక్షి'తో ఏపీ మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి

రాజధాని విషయంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం తప్పని ఏపీ మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి చెప్పారు. ఉన్నత విద్యావంతులు, ఉన్నత పదవుల్లో ఉన్న తాము సిటిజన్స్ ఫోరంగా ఏర్పడి ఈ విషయంపై చంద్రబాబుతో మాట్లాడినా పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్ర విభజన పరిణామాలు, పలు ఇతర అంశాలపై ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. రాజధాని ఏర్పాటుపై అన్ని పార్టీలు, అన్ని ప్రాంతాల ప్రజల అభిప్రాయం తీసుకోవాలని కూడా చంద్రబాబుకు సూచించామన్నారు. రాజధానికి దొనకొండ అన్ని విధాలా తగిన ప్రాంతమని, అందుకు 10 సానుకూల అంశాలను ఆయన ముందుంచామని తెలిపారు. - వివరాలు 3లో ▸

న్యూస్‌రీల్

ఏయూకు త్రీస్టార్ ర్యాంకింగ్



జాతీయ స్థాయిలో కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్స్ కౌన్సిల్(ఐఐసీ) ర్యాంకింగ్స్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం త్రీ స్టార్ ర్యాంకింగ్‌ను సాధించినట్లు ఏయూ ఐఐసీ చైర్మన్ డాక్టర్ హెచ్.పురుషోత్తం శనివారం తెలిపారు.

వివరాలు 16లో ▸

జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతులు



రాష్ట్రంలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారికి పోస్టింగ్‌లు ఇస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. వీరు 30లోపు పోస్టుల్లో చేరాలని రిజిస్ట్రార్(విజిలెన్స్) ఉత్తర్వులిచ్చారు.

వివరాలు 3లో ▸

కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం



కిడ్నీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించారు.

వివరాలు 15లో ▸

నేడు వాయుగుండం!



దక్షిణ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడనుంది.

వివరాలు 3లో ▸

ఇదం జగత్


అదేమో గానీ..
పార్టీని మాత్రం ఎవరూ కాపాడలేరు!!

'తప్పు' తేలితే తప్పదు శిక్ష

- రాష్ట్రంలో తప్పుడు వ్యాపారం చేసే వారిపై గట్టి నిఘా
- వాణిజ్య పన్నుల శాఖలో డేటా అనలిటిక్స్ కేంద్రం
- వ్యాపారంలో అసహజ లావాదేవీలు ఉంటే వెంటనే దొరికిపోతారు
- దొంగ వ్యాపారం చేసే వారిపైనే దాడులు.. నిజాయితీగా వ్యాపారం చేసే వారికి వేధింపులు ఉండవు



సాక్షి, అమరావతి: మోటారు సైకిల్ మీద పెద్ద మొత్తంలో ఇనుము తుక్కు తరలించడం సాధ్యమా అంటే.. కానేకాదని ఎవరైనా చెబుతారు. కానీ, విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన ఒక తుక్కు వ్యాపారి (స్క్రాప్ డీలర్) మోటార్ సైకిళ్లపై టన్నుల కొద్దీ తుక్కు ఇనుమును ఇతర రాష్ట్రాలకు తరలించేశారట. ఆ సంస్థ లావాదేవీలు అసహజంగా ఉండటంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లోతుగా పరిశీలించి, ఈ వాహన్ ద్వారా ఆ వాహనాలను పరిశీలిస్తే.. అవన్నీ మోటారు సైకిళ్లని, వాటిపైనే ఏకంగా 20 టన్నుల తుక్కు ఇనుము తరలించినట్లు వే బిల్లులు తీసుకున్నారని వెల్లడైంది. ఆ బిల్లులన్నీ నకిలీవేనని తేలింది. అంతే కాదు ఒడిశా నుంచి విశాఖకు సరుకు తరలించినట్లుగా పేర్కొన్న లారీ నంబర్‌ను పరిశీలించగా..

మిగతా 2వ పేజీలో ▶


కొట్టాయంలో చికిత్స పొందుతున్న అయ్యప్పలు

కేరళలో ఏపీ యాత్రికుల బస్సు బోల్తా

- బ్రేక్ ఫెయిలై లోయలో పడడంతో దుర్ఘటన
- 17 మందికి గాయాలు.. వారిలో ఓ బాలుడి పరిస్థితి విషమం

- వివరాలు 2లో ▸

మర్రి శశిధర్‌రెడ్డిని బహిష్కరించిన కాంగ్రెస్!

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం ఆమోదం కోసం ఏఐసీసీకి..



పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డిని ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు తెలంగాణ పీసీసీ తెలిపింది. శశిధర్‌రెడ్డి అమిత్‌షాతో భేటీ అవడం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది.

- వివరాలు 12లో ▸

మార్గదర్శిలో ఇంకా డిపాజిట్ల సేకరణ

- చిట్‌ఫండ్ పేరుతోనే రశీదులిస్తున్నారు.. ఆ డబ్బును ఇతర వ్యాపారాల్లోకి మళ్లిస్తున్నారు
- రామోజీ తెలివి తేటలకు భారతరత్న ఇవ్వాలి
- ఆయనది రెండు టోపీల విధానం
- జర్నలిజం ముసుగులో తప్పులు కప్పిపుచ్చుకుంటున్నారు
- మాజీ ఎంపీ ఉండవల్లి



సాక్షి, రాజమహేంద్రవరం: 'మార్గదర్శి చిట్‌ఫండ్‌లో డిపాజిట్ల సేకరణ ఆపేసినట్లు 2006లో రామోజీరావు ప్రకటించారు. తీసుకున్న వాటిని తిరిగి చెల్లిస్తామని హైకోర్టు, సుప్రీంకోర్టులో అఫిడవిట్ సైతం వేశారు. కానీ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికీ డిపాజిట్లు సేకరిస్తూనే ఉన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆరోపించారు. డిసెంబర్ 2న మార్గదర్శి కేసు విచారణకు రానున్న

మిగతా 16వ పేజీలో ▶

క్లుప్తంగా

వేమూరులో రోశయ్య విగ్రహం

రూ.10 లక్షలతో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సంస్మరణార్థం బాపట్ల జిల్లా వేమూరులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇత్తడి లేదా కాంస్యంతో చేసిన విగ్రహం ఏర్పాటుకు రూ.10 లక్షలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం పరిపాలన అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆదేశాలను జారీ చేశారు.

'ఉత్తమ మెరైన్ జిల్లా'గా నెల్లూరు

రేపు కేంద్రం నుంచి అవార్డు అందుకోనున్న జిల్లా కలెక్టర్



నెల్లూరు(సెంట్రల్) : భారతదేశంలోనే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. 2021–22 ఏడాదికి గాను 'ఉత్తమ మెరైన్ జిల్లా' అవార్డుకు ఎంపికైనట్టు కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖపై తీసుకున్న శ్రద్ధ వల్ల ఈ జిల్లా చూపిన అత్యుత్తమ ప్రతిభకు గాను ఈ అవార్డు దక్కినట్టు చెబుతున్నారు. ప్రధానంగా మత్స్య సంపద అభివృద్ధి, ఆక్వా సేద్యం, రిజర్వాయర్లు, చెరువుల్లో మత్స్య సంపద పెంపకం, ఈ క్రాప్ బుకింగ్‌లతో పాటు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం, సమగ్ర ఆధునిక పద్ధతుల్లో రొయ్యలు, చేపల సాగు, ఫిష్ లాండింగ్ సెంటర్ల ఏర్పాటు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం బెస్ట్ మెరైన్ జిల్లాగా ప్రకటించింది. మత్స్యకారుల సంక్షేమానికి , అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, జిల్లా యంత్రాంగం సాధించిన ప్రగతికి దేశ స్థాయిలో ఈ అవార్డు రావడం నిదర్శనం అని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రి చేతుల మీదుగా సోమవారం ప్రదానం చేయనున్న ఈ అవార్డును జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అందుకోనున్నారు.

'బలిమెల' నీటి విడుదలపై ఏపీ, ఒడిశా సమీక్ష

సీలేరు (అల్లూరి సీతారామరాజు): ఆంధ్రా–ఒడిశా సరిహద్దు జలవిద్యుత్ కేంద్రాలకు నీటిని విడుదల చేసే బలిమెల జలాశయం నీటి నిల్వలపై రెండు రాష్ట్రాల అధికారులు శనివారం సమీక్ష నిర్వహించారు. ఒడిశాలోని బలిమెలలో నిర్వహించిన ఈ సమావేశంలో 2022–23 నీటి సంవత్సరంలో జూలై నుంచి అక్టోబర్ చివరి నాటికి ఏయే రాష్ట్రాలు ఎంత నీటిని వినియోగించుకున్నాయనే అంశంపై చర్చించారు. అక్టోబరు చివరినాటికి ఏపీ 12.0846 టీఎంసీలు వాడుకోగా, ఒడిశా 20.7044 టీఎంసీలు వినియోగించుకున్నట్లు లెక్కించారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 65.9537 టీఎంసీల నీరు నిల్వ ఉందని, దానిలో ఏపీ వాటాగా 37.2868 టీఎంసీలు, ఒడిశా 28.6669 టీఎంసీలు వినియోగించుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు బలిమెలలో ఉన్న నీటిని ప్రస్తుత అవసరాల కోసం వెయ్యి క్యూసెక్కులు చొప్పున విడుదల చేసుకోవడానికి అంగీకరించారు. ఈ సమావేశంలో ఒడిశా అధికారులతోపాటు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీరు ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జాకీర్ హుస్సేన్, లక్ష్మీనారాయణ, ఏడీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తలసరి ఆదాయంలో కృష్ణా జిల్లా టాప్

- రెండో స్థానంలో విశాఖ జిల్లా
- చివరి స్థానంలో శ్రీకాకుళం జిల్లా
- 2020–21 సంవత్సరం గణాంకాలు రూపొందించిన ప్రణాళికా శాఖ
- కృష్ణా జిల్లా తలసరి ఆదాయం రూ.2.63 లక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2020–21 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లా చిట్ట చివరి స్థానంలో ఉందని రాష్ట్ర ప్రణాళికా శాఖ వెల్లడించింది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికా శాఖ ఉమ్మడి జిల్లాలవారీగా తలసరి ఆదాయ గణాంకాలను రూపొందించింది. సమతుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలకు జిల్లాల వారీగా రూపొందించిన ఈ గణాంకాలు దోహదపడతాయని పేర్కొంది. కృష్ణా జిల్లాలో అత్యధికంగా 2020–21లో 2.63 లక్షల రూపాయల తలసరి ఆదాయం ఉన్నట్లు తెలిపింది. విశాఖపట్నం జిల్లాలో తలసరి ఆదాయం రూ.2.43 లక్షలు, శ్రీకాకుళం జిల్లాలో రూ.1.24 లక్షలు ఉన్నట్లు పేర్కొంది. 2019–20 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2020–21లో ఒక్క కృష్ణా జిల్లాలో తప్ప మిగతా అన్ని జిల్లాల్లో తలసరి ఆదాయంలో వృద్ధి నమోదైందని ఆ గణాంకాలు వెల్లడించాయి.

29న వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ

- ఆర్బీకేల్లో రబీ 2020–21 జాబితాలు
- 2.54 లక్షల మంది అర్హులు.. రూ.45.22 కోట్ల లబ్ధి
- 22 వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- సిద్ధమవుతున్న ఖరీఫ్–2021 అర్హుల జాబితా



సాక్షి, అమరావతి : అన్నదాతల్లో ఆర్థిక క్రమశిక్షణ తీసుకొచ్చే లక్ష్యంతో రూ.లక్షలోపు పంట రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నావడ్డీ రాయితీనందిస్తూ వారికి అండగా నిలుస్తోంది. రబీ 2020–21, ఖరీఫ్–2021 సీజన్‌లకు సంబంధించి అర్హులకు ఈ నెల 29న వడ్డీ రాయితీని జమ చేసేందుకు రంగం సిద్ధంచేస్తోంది. ఇప్పటికే రబీ 2020–21 అర్హుల జాబితా సిద్ధం కాగా, వాటిని సామాజిక తనిఖీలో భాగంగా ఆర్బీకేల్లో ఆదివారం (నేటి) నుంచి ప్రదర్శిస్తున్నారు. మరోవైపు.. ఖరీఫ్–2021 జాబితా వాలిడేషన్ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అప్పుల ఊబిలో చిక్కుకోకుండా రైతులకు వడ్డీలేని రుణాలు ఇస్తామంటూ ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. తీసుకున్న రుణాలను గడువులోగా తిరిగి చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీనందిస్తోంది. టీడీపీ హయాంలో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు చెల్లిస్తూ రైతులకు బాసటగా నిలిచింది. 2014–19 మధ్య గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 38.42 లక్షల మంది రైతులకు రూ.688.25 కోట్లు జమచేయడమే కాక ఖరీఫ్–2019లో 14.28 లక్షల మందికి రూ.289.68 కోట్లు, రబీ 2019–20లో 5.59 లక్షల మందికి రూ.92.38 కోట్లు, ఖరీఫ్ 2020 సీజన్‌లో 6.67లక్షల మందికి రూ.112.70 కోట్లు జమచేసింది.

ఈ–క్రాప్, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా..

రబీ 2020–21తో పాటు ఖరీఫ్–2021 సీజన్లలో రూ.లక్షలోపు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి అర్హత పొందిన రైతులకు ఈ నెల 29న వడ్డీ రాయితీని జమచేసేందుకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఈ–క్రాప్‌లో నమోదైన పంట వివరాల ఆధారంగా, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వడ్డీ రాయితీ లబ్ధిని వాస్తవ సాగుదారులకు అందించనుంది. అలాగే, రబీ 2020–21 సీజన్‌లో సున్నా వడ్డీ రాయితీ పొందేందుకు 2,54,568 మంది అర్హత పొందినట్లుగా నిర్ధారించారు. వీరికి ఈ నెల 29న రూ.45.22 కోట్లు జమచేస్తారు. జిల్లాల వారీగా వీరి జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. ఈనెల 22లోగా వీటిని పరిశీలించి తప్పొప్పులుంటే సరిచేసుకునే అవకాశం కల్పించారు. రైతులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో కూడా చెక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. సున్నా వడ్డీ పంట రుణాల పోర్టల్ https://karshak.ap.gov.in/ysrsvpr/ అనే వెబ్‌సైట్‌లో "know your status" విండోలో తమ ఆధార్ నంబర్ ఎంటర్‌చేస్తే వివరాలు డిస్‌ప్లే అవుతాయి. మరోవైపు.. నవంబర్ 29న ఖరీఫ్–2021 సీజన్‌లో అర్హత పొందిన రైతులకు కూడా సున్నా వడ్డీ రాయితీని జమచేయనున్నారు. ఈ సీజన్‌లో పంట రుణాలు తీసుకున్న 10.76 లక్షల మంది వివరాలను బ్యాంకర్లు అప్‌లోడ్ చేయగా, వారిలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణం పొందడం, ఈ–క్రాప్‌లో పంటల నమోదు ప్రామాణికంగా వ్యాలిడేషన్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ఖరీఫ్–2021 అర్హుల జాబితాను కూడా సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు.


తప్పొప్పులు సరిచేసుకోవచ్చు.. అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు

జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నాం. లబ్ధిదారులు తమ వివరాలను సరిచూసుకుని తమ పేర్లు, బ్యాంకు ఖాతా వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవచ్చు. ఒకవేళ అర్హత ఉండి తమ పేరు జాబితాలో లేకపోతే పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును సంబంధిత బ్యాంకు అధికారి ధ్రువీకరణతో రైతుభరోసా కేంద్రాల్లో సమర్పిస్తే పునః పరిశీలన చేసి అర్హుల జాబితాలో చేరుస్తారు.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

హాట్.. కూల్.. సోలార్

- మార్కెట్లోకి హైబ్రిడ్ సోలార్ ఎయిర్ కండీషనర్లు



సాక్షి, అమరావతి: సూర్యరశ్మిలో ఉన్న అనంత శక్తిని వినియోగించుకోవడంపై ఎన్నో ప్రయోగాలు, పరిశోధనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అలాగే హైడ్రోజన్ గ్యాస్‌ను భవిష్యత్ ఇంధనంగా కూడా భావిస్తున్నారు. ఇన్నాళ్లూ సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చి వినియోగించుకుంటున్నాం. ఆ విద్యుత్‌తో దీపాలు వెలిగిస్తున్నాం. వాహనాలను, పరిశ్రమలను కూడా నడుపుతున్నాం. వీటన్నింటినీ మించి తాజా ఆవిష్కరణలు ఇప్పుడు ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నాయి. వాటిలో ఒకటి సోలార్ హైడ్రోజన్ ప్యానల్స్ కాగా, రెండవది హైబ్రిడ్ సోలార్ ఎయిర్ కండీషనర్లు. భవిష్యత్ తరాలకు భరోసా కల్పిస్తున్న ఈ రెండు కొత్త ప్రాజెక్టులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

ఇంటిపైనే హైడ్రోజన్ ఫ్యాక్టరీ..

పర్యావరణానికి హాని చేసే ఉద్గారాలు ఏమీ లేని స్వచ్ఛమైన ఇంధనం హైడ్రోజన్. ఈ గ్యాస్‌ను గాలి నుంచి పొందేలా బెల్జియంలో పరిశోధనలు సాగాయి. సూర్యుని నుంచి విద్యుత్ శక్తిని, గాలి నుంచి హైడ్రోజన్ వాయువును సంగ్రహించగల పైకప్పు (రూఫ్‌టాప్) ప్యానెల్స్‌ను కేయూ లీవెన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. చాలా కాలంగా వీరు చేసిన పరిశోధనలు ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చాయి. ప్రస్తుతం పారిశ్రామికోత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నారు. 2030కల్లా రూఫ్‌టాప్ హైడ్రోజన్ ప్యానల్స్ తయారు చేసేలా కృషి చేస్తున్నారు. హైడ్రోజన్‌ను నిల్వ చేసి అవసరమైనప్పుడు విద్యుత్‌గా, రూమ్ హీటర్‌గా వినియోగించుకునేందుకు వారు ఈ ప్రాజెక్టును రూపొందించారు. వీరు తయారు చేసిన ప్యానల్స్‌లో ఎలక్ట్రిక్ వైర్లకు బదులుగా గ్యాస్ ట్యూబ్లు ఒకదానికొకటి అనుసంధానించి ఉంటాయి. ఈ ప్యానల్స్ సూర్యరశ్మిని గ్రహించి విద్యుత్‌గా మారుస్తాయి. అలాగే గాలి నుంచి నీటి ఆవిరిని గ్రహిస్తాయి. సూర్యుని నుంచి గ్రహించిన శక్తిని వినియోగించి ఆ ప్యానల్స్ నీటి అణువులను హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విభజిస్తాయి. హైడ్రోజన్‌ను స్టోర్ చాంబర్‌కు పంపి, ఆక్సిజన్‌ను తిరిగి వాతావరణంలోకి విడుదల చేస్తాయి. ఇలా నిల్వ చేసిన హైడ్రోజన్‌ను శీతాకాలంలో రూమ్ హీటింగ్ సిస్టంకు, అలాగే గృహానికి విద్యుత్‌గా కూడా వాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

సౌర, బ్యాటరీ, విద్యుత్‌తో పనిచేసే ఏసీ

హైబ్రిడ్ సోలార్ ఎయిర్ కండీషనర్‌ను సోలార్ ఏసీగా పిలుస్తున్నారు. వీటిని సౌరశక్తి, సౌర బ్యాటరీ బ్యాంక్, విద్యుత్‌తో పనిచేయించవచ్చు. అంటే కరెంటు, సూర్యరశ్మి లేకున్నా ఏసీ ఆగదు. సోలార్ ప్యానల్స్, సోలార్ ఇన్వర్టర్లు, అన్ని ఉపకరణాలతో కలిపి ఏసీని తయారు చేశారు. ఇది ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది.

కేరళలో ఏపీ యాత్రికుల బస్సు బోల్తా

- ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి నుంచి బయల్దేరిన భక్తులు
- కేరళ సర్కారుతో ఎమ్మెల్యేలు నాని, అబ్బయ్యచౌదరి, కలెక్టర్ సంప్రదింపులు

ఏలూరు రూరల్/సాక్షి, అమరావతి : అయ్యప్ప మాలధారులతో కేరళలోని శబరిమలకు వెళ్లిన ఓ ప్రైవేటు బస్సు తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైంది. శబరిమల సమీపంలోని పతనంతిట్ట వద్ద మలుపు తిరుగుతుండగా బ్రేక్ ఫెయిలై లోయలో పడింది. ప్రయాణ సమయంలో బస్సులో 46 మంది ఉండగా, వారిలో 17 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఎనిమిదేళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కేరళ ప్రభుత్వంతో, అక్కడి ఆసుపత్రి వర్గాలతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

రెండు బస్సుల్లో ప్రయాణం..

ఈ నెల 15న ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన 86 మంది అయ్యప్ప మాలధారులు శబరిమల యాత్రకు రెండు బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. 18న మధ్యాహ్నం శబరిమలకు చేరుకుని దర్శనానంతరం శనివారం ఉ.6.30 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో శబరిమల నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని పతనంతిట్ట వద్ద బస్సు బ్రేక్ ఫెయిల్ అయింది. దీంతో డ్రైవర్ బండిని అదుపుచేయలేక లోయలో పడింది. ప్రయాణికులంతా పెద్దపెట్టున హాహాకారాలు చేశారు. సుమారు 15–20 అడుగుల లోతులో ఉన్న లోయలో బస్సు ఒక్కసారిగా పడటంతో ప్రయాణికులంతా చెల్లాచెదురయ్యారు. 17 మంది గాయపడ్డారు. వీరిలో మాదేపల్లికి చెందిన మణికంఠ అనే బాలుడికి పక్కటెముకలు విరిగాయని, అతని పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. సంఘటన జరిగిన తరువాత అక్కడి పోలీసులు, ఇతర అధికారులు క్షతగాత్రులను హుటాహుటిన అంబులెన్సుల ద్వారా కొట్టాయం మెడికల్ కళాశాలకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సు 40–50 కి.మీ.ల వేగంతో ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. ప్రమాద వార్త తెలియగానే మాదేపల్లి గ్రామం ఉలిక్కిపడింది. తమవారి క్షేమ సమాచారం కోసం బంధువులు ఎంతో ఆతృతతో ఆరా తీశారు.

కేరళ మంత్రితో ఆళ్ల నాని వాకబు

సమాచారం తెలియగానే మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని కేరళ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వీణాజార్జి, స్థానిక కలెక్టర్‌తో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి క్షేమంగా తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాదేపల్లి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ పెంచల కిషోర్‌తో పాటు క్షతగాత్రుల కుటుంబీకులను పరామర్శించారు. బాధితులను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందని వివరించారు. ఇక బ్రేక్ ఫెయిల్ అవడంవల్లే బస్సు ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు వివరించారని వారి బంధువు, మాదేపల్లికి చెందిన శ్రీనివాస్ 'సాక్షి'కి చెప్పారు. తాను కూడా వారితో పాటే శబరిమలకు వెళ్లానని, వచ్చేటప్పుడు వారికంటే ముందు బయల్దేరి వచ్చేశానన్నారు. కొండ దిగువన పెద్దపెద్ద చెట్లు ఉండడంవల్ల ప్రమాద తీవ్రత తగ్గినట్లు బాధితులు చెప్పారన్నారు. అసలు తిరుగు ప్రయాణంలో బస్సు క్లచ్ ప్లేట్లు పాడయ్యాయని.. మరమ్మతులు చేసుకుని తిరిగి బయలుదేరిన 30 నిమిషాల్లో ఈ ప్రమాదం జరిగినట్లు వారు చెప్పారన్నారు.

క్షతగాత్రులు వీరే..

గాయపడిన వారిలో.. మాదేపల్లి గ్రామానికి చెందిన బత్తిన రాజశేఖర్, చల్లా సురేష్, బత్తిన రాజేష్, తరగళ్ల రాజేష్, పాశం సాయిమణికంఠ, జి.గోపి, కాకరబత్తిన వెంకటేశ్వరరావు, మారేటి దుర్గారావు, పైడిపాటి భాస్కరరావు, గండికోట శ్యామ్, పాండు, సూరినీడు శివ, ప్రసాద గోపి, మారెడ్డి చరణ్, లక్ష్మయ్యతో పాటు ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగేశ్వరరావు, శ్రీను ఉన్నారు.

సీఎం జగన్ ఆరా

సహాయ చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

మరోవైపు.. రాష్ట్రానికి చెందిన శబరిమల భక్తులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రమాద ఘటనకు దారితీసిన పరిస్థితులు, గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఆయన అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయడంతోపాటు గాయపడిన వారందరికీ వైద్యం, తగిన సౌకర్యాలు కల్పించేలా చూడాలన్నారు. పతనంతిట్ట జిల్లా కలెక్టర్‌తో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటున్నామని సీఎంకు అధికారులు వివరించారు.

శభాష్.. 'దిశ'

- విజయనగరం జిల్లా పూసపాటిరేగలో ఓ యువతిని రాంబాబు అనే యువకుడు ప్రేమిస్తున్నానని నమ్మించాడు. వారి పెళ్లికి పెద్దలు కూడా సమ్మతించారు. కానీ, ఆ యువతిపై అనుమానం పెంచుకున్న రాంబాబు ఆమెను అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఆమె ఇంట్లోకి ప్రవేశించి, ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీన్ని గుర్తించిన ఆ యువతి సోదరి దిశ యాప్ ద్వారా పోలీసులను సంప్రదించగా వారు కేవలం ఆరు నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న రాంబాబును అరెస్టు చేశారు. విజయవాడలో ఓ బిడ్డకు తల్లి అయిన ఒంటరి మహిళను ఓ యువకుడు నమ్మించి మోసగించాడు. దాంతో ఆమె విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన బిడ్డను సంరక్షించమని దిశ యాప్ ద్వారా పోలీసులను కోరింది. పోలీసులు కేవలం 3 నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి తప్పించారు. ఆమెను మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేశారు.

▶ మొదటి పేజీ తరువాయి

వినతులు వచ్చాయి. పోలీసులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టారు. ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకున్న 1,237 మందికి భద్రత కల్పించారు. నేరాలకు యత్నించిన కేసుల్లో 2,323 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. మొత్తంగా 3,560 ఘటనల్లో బాధితులకు అండగా నిలిచారు.



పటిష్ట వ్యవస్థతో సమర్థ పర్యవేక్షణ

దిశ యాప్ సమర్థవంతంగా పని చేసేందుకు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఒక అదనపు ఎస్పీ, ఒక డీఎస్పీ, 15 మంది ఇతర అధికారులతో కూడిన బృందం 24/7 కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. దిశ యాప్ పని తీరును సాంకేతిక సమస్యల్లేకుండా చూసేందుకు 51 మందితో కూడిన సహాయక బృందాన్ని కూడా నెలకొల్పింది. ఇక గస్తీ విధుల కోసం 900 ద్విచక్ర వాహనాలతోపాటు 163 బొలెరో వాహనాలను సమకూర్చింది. దాదాపు 3 వేల పోలీసు వాహనాలకు జీపీఎస్ ద్వారా దిశ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానించారు. ఫోరెన్సిక్ సైన్స్ విభాగాన్నీ బలోపేతం చేసింది. కేంద్ర హోంశాఖ ప్రమాణాల ప్రకారం 60 రోజుల్లోపే రాష్ట్ర పోలీసులు అత్యధిక కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. దోషులను గుర్తించి సకాలంలో శిక్షలు పడేలా చూస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అత్యాచారం–హత్య కేసుల దర్యాప్తునకు సగటున 222 రోజులు సమయం పట్టగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం సగటున 58 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో 19 అవార్డులు

దిశ యాప్ ప్రభావంతో రాష్ట్రంలో మహిళలపై దాడులు, వేధింపులు తగ్గాయని జాతీయ నేర గణాంకాల నివేదిక (ఎన్‌సీఆర్‌బీ)–2021 వెల్లడించింది. ప్రతి లక్ష జనాభాకు తెలంగాణలో మహిళలపై నేరాల కేసులు 111.2 నమోదవుతుండగా కేరళలో 73.3 కేసులున్నాయి. ఏపీలో 67.2 కేసులు నమోదవుతున్నాయి. ఏపీలో మహిళలపై అత్యాచారం–హత్య కేసులు గణనీయంగా తగ్గాయి. 2019లో ఆరు, 2020లో ఐదు కేసులు నమోదు కాగా 2021లో రెండు కేసులు నమోదయ్యాయి. అత్యాచారయత్నం కేసులు 2019లో 177, 2021లో 162 కేసులు నమోదయ్యాయి. బాలికలపై అత్యాచార యత్నం కేసులు 2019లో 45, 2020లో 40, 2021లో 35 నమోదయ్యాయి. మహిళలపై దాడుల కేసులు 8% తగ్గాయి. ఇంత సమర్థవంతంగా పని చేస్తున్న దిశ యాప్‌కు జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు 19 అవార్డులు వచ్చాయి.

దిశ వ్యవస్థ దేశానికి ఆదర్శం



మహిళా భద్రతను ప్రథమ ప్రాధాన్యత అంశంగా తీసుకున్నాం. ఇందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా దిశ యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. డౌన్ లోడ్, రిజిస్ట్రేషన్లపై శ్రద్ధ తీసుకున్నాం. దాంతో ఏపీలో మహిళలపై వేధింపులు తగ్గాయని జాతీయ నేర గణాంకాల నివేదిక వెల్లడించింది. దిశ యాప్ పనితీరును ఇతర రాష్ట్రాల పోలీసు శాఖలు కూడా పరిశీలించాయి. దిశ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

– కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, డీజీపీ

దిశ యాప్ మహిళలకు ఒక వరం



ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పోలీస్ అవసరం ఉన్న వారు ఎస్‌ఓఎస్ బటన్ నొక్కడం ద్వారా సత్వర సహాయం అందుతుంది. ఆపదలో ఉన్నప్పుడు కాల్ చేసే అవకాశం లేకపోతే ఫోన్‌ను నాలుగైదుసార్లు షేక్ చేస్తే చాలు.. పోలీసులకు సమాచారం అందుతుంది. ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ మహిళలపై దాడులు ఆపలేకపోతున్న పరిస్థితుల్లో దిశ యాప్ ఒక వరం లాంటిది.

– కె శ్యామల, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోక్సో కోర్టు

యాప్‌పై అవగాహన పెంచుకోవాలి



దిశ యాప్ మహిళలకు అండగా నిలుస్తోంది. విద్యార్థినులకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోంది. పెద్దగా చదువుకోని మహిళలు కూడా ఈ యాప్‌ను సులువుగా ఉపయోగించవచ్చు. మహిళలు, విద్యార్థినులు ఈ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి.

– పి.రమణమ్మ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు, విజయనగరం.

'తప్పు' తేలితే తప్పదు శిక్ష

▶ మొదటి పేజీ తరువాయి

బిల్లులో పేర్కొన్న సమయంలో ఆ లారీ కేరళలో ఉన్నట్టు తేలింది. ఇలా పలువురు వ్యాపారులు అసలు సరుకు రవాణా చేయకుండానే దొంగ వే బిల్లులు తీసుకొని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరుతో ప్రభుత్వం నుంచి ఎదురు డబ్బులు తీసుకుంటున్నారు. ఆ స్క్రాప్ వ్యాపారి దొంగ వే బిల్లులు సృష్టించినట్లు స్పష్టం కావడంతో కేసులు నమోదు చేశామని, ఆ లావాదేవీలపై పన్ను వసూలు చేయడంతో పాటు దానికి రెట్టింపు పెనాల్టీ విధించనున్నట్లు వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్ చెప్పారు.

తప్పు చేసిన వారు దొరికిపోతారిలా..

గతంలో వాణిజ్య పన్నుల శాఖ అంటే వ్యాపారులు తమను వేధించే విభాగంగా చూసేవారు. ఎక్కడికక్కడ వాహనాలు ఆపి తనిఖీలు చేయడం, చెక్ పోస్టు తనిఖీలు, మూకుమ్మడిగా వ్యాపారులపై తనిఖీల పేరుతో బెంబేలెత్తించేవారు. జీఎస్టీ వచ్చిన తర్వాత ఆ వాతావరణం కనిపించడంలేదు. దొంగ ఎక్కడున్నాడో గుర్తించి అక్కడే తనిఖీలు చేస్తున్నారు. విజయవాడలో అనేక మంది స్క్రాప్ డీలర్లు ఉండగా దొంగ వ్యాపారం చేస్తున్న ఆ డీలరు దగ్గరకే నేరుగా వెళ్లడమే దీనికి నిదర్శనం. ఇందుకోసం వాణిజ్య పన్నుల శాఖ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వ్యాపారులపై వేధింపులు లేకుండా డేటా అనలిటిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రంలో జరుగుతున్న వ్యాపార లావాదేవీలను నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఒక వ్యాపారి తీసుకుంటున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, వే బిల్లులు, వస్తువుల కొనుగోళ్లు, విక్రయాలు, పన్ను చెల్లింపులు వంటి అనేక అంశాలను పరిశీలించి వాటి మధ్య భారీ తేడాలు ఉంటే డేటా అనలిటిక్స్ ద్వారా సులభంగా గుర్తిస్తోంది. దీని ద్వారా గతంలోలా ప్రతి వ్యాపారినీ తనిఖీ చేయాల్సిన అవసరం లేదని, తప్పు ఎవరు చేస్తున్నారో నిర్ధారించుకొని, పూర్తి సాక్ష్యాధారాలతో దాడులు చేస్తున్నట్లు గిరిజా శంకర్ తెలిపారు. ఈ విధంగా ఈ మధ్య కాలంలో జరిపిన తనిఖీల్లో విజయవాడలోని ఒక ప్రముఖ ఎలక్ట్రికల్ షోరూం ఎటువంటి బిల్లులు లేకుండా 80 శాతం పైగా నగదు రూపంలో లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఒకడ్రై ఫ్రూట్ వ్యాపారి రూ.35 కోట్ల మేర నగదు లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. కొంతమంది వ్యాపారులు సరుకు రవాణా అయిపోగానే కంప్యూటర్ నుంచి డేటా డిలీట్ చేయడం, వాట్సాప్ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తూ అయిపోయిన వెంటనే వాటిని డిలీట్ చేస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. డిలీట్ చేసిన డేటాను మొత్తం తిరిగి రిట్రీవ్ చేసి ఆధారాలతో కేసులు నమోదు చేశారు. నిజాయితీగా వ్యాపారం చేస్తున్న వారికి అనవసరపు తనిఖీలు, దాడులు ఉండటంలేదు. ఈ విధానం పట్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీలు తగ్గించడమే లక్ష్యం



రాష్ట్రంలో వ్యాపారులపై దాడులు లేకుండా చేయాలన్నదే మా ప్రభుత్వ విధానం. ఇందుకోసం పూర్తిస్థాయిలో డేటా అనలిటిక్స్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. దీనివల్ల తప్పుడు వ్యాపారం చేస్తున్న వారిని సులభంగా గుర్తించవచ్చు. చట్ట ప్రకారం వ్యాపారం చేస్తూ బాధ్యతగా పన్ను చెల్లించే వాతావరణం తీసుకువస్తాం. ఇందుకోసం వ్యాపారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి సలహాలు తీసుకుంటాం.

– బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి

ఎంఐజీ ప్లాట్ల బుకింగ్‌కు గడువు పెంపు

- డిసెంబర్ 31 వరకు దరఖాస్తుకు అవకాశం



సాక్షి, అమరావతి: మంగళగిరిలోని 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్'లో ప్లాట్ల కొనుగోలు కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–వేలంలో ప్లాట్ల కొనుగోలుకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు శనివారంతో ముగిసిందని, అయితే, కొనుగోలుదారుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు గడువు పొడిగించినట్లు వివరించారు. ఇక్కడి ఎంఐజీ లేఅవుట్–2లో 200 చ.గ. ప్లాట్లు 68, 240 చ.గ. ప్లాట్లు 199, మొత్తం 267 ఉన్నాయని తెలిపారు. చదరపు గజం ధర రూ.17,499గా నిర్ణయించామని, కొనుగోలుదారులకు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా నివసిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు 10% ప్లాట్లు రిజర్వు చేయడంతోపాటు 20% రాయితీ ఇస్తున్నామని, స్థానిక విశ్రాంత ఉద్యోగులకు 5% ప్లాట్లను రిజర్వు చేసినట్లు తెలిపారు. ఈ–వేలంలో ప్లాట్లు పొందినవారు సులభ వాయిదాల్లో డబ్బులు చెల్లించే సౌకర్యం కూడా ఉందన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ అనంతరం ఈ–వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంఐజీలో ప్లాట్లు కొనుగోలు చేసేవారికి ప్రభుత్వం మరో మంచి అవకాశం కల్పిస్తోందని, ప్లాట్ నికర అమ్మకపు ధరలో 60% మీద మాత్రమే రిజిస్ట్రేషన్ చార్జీలు ఉంటాయని, మిగిలిన 40 శాతం మీద మినహాయించినట్లు తెలిపారు.

పూర్తి వివరాలకు

https://migapdtcp.ap.gov.in, https://crda.ap.gov.in వెబ్‌సైట్, లేదా 0866- 2527124 నంబర్‌లో గానీ సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

నేడు వాయుగుండం!

- రెండ్రోజులు దక్షిణ కోస్తా వైపు పయనం
- రేపట్నుంచి కోస్తా, సీమల్లో అక్కడక్కడ భారీ వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: దక్షిణ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం రానున్న రెండు రోజులు అదే దిశలో తమిళనాడు-పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంల వైపు పయనిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి విడుదల చేసిన బులెటిన్‌లో వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తర తమిళనాడుకు ఆనుకుని ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల ఆదివారం సాయంత్రం నుంచి తేలికపాటి వర్షాలు మొదలవుతాయని తెలిపింది. 21, 22 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల చెదురుమదురు వానలకు అవకాశం ఉంది. మరోవైపు ఈ నెల 23వ తేదీ వరకు తీరం వెంబడి గంటకు 45–55, గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, దీంతో సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని ఐఎండీ హెచ్చరించింది.

చంద్రబాబూ.. నీకిదేం ఖర్మ

- 2019లోనే ప్రజలు చంద్రబాబు బట్టలూడదీసినా సిగ్గురాలేదు?
- ఓ ప్రతిపక్ష నేత ఇంతలా దిగజారటం ఎప్పుడైనా చూశామా?
- మంత్రి జోగి రమేష్ ఫైర్



సాక్షి, అమరావతి: జనం 2019లోనే చంద్రబాబుకు బుద్ధిచెప్పారని, అప్పుడే ప్రజలు బట్టలూడదీసి ఆయన్ను రోడ్డుపై నిలబెట్టారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఎద్దేవా చేశారు. అయినా ఆయనకు సిగ్గురాలేదని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మరోసారి బట్టలూడదీయకుండా చంద్రబాబు చూసుకోవాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఒక ప్రతిపక్ష నేత ఇంతగా దిగజారటం దేశంలో ఎప్పుడైనా చూశామా అని ప్రశ్నించారు. 45 ఏళ్లపాటు రాజకీయం చేసిన ఆయన ఇప్పుడు ఒక్క ఓటు వేయమని ప్రజల్ని అడుక్కుంటున్నారన్నారు. చంద్రబాబూ.. నీకిదేం ఖర్మని ఆయన ప్రశ్నించారు. అలాగే, 14 ఏళ్ల సీఎంగా ఉండి రాష్ట్రానికి ఏమీచేయని చవట సన్నాసి చంద్రబాబు అని మంత్రి మండిపడ్డారు. నోరు పారేసుకుని విర్రవీగే వారందరికీ ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఇక వికేంద్రీకరణను రాయలసీమ వాసులు కోరుకుంటున్నారని, అందుకే వారంతా మూడు రాజధానులకు మద్దతుగా ప్లకార్డు పట్టుకున్నారని మంత్రి జోగి రమేష్ తెలిపారు. దీనిని తట్టుకోలేక ఫ్రస్ట్రేషన్‌లోకి వెళ్లిన చంద్రబాబు ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. చంద్రబాబు తిట్టడంతో పాటు పట్టాభి నుంచి పవన్ వరకూ ఏమేమి తిట్లాలో కూడా చంద్రబాబే చెప్తున్నాడన్నారు. ఎంగిలి మెతుకులకు ఆశపడే వ్యక్తి చంద్రబాబు అని మంత్రి మండిపడ్డారు. ఇక పవన్ సైకో బ్యాచ్‌లు పెట్రోలు పోసి ఫ్లెక్సీలు, కటౌట్లు తగుల పెడుతున్నారన్నారు.

జబ్బులు బాబోయ్!

దేశంలో ప్రతి వెయ్యి మందిలో 39 మందికి తీవ్రమైన అనారోగ్యం

సాక్షి, అమరావతి: దేశంలో జబ్బులు తీవ్రంగా ఉన్నాయి. తీవ్ర అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారు. దేశంలో ప్రతి వెయ్యి మందిలో 39 మంది తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. 37 మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. 75వ జాతీయ నమూనా సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో అనారోగ్య ప్రాబల్యంపై 75వ జాతీయ నమూనా సర్వేను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ నివేదిక రూపంలో విడుదల చేసింది. దేశంలో ప్రతి వెయ్యి మందిలో ఏడుగురు జీవనశైలి జబ్బులు.. అంటే బీపీ, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులు, నలుగురు గుండె, రక్తనాళాల జబ్బుల బారిన పడుతున్నట్లు నివేదిక తెలిపింది. ప్రతి వెయ్యి మందిలో ఆరుగురు వైకల్యంతో బాధపడుతున్నట్లు పేర్కొంది. కేరళ, పంజాబ్, ఒడిశా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలో ఎక్కువ శాతం తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపింది. కేరళ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గోవాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్లు వారు ఎక్కువ ఉన్నట్లు పేర్కొంది. బిహార్, అస్సాం, గోవా, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయల్లో తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారి సంఖ్య తక్కువగా ఉంది. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో ఉన్న వారు బిహార్, ఉత్తరాఖండ్, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువగా ఉన్నట్లు పేర్కొంది. జీవనశైలి జబ్బులతో పాటు గుండె, రక్తనాళాల జబ్బులు, అంటువ్యాధులతో బాధపడుతున్న వారు కేరళలో అత్యధికంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది.



కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



విజయనగరం జిల్లా జామిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

గడప గడపకు మన ప్రభుత్వం



నంద్యాల జిల్లా కడమలకాల్వలో మహిళలకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 31వ డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లు అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతులు



పలు చోట్ల పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పలువురు జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారికి వివిధ చోట్ల పోస్టింగ్‌లు ఇస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. సత్తెనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.కిరణ్‌కుమార్‌ను నంద్యాల రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమించింది. గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజేష్‌ను ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జిగా, తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి బి.పద్మను రాజమహేంద్రవరం రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి(ఫాస్ట్ ట్రాక్ కోర్టు)గా నియమించింది. కందూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.వాణిని బాపట్ల అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రమీలారాణిని రాజోలు సీనియర్ సివిల్ జడ్జిగా, తూర్పుగోదావరి జిల్లా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుస్వామిని నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, నరసరావుపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణిని నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా, కడప మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసింను నూజివీడు సీనియర్ సివిల్ జడ్జిగా, ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాధాకృష్ణను విశాఖపట్నం ఏడో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.దుర్గావెంకటనాగసింధూరను విశాఖపట్నం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమించింది. అక్కడ పనిచేస్తున్న ఎస్.సుజాతను విశాఖపట్నం ప్రిన్సిపల్ సీనియర్ జడ్జిగా, విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ సునందమ్మను విజయవాడ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్(జువైనల్ కోర్టు)గా, అక్కడ పనిచేస్తున్న డి.సత్యవతిని విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా, విజయవాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ 11వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కె.కృష్ణసత్యలతను తణుకు సీనియర్ సివిల్ జడ్జిగా, గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటశేషమ్మను గుంటూరు రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి(ఫాస్ట్‌ట్రాక్)గా, గుంతకల్ జూనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్యను మచిలీపట్నం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా, అక్కడ పనిచేస్తున్న ఎ.పద్మను మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ జడ్జిగా నియమించారు. పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వెంకటేశ్వరరెడ్డిని విజయవాడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వై.శ్రీలక్ష్మిని గాజువాక అదనపు సీనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా, అక్కడ పనిచేస్తున్న ఎస్.శ్రీవిద్యను గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్రను పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జిగా, కడప స్పెషల్ మొబైల్ కోర్టు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్‌ను కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, అక్కడ పనిచేస్తున్న ఎస్.హేమలతను కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్‌ను కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, అక్కడ పనిచేస్తున్న టి.కేశవను కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. వీరంతా ఈ నెల 30వ తేదీలోపు కొత్త పోస్టుల్లో చేరాలని హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) సునీత ఉత్తర్వులు జారీ చేశారు.

అఫిడవిట్ ఇస్తేనే భవన నిర్మాణానికి అనుమతా?

- విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అప్పటి కమిషనర్ తీరుపై హైకోర్టు విస్మయం
- కమిషనర్ ఉత్తర్వుల రద్దు
- ఖర్చుల కింద పిటిషనర్‌కు రూ.25 వేలు చెల్లించాలని ఆదేశం



సాక్షి, అమరావతి: విజయవాడ మెట్రో కారిడార్‌కు ఎలాంటి అభ్యంతరం తెలపకుండా, ఎలాంటి పరిహారం కోరకుండా భూమిని ఉచితంగా అందజేస్తానంటూ అఫిడవిట్ ఇస్తేనే భవన నిర్మాణానికి అనుమతినిస్తామని 2016లో అప్పటి విజయవాడ మునిసిపల్ కమిషనర్ షరతు విధించడంపై హైకోర్టు మండిపడింది. అంతేకాకుండా అందుకు అంగీకరించకపోవడంతో మునిసిపల్ కమిషనర్ భవన నిర్మాణానికి అనుమతిని నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేసింది. మునిసిపల్ కమిషనర్ ఉత్తర్వులను చట్ట విరుద్ధమని, ఏకపక్షమని, అహేతుకమని ప్రకటించింది. అంతేకాకుండా అప్పటి విజయవాడ మునిసిపల్ కమిషనర్ రూ.25 వేలను ఖర్చుల కింద పిటిషనర్‌కు చెల్లించాలని ఆదేశించింది. పరిహారం కోరకుండా ఉచితంగా స్థలం ఇవ్వాలని కోరడం పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ఆస్తి హక్కును హరించడమే అవుతుందని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ ఇటీవల తీర్పు వెలువరించారు. అప్పటి కమిషనర్ ప్రస్తుతం ఇతర పోస్టులో ఉన్నా, పదవీ విరమణ చేసినా కూడా ఆయనకు ఈ తీర్పు కాపీని పంపాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. పిటిషనర్ భవన నిర్మాణానికి అనుమతినిచ్చే విషయాన్ని తాజాగా పరిశీలించాలని విజయవాడ మునిసిపల్ అధికారులకు న్యాయమూర్తి సూచించారు. విజయవాడ బందరు రోడ్డులో 346 చదరపు గజాల స్థలాన్ని వేణుగోపాలరావు అనే వ్యక్తి నుంచి బొమ్మదేవర వెంకట సుబ్బారావు అనే వ్యక్తి కొనుగోలు చేశారు. ఈ స్థలంలో భవన నిర్మాణం అనుమతినివ్వాలంటే మెట్రో కారిడార్ నిర్మాణం కోసం భూమి అవసరమైనప్పుడు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా, ఎలాంటి పరిహారం కోరకుండా భూమిని ఉచితంగా ఇస్తానని అఫిడవిట్ ఇవ్వాలని కమిషనర్ 2016లో ఉత్తర్వులు ఇచ్చారు, ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుబ్బారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

చంద్రబాబువి దుర్మార్గపు రాజకీయాలు

మంత్రి గుమ్మనూరు జయరామ్, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం

కర్నూలు (రాజ్‌విహార్): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు దుర్మార్గపు రాజకీయాలకు బీజం వేశారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కర్నూలు పర్యటనలో ప్రజలు, విద్యార్థులు, ప్రజా సంఘాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడమే కాకుండా, తన మనుషులతో దాడులు చేయించారని ధ్వజమెత్తారు. శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మా ప్రాంతానికి వచ్చి ఇక్కడి ప్రజలనే రెచ్చగొడతారా? ఏకైక రాజధాని అమరావతికే ఒప్పుకోండంటూ బెదిరిస్తారా? మీ ఉడత బెదిరింపులకు మేము బెదిరిపోవాలా? మా ప్రాంత ప్రజలను, మమ్మల్ని కించపరుస్తూ మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా? ఇంకోసారిలా నోరు పారేసుకుంటే ప్రజలు తరిమి తరిమి కొడతారు' అంటూ నిప్పులు చెరిగారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గూండాలంటూ పదేపదే చెప్పడం సరైంది కాదని, అదే నిజమైతే ఈపాటికే టీడీపీని భూస్థాపితం చేసేవాళ్లమని అన్నారు. తమ అధినేత, సీఎం వైఎస్ జగన్ తమను అదుపు చేయకపోతే అదేపని చేసి చూపుతామని హెచ్చరించారు. వయసు మళ్లిన బాబు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, ఎన్ని జిత్తులు వేసినా ఆ ముసలి నక్కను ప్రజలు నమ్మే పరిస్థితులు లేవని చెప్పారు. పేకాట, అక్రమ మద్యం, ఇసుక వ్యాపారాలంటూ తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే సగం మీసం తీసేసుకుంటానని, లేకపోతే సగం గడ్డం తొలగించుకుని తిరుగుతావా బాబూ? అంటూ సవాల్ విసిరారు. ఆయనలో సీమ రక్తం ఉంటే తన సవాల్ స్వీకరించాలని సూచించారు. చంద్రబాబుకు 2019లోనే చివరి ఎన్నికలు అయిపోయాయని, 2024లో ఆయన పోటీ చేయరన్నారు. ఆ ఎన్నికల తర్వాత ఆయన వైఎస్సార్‌సీపీలోకి వస్తే ఎమ్మెల్సీ పదవి ఇస్తామని, లోకేష్‌కు కార్పొరేటర్ టికెట్ ఇచ్చినా గెలవలేని కారణంగా నామినేటెడ్ కింద కో ఆప్షన్ మెంబర్‌గా ఇస్తామని చెప్పారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబుకు మెదడు కుంచించుకుపోవడంతో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని చెప్పారు. సీమ విద్యార్థులు, న్యాయవాదులు, ప్రజా సంఘాలను రెచ్చగొట్టడంతో పాటు, వారిపై దాడులు చేయించిన బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజధాని ఒకే చోట అమరావతిలో నిర్మిస్తే భవిష్యత్తులో సీమ వాసులను తరిమే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ సిద్ధపడితే చంద్రబాబు సీమ ద్రోహిగా మారి అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు.

కర్నూలు ప్రజలు ఒకే రాజధాని కావాలంటున్నారు

- నా సభలకు ఎప్పుడూ చూడనంత మంది జనం వస్తున్నారు
- టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు
- పోలీసులపై ఓ నేత అనుచిత వ్యాఖ్యలు
- మేజిస్ట్రేట్ ముందు వారిపై అబద్ధాలు చెప్పాలని ఓ నేత హితవు

సాక్షి, అమరావతి: అధికార వికేంద్రీకరణ గురించి కర్నూలులో అడిగితే అక్కడి ప్రజలు ముక్తకంఠంతో ఒకే రాజధాని కావాలని నినదించారని ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారు. కర్నూలును మెగా సిటీగా, విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని చెప్పామన్నారు. జగన్ రాయలసీమ, ఉత్తరాంధ్ర ద్రోహి అని విమర్శించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తన జీవితంలో పోలీసులు, ప్రభుత్వం ఇలా వ్యవహరించడాన్ని చూడలేదన్నారు. ఈ పోలీసులకు సిగ్గుందా అని ప్రశ్నించారు. నందిగామ, కర్నూలులో తన సభలకు జీవితంలో ఎప్పుడూ చూడనంత జనం వచ్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోతే, రాష్ట్రాన్ని కాపాడే శక్తి ఎవరికీ ఉండదని చంద్రబాబు చెప్పారు. మళ్లీ సీఎంగానే తాను అసెంబ్లీకి వెళ్తానని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవకపోతే రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందన్నారు. పోలీసులు పెడుతున్న కేసులపై నేతలు తొడకొట్టి బదులివ్వాలని చెప్పారు. జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేయడం ద్వారా అడ్డులేకుండా చూసుకుంటున్నారని ఆరోపించారు. తన హయాంలో అమలుచేసిన పథకాలు నిలిపివేశారని, టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు.



మాట్లాడుతున్న చెంగల్రాయుడు

'ఇదేం ఖర్మ'కు శ్రీకారం

ఇక టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాల గురించి చెప్పాలని ఇందుకోసం 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. అలాగే, 175 నియోజకవర్గాల్లో లీగల్ టీములు పనిచేస్తున్నాయని, పోలీసు కేసులు, ఇతర విషయాల్లో వారి సహకారం తీసుకోవాలని సూచించారు. కుప్పం నియోజకవర్గంలో తనకిప్పుడు లాయర్లను వెతుక్కునే పరిస్థితి వచ్చిందని చెప్పారు.

పోలీసు నా కొడుకులు ఫోన్ చేస్తే రికార్డు చేయండి.. జడ్జిల ముందు అబద్ధాలు చెప్పండి

ఈ సమావేశంలో చంద్రబాబు సమక్షంలో రైల్వే కోడూరుకు చెందిన టీడీపీ నేత బత్యాల చెంగల్రాయుడు పోలీసులను దుర్భాషలాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. పోలీసు నా కొడుకులు ఫోన్ చేస్తే రికార్డు చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు వాయిస్ రికార్డు చేయాలని, పోలీసులను భయపెట్టేలా మాట్లాడాలని, బెదిరించాలని సలహా ఇచ్చారు. 'పోలీసులు కోర్టుకు తీసుకెళ్తే మేజిస్ట్రేట్ చెప్పుకునేది ఏమైనా ఉందా అని అడుగుతారు. అప్పుడు అబద్ధాలు చెప్పండి. పోలీసులు ఎగిసెగిసి తన్నారని చెప్పాలి. చెప్పరాని చోటులో ఈ పోలీసులు ముగ్గురు ఎగిరి తన్నారు. చాలా నొప్పిగా ఉందని యాక్షన్ చేయాలి. అప్పుడు నా కొడుకులకు ఖాకీ గుడ్డలు ఊడిపోతాయి' అంటూ కార్యకర్తలకు ఆయన సలహాలిచ్చారు. పోలీసులను ఎలా ఇబ్బంది పెట్టాలో, తప్పు చేసి ఎలా తప్పించుకోవాలో ఆయన కార్యకర్తలకు శిక్షణ తరహాలో వివరించారు.

రాజధానిగా అమరావతిని చంద్రబాబు ఏకపక్షంగా ప్రకటించారు

దొనకొండను రాజధాని చేయమన్నాం.. బాబు పట్టించుకోలేదు

అక్కడ సానుకూల అంశాలను ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఆయనకు వివరించారు

- శివరామకృష్ణన్ కమిటీ కూడా అమరావతి ప్రాంతం వద్దనే చెప్పింది
- నందనవనం లాంటి డెల్టా భూములను నాశనం చేశారు
- దొనకొండలో లక్ష ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి
- నిర్మాణ వ్యయం తక్కువ.. డ్రైనేజీ సమస్య ఉండదు
- రెండు విభజనల్లోనూ సీమకు అన్యాయమే జరిగింది
- వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాలకు మేలు జరుగుతుంది

'సాక్షి'తో ఏపీ మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం తప్పని ఏపీ మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి చెప్పారు. ఉన్నత విద్యావంతులు, ఉన్నత పదవుల్లో ఉన్న తాము సిటిజన్స్ ఫోరంగా ఏర్పడి ఈ విషయంపై చంద్రబాబుతో మాట్లాడినా పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్ర విభజన పరిణామాలు, పలు ఇతర అంశాలపై ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'రాజధాని ఏర్పాటుపై అన్ని పార్టీలు, అన్ని ప్రాంతాల ప్రజల అభిప్రాయం తీసుకోవాలని కూడా చంద్రబాబుకు సూచించాం. రాజధానికి దొనకొండ అన్ని విధాలా తగిన ప్రాంతమని చెప్పాం. అందుకు 10 సానుకూల అంశాలను ఆయన ముందుంచాం. వెనుకబడ్డ ఆ ప్రాంతంలో ప్రభుత్వ భూములు లక్ష ఎకరాలకు పైగా ఉన్నాయి. నిర్మాణ వ్యయం కూడా తక్కువ. రాజధాని ఏర్పాటుతో ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభించేది. పైగా సముద్ర మట్టానికి ఎత్తులో ఉన్న ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య కూడా ఉండదు. ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా చంద్రబాబు మాత్రం నిర్మాణాలకు ఏ విధంగానూ అనువుగా లేని అమరావతినే ఎంచుకున్నారు. ఎలాంటి ఆలోచనా లేకుండా అప్పటికప్పుడు అమరావతి పేరు ప్రకటించారు. నిత్యం పంటలతో నందనవనంలా కళకళలాడే కృష్ణా డెల్టాలో కాంక్రీట్ పోసి నాశనం చేశారు. శివరామకృష్ణన్ కమిటీ కూడా అమరావతి ప్రాంతం తప్ప మరెక్కడైనా రాజధాని నిర్మించాలని సూచించినా చంద్రబాబు పరిగణనలోకి తీసుకోలేదు' అని వివరించారు.

వికేంద్రీకరణ చాలా అవసరం

పరిపాలన వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, ప్రాంతీయ అసమానతలు తొలగించవచ్చని తెలిపారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తే విజయవాడ, విశాఖలో బెంచ్‌లు పెట్టాలని అన్నారు. పరిపాలన కోసం నాలుగు జోన్లలోనూ డివిజనల్ కార్యాలయాలు పెట్టి, సచివాలయ అధికారాలు వాటికి బదిలీ చేయాలని, అప్పుడు ప్రజలకు వేగంగా సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. ఇటీవల రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు బాగుందని, కోస్తా, కృష్ణా డెల్టా ప్రాంతాలు లాభపడుతున్నాయని అన్నారు. నెల్లూరు – తిరుపతి మధ్య కూడా పరిశ్రమలు వచ్చాయని, కర్నూలు ప్రాంతం మాత్రం వెనుకబడి పోయిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో అధికంగా పెట్టుబడులు పెట్టడం వల్ల అక్కడ సర్‌ప్లస్ ఆదాయాన్ని అన్ని జిల్లాలకు పంచేవారన్నారు. విడిపోయాక రాష్ట్ర ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని, ఈ పరిస్థితి మరోసారి రాకూడదంటే అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరగాలని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంపై దృష్టి పెట్టిందని, ఇది కోవిడ్ కష్టకాలంలో ప్రజలకు ఎంతో మేలు చేసిందని అన్నారు. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెడుతుందని ఆంజనేయరెడ్డి చెప్పారు.

పోలవరంపైనా బాబు తప్పుడు నిర్ణయం

కేంద్ర పరిధిలోని పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు తీసుకోవడమే పెద్ద పొరపాటుగా ఆంజనేయరెడ్డి తెలిపారు. ఆయన తప్పిదం వల్ల ఇప్పుడు ఎస్కలేషన్ ఖర్చే దాదాపు రూ.60 వేల కోట్లకు పెరిగిపోయిందన్నారు. లేదంటే కేంద్రమే ప్రాజెక్టును పూర్తిచేసి ఇచ్చేదని చెప్పారు. మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు సమయంలోనే రాయలసీమ ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలన్న డిమాండ్ వచ్చిందని తెలిపారు. ఆనాడు కర్నూలును రాజధానిగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ విడిపోయాక కూడా సీమకే అన్యాయం జరిగిందన్నారు. ఆనాడు కర్నూలును అభివృద్ధి చేసి ఉంటే సీమ బాగుపడేదని, అమరావతి వల్ల ఎక్కువగా నష్టపోయింది రాయలసీమేనని అన్నారు. ఆ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మైనింగ్, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు స్థాపించాలని సూచించారు. కేవలం ఐటీ పరిశ్రమ వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందదని, ప్రాంతాన్ని బట్టి అనువైన పరిశ్రమలు రావాలని చెప్పారు.

వికేంద్రీకరణపై మీ వైఖరేంటి?

- ఒకే రాజధానిగా అమరావతి ఎందుకు ఉండాలో చెప్పండి
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ప్రశ్నించిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- కర్నూలులో ప్రజలు ఇదే ప్రశ్నిస్తే బూతులతో ఎదురు దాడి చేస్తావా?
- వికేంద్రీకరణే సీఎం జగన్ విధానం
- అన్ని చిట్‌ఫండ్స్‌లో తనిఖీలు చేసినట్లే.. మార్గదర్శిలోనూ తనిఖీలు

సాక్షి, అమరావతి: వికేంద్రీకరణపై వైఖరేమిటో చెప్పాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కనీసం ఒకే రాజధాని అమరావతి కేంద్రీకృతంగా ఎందుకు ఉండాలో చెప్పాలని నిలదీశారు. 'కర్నూలులో చంద్రబాబు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నాం. రాయలసీమలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధం. అసెంబ్లీలో చర్చిద్దాం రండి. మీ బండారం బయటపెడతాం' అంటూ ప్రతి సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ప్రజలను తిట్టడానికి ఏం హక్కుంది బాబూ?

- తమ ఆకాంక్షల మేరకు న్యాయ రాజధానిగా కర్నూలును ఏర్పాటు చేయడంపై మీ వైఖరేమిటని ప్రశ్నించిన ప్రజలకు సమాధానం చెప్పకుండా వారిని తిట్టే హక్కు చంద్రబాబుకు ఎవరు ఇచ్చారు?
- పట్టాభి నుంచి దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, చంద్రబాబు వరకూ ప్రజలపై బూతులతో ఎదురు దాడికి దిగుతున్నారు. టీడీపీ అంటే తిట్లు, దూషణలు, పచ్చిబూతుల పార్టీగా నిరూపించుకుంటున్నారు. ఇవే తనకు చివరి ఎన్నికలని చంద్రబాబు అంటే.. ప్రజలకు ఇవే చివరి ఎన్నికలని ఎల్లో మీడియా చెబుతోంది. ఇది ఆఖరిఛాన్స్.. లేకపోతే నాశనం అవుతారని ప్రజలకు శాపం పెడతారా?



ప్రజల ఆకాంక్షల మేరకే వికేంద్రీకరణ

- 1937లో శ్రీబాగ్ ఒడంబడిక కుదిరినప్పటి నుంచే వికేంద్రీకరణ డిమాండ్ ఉంది. రాష్ట్ర విభజన తర్వాత వికేంద్రీకరణపై విస్తృతమైన చర్చ జరిగింది. శ్రీకృష్ణ కమిషన్, శివరామకృష్ణన్ కమిటీలు వికేంద్రీకరణ ఆవశ్యకతను నొక్కిచెప్పినా నాటి సీఎం చంద్రబాబు పట్టించుకోలేదు. సరైన రోడ్డు సౌకర్యం లేని ప్రాంతంలో రాజధాని పెట్టారు.
- అక్కడ రాజధాని నిర్మించాలంటే ఏళ్లపాటు రాష్ట్ర బడ్జెట్‌ను మొత్తం అక్కడే వెచ్చించాల్సి ఉంటుంది. ఇది మిగతా ప్రాంతాలకు అన్యాయం చేయడమే. అందువల్లే రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే అంశాన్ని అమరావతి ప్రాంతం ప్రజలకు చెబుతున్నాం. అక్కడా బైపాస్ రోడ్డు నిర్మిస్తూ, కరకట్ట రోడ్డును అభివృద్ధి చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్ ఎన్నడూ అమరావతిలోనే రాజధాని రావాలని కోరలేదు.

బాబుకూ ఆ కోరిక ఉందేమో!

- మొన్న ఇప్పటంలో ఇళ్లు కూల్చకున్నా, కూల్చినట్లు చెప్పు చూపుతూ దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ వైఎస్సార్‌సీపీ నేతలపై రెచ్చిపోయారు. కర్నూలులో తనను నిలదీసిన ప్రజలపై ఆగ్రహంతో ఊగిపోతూ తనకు సభ్యత ఉంది కాబట్టే చెప్పు చూపించడం లేదని జనంపై చంద్రబాబు విరుచుకుపడ్డారు. అంటే పవన్ కళ్యాణ్ అసభ్యంగా వ్యవహరించాడని చంద్రబాబు ఒప్పుకున్నట్లే. లేదంటే తనకూ ఆ కోరిక ఉందని బహిర్గతం చేసినట్లే. 'ఇదేం ఖర్మ' అంటూ ప్రజలు టీడీపీని తిరస్కరించారనే విషయాన్ని గుర్తుంచుకోండి.
- రాష్ట్రంలోని అన్ని చిట్‌ఫండ్ కంపెనీలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌లు, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు దాడులు చేస్తే.. తమపై ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందని 'ఈనాడు' రామోజీరావు అనడం హేయం.



యెహోవా యందు భయభక్తులు గలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము. పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం
దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం
తిథి: బ.ఏకాదశి ఉ.7.25 వరకు
తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** హస్త రా.10.37 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.6.27 నుండి 8.07 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.51 నుండి 4.34 వరకు, **అమృతఘడియలు:** సా.4.23 నుండి 8.06 వరకు.

సూర్యోదయం : 6.11
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అజయ్ మాకన్ (కాంగ్రెస్) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఖర్గే పిలిపిస్తే వెళ్లాను.

అక్బర్ రోడ్డులోని ఎ.ఐ.సి.సి. ప్రధాన కార్యాలయానికి ఆయన నన్ను పిలిపించలేదు. సఫ్దర్‌జంగ్ రోడ్డులోని తన నివాస గృహానికి పిలిపించారు!

నేను వెళ్లేసరికి నా రాజీనామా లేఖ ఆయన కూర్చొని ఉన్న సోఫా ముందరి టీపాయ్ మీద చిన్నపాటి బరువుతో.. తండ్రి గుప్పెటలో బిగిసి ఉన్న తన చూపుడు వేలును విడిపించుకుని ముందుకు నడిచేందుకు ప్రయత్నిస్తున్న పిల్లవాడిలా ఉంది.

"ఏమిటిది అజయ్?" అన్నారు ఖర్గే... ఒక తండ్రిలాగే!

ఎందుకు రాజీనామా చేశావు అని అడగలేదు ఆయన! "ఎలాంటి సమయంలో నువ్వు రాజీనామా చేశావో తెలుసా?" అన్నారు!

"జోడో యాత్ర రాజస్థాన్‌లో ప్రవేశిస్తున్న సమయంలో.. రాజస్థాన్‌లో ఒక ఉప ఎన్నిక కూడా జరగబోతున్న సమయంలో.. పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్‌కు ఇన్‌చార్జి అయిన ఒక ప్రధాన కార్యదర్శి రాజీనామా చేశారంటే కాంగ్రెస్ ప్రతిష్ఠ ఏమౌతుందో ఆలోచించావా అజయ్!" అన్నారు.



"పార్టీ ప్రతిష్ఠకు ఏమీ కాకుండా ఉండేందుకే రాజీనామా చేశాను ఖర్గేజీ.." అన్నాను.

అప్పుడు కూడా ఆయన.. "రాజీనామా చేసి ఎక్కడికెళతావ్?" అన్నారే గానీ.. పార్టీ ప్రతిష్ఠకు వచ్చిన ముప్పు ఏమిటని గానీ, ఎందుకు రాజీనామా చేశావు అని గానీ అడగలేదు!

"రాజీనామా చేసి ఎక్కడికీ వెళ్లబోవడం లేదు ఖర్గేజీ! ఢిల్లీలోనే ఉంటాను. కార్మిక సంఘాలను సంఘటితం చేస్తాను. ఎన్జీవోలతో మమేకం అవుతాను. ఢిల్లీ వాయు కాలుష్యంపై గళమెత్తుతాను. వీధి వర్తకుల సంక్షేమం కోసం కృషి చేస్తాను. మురికివాడల పురోభివృద్ధికి పాటు పడతాను.." అన్నాను.

ఒక్కసారిగా భళ్లున నవ్వారు ఖర్గే!

కోపంతో ఇల్లొదిలి వెళ్తున్న కొడుకుని ఆపి, 'బయటికెళ్లి ఎలా బతుకుతావ్‌రా..' అని అతి సంపన్నుడైన తండ్రి ప్రశ్నిస్తే.. 'ఎలాగైనా బతుకుతాను. మూటలు మోస్తాను. ముష్టెత్తుకుంటాను. ఆటో నడుపుతాను. హోటళ్లలో ప్లేట్లు కడుగుతాను. ఇంటికైతే రాను..' అని కొడుకు అన్నప్పుడు ఆ తండ్రి నవ్విన నవ్వులా ఉంది ఖర్గే నవ్వడం.

నవ్వీ నవ్వీ.. హఠాత్తుగా గంభీరంగా మారి, "పార్టీకి అధ్యక్షుడిగా ఉండటం అన్నది పార్టీ అప్పగించిన బాధ్యతలకు రాజీనామా చేసి వెళ్లిపోయినంత సులభం కాదు అజయ్.." అన్నారు ఖర్గే!

"గెహ్లోత్ మీద క్రమశిక్షణ చర్య తీసుకోవడం కూడా సులభం కాదా ఖర్గేజీ?!" అన్నాను.

అందుకు ఆయనేమీ మాట్లాడలేదు.

"రాజస్థాన్ సీఎంగా ఉండిపోవడానికి గెహ్లోత్ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతను కూడా తప్పించుకున్నారు. కానీ అతడిపై చర్యలేదు! సోనియాజీ మిమ్మల్నీ, నన్ను రాజస్థాన్‌కు పంపి పెట్టించిన సీఎల్పీ మీటింగ్‌కి తన ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా రాకుండా వారితో గెహ్లోత్ తిరుగుబాటు చేయించారు. కానీ అతడిపై చర్యలేదు. ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలలో ముగ్గురితో కలిసి నన్ను భారత్ జోడో యాత్రకు వెళ్లమంటున్నారు. అందుకే రాజీనామా చేస్తున్నాను. నా ప్రతిష్ఠ కోసం కాదు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ కోసం.." అన్నాను.

ఖర్గే నా వైపు ప్రయాసగా చూశారు.

"గెహ్లోత్ తన ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేయించారు. నువ్వు నీ రాజీనామాతో తిరుగుబాటు చేస్తున్నావు. అంతే కదా? పార్టీ అధ్యక్షుడికి అతి కష్టమైన పనేంటో తెలుసా అజయ్? క్రమశిక్షణ చర్య తీసుకోవడం! పార్టీలోని నాయకులకు అతి సులువైన పనేంటో తెలుసా అజయ్? క్రమశిక్షణ చర్యకు అధ్యక్షుడిపై ఒత్తిడి తేకుండా ఉండటం! సులభమైన పనినే పార్టీ నాయకులు చేయలేక పోతున్నప్పుడు.. కష్టమైన పనిని పార్టీ అధ్యక్షుడు ఎలా చెయ్యగలడో చెప్పు" అన్నారు!!

ఊరేగుతున్న ఉన్మాదం



జనతంత్రం

వర్ధెల్లి మురళి

'**కా**మాతురాణాం న భయం న లజ్జ' అన్నారు పెద్దలు. కామంతో కళ్లు మూసుకుపోయిన వాడికి సిగ్గు గానీ, భయం గానీ ఉండవని అర్థం. క్రోధంతో కళ్లు మూసుకుపోయిన వారి సంగతి కూడా అంతే! కక్షతోనూ, అసూయతోనూ, నిస్పృహ తోనూ కళ్లు మూసుకుపోయిన వారి పరిస్థితీ అంతే! అటువంటి దశలో ఉన్నవారు మాట్లాడే భాష సభ్యతా సంస్కారాల ఛందస్సును ధిక్కరిస్తుంది. 'పోగాలము దాపురించినవారు దీప నిర్వాణ గంధమును ఆఘ్రాణించలేరు. అరుంధతీ నక్షత్రాన్ని కనలేరు. మిత్రవాక్యాన్ని వినలేరు' అనే సూక్తి మనకు ఉండనే ఉన్నది. దిగజారిన రాజకీయాలతో విసుగెత్తి ఒకాయన 'పాలిటిక్స్ ఈజ్ ది లాస్ట్ రిసార్ట్ ఆఫ్ ఎ స్కౌండ్రల్' అని వ్యాఖ్యానించారు. అట్లాగే పొలిటీషియన్లకు చిట్టచివరి అస్త్రం – సానుభూతి. అది కూడా విఫలమైనప్పుడు ఏం చేస్తారు? సంస్కారం అటకెక్కుతుంది. క్రోధం కళ్లను కప్పేస్తుంది. అసూయ, ద్వేషాలు వివేకాన్ని నిద్రపుచ్చుతాయి. కంఠస్వరం నుంచి కాలకేయుల భాష దూసుకొస్తుంది. ఉన్మాద స్థితి ఊరేగింపు తీస్తుంది.

కర్నూలు జిల్లా పర్యటనలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు విపరీత ప్రవర్తన చూసి జనం విస్తుపోతున్నారు. ఈ పర్యటనను తెలుగుదేశం పార్టీ వారు ఒక వ్యూహం ప్రకారం చాలా శ్రద్ధగా డిజైన్ చేశారు. కర్నూలు జిల్లా ప్రజలు అధికార వికేంద్రీకరణను కోరుకోవడం లేదని, కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు కూడా వారికి ఇష్టం లేదని ఈ పర్యటన ద్వారా లోకాన్ని భ్రమింపజేయాలని తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా కలిసి ఈ పథకాన్ని రచించాయి. ఆయన సభలు జన సందోహంతో కిక్కిరిసినట్టు కనిపించేలా కొన్ని వీధి కూడళ్లను ఎంపిక చేశాయి. ఆ కూడళ్లలోకి నాలుగైదు వేల మందిని సమీకరిస్తే పెద్దఎత్తున జనం పాల్గొన్నట్టు కనిపిస్తుంది. ఆమాత్రం సమీకరణకు కూడా పార్టీ బలం చాలకపోవడంతో దిన వేతనంపై ఎక్కువమంది సాధారణ ప్రజలను సమీకరించారు. వారిలో కొందరిని మిద్దెలపైకి ఎక్కించారు.

ఈమధ్యకాలంలో జనసందోహానికి మొహంవాచి ఉన్న అధినేత డూప్ జనాన్ని చూసి పరవశించిపోయారు. ఆ పరవశం కారణంగా రాజకీయాల్లో చిట్టచివరిగా వాడవలసిన సానుభూతి ఆయుధాన్ని యథాలాపంగా వాడిపారేశారు. 'మీరు ఓట్లు వేసి గెలిపించకపోతే ఇవే నాకు చివరి ఎన్నికలవుతాయ'ని బేలగా వాపోయారు. ఈ చివరి ఆయుధానికి స్పందనగా 'నో... నో' అని జనం హోరెత్తుతారని బహుశా ఆయన ఆశించి ఉండవచ్చు. 'మీకు ఇవి చివరి ఎన్నికలు కావు, మళ్లీ మళ్లీ మీరే గెలుస్తారు' అనే సమాధానాలు వారి నుంచి ఊహించి ఉండవచ్చు. జాతీయస్థాయి నినాదాల టైప్‌లో 'జబ్ తక్ సూరజ్, చాంద్ రహేగా తబ్ తక్ ఆంధ్రామే బాబు రహేగా' అంటారని కూడా స్వప్నించి ఉండవచ్చు. లాలూ యాదవ్ బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆర్జేడీ కార్యకర్తలు ఈ జాతీయ నినాదాన్ని లోకలైజ్ చేశారు. 'జబ్ తక్ రహేగా సమోసామే ఆలూ... తబ్ తక్ రహేగా బిహార్ మే లాలూ' అనేవారు. అటువంటి సృజనాత్మకతతో మనవాళ్లు కూడా మిరపకాయ బజ్జీలో మిర్చీ దాగినంతకాలం, ఉప్మాలో ఉల్లిపాయ వేగినంతకాలం బాబు రాజకీయాల్లో ఉంటారనే నినాదాలు వినిపిస్తారని ఆశించిన వారికి నిరుత్సాహమే మిగిలింది. సభికుల్లో అధికులు పేటీఎమ్ బ్యాచ్ కనుక ఉలుకు పలుకు లేకుండా ఉండిపోయారు. కొద్దిమంది కార్యకర్తల కేరింతలు క్లైమాక్స్ సన్నివేశాన్ని రక్తి కట్టించలేకపోయాయి. ఆ విధంగా ఆఖరి బాణం విఫలమైంది. ఆ తర్వాత? చివరకు మిగిలేది ఉక్రోషమే!

ఆఖరి రోజు కర్నూలు పట్టణంలో బాబులోని ఉక్రోషం బయటకొచ్చింది. పార్టీ కార్యాలయానికి ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అక్కడికి కొంచెం దూరంలో నిలబడి విద్యార్థులు, లాయర్లతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కర్నూలులో న్యాయ రాజధానికి అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు. వారిని రెచ్చగొట్టడానికి చంద్రబాబు ప్రయత్నించారు. రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతే ఉండాలని గట్టిగా చెబుతూ పార్టీ కార్యకర్తలు కూడా అనాలని వారిని బలవంతపెట్టారు. దీంతో మరింత బిగ్గరగా జేఏసీ సభ్యులు బాబుకు నిరసన తెలిపారు. సీనియర్ మోస్ట్ రాజకీయ వేత్త వెంటనే రెచ్చిపోయారు.

> కర్నూలు జిల్లా పర్యటనలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు విపరీత ప్రవర్తన చూసి జనం విస్తుపోతున్నారు. ఈ పర్యటనను తెలుగుదేశం పార్టీ వారు ఒక వ్యూహం ప్రకారం చాలా శ్రద్ధగా డిజైన్ చేశారు. కర్నూలు జిల్లా ప్రజలు అధికార వికేంద్రీకరణను కోరుకోవడం లేదని, కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు కూడా వారికి ఇష్టం లేదని ఈ పర్యటన ద్వారా లోకాన్ని భ్రమింపజేయాలని తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా కలిసి ఈ పథకాన్ని రచించాయి. ఆయన సభలు జన సందోహంతో కిక్కిరిసినట్టు కనిపించేలా కొన్ని వీధి కూడళ్లను ఎంపిక చేశాయి. ఆ కూడళ్లలోకి నాలుగైదు వేల మందిని సమీకరిస్తే పెద్దఎత్తున జనం పాల్గొన్నట్టు కనిపిస్తుంది. ఆమాత్రం సమీకరణకు కూడా పార్టీ బలం చాలకపోవడంతో దిన వేతనంపై ఎక్కువ మంది సాధారణ ప్రజలను సమీకరించారు. వారిలో కొందరిని మిద్దెలపైకి ఎక్కించారు.
>
> ఈమధ్యకాలంలో జనసందోహానికి మొహంవాచి ఉన్న అధినేత డూప్ జనాన్ని చూసి పరవశించిపోయారు. ఆ పరవశం కారణంగా రాజకీయాల్లో చిట్టచివరిగా వాడవలసిన సానుభూతి ఆయుధాన్ని యథాలాపంగా వాడిపారేశారు. మీరు ఓట్లు వేసి గెలిపించకపోతే ఇవే నాకు చివరి ఎన్నికలవుతాయని బేలగా వాపోయారు. ఈ చివరి ఆయుధానికి స్పందనగా 'నో... నో' అని జనం హోరెత్తుతారని బహుశా ఆయన ఆశించి ఉండవచ్చు. 'మీకు ఇవి చివరి ఎన్నికలు కావు, మళ్లీ మళ్లీ మీరే గెలుస్తారు' అనే సమాధానాలు వారి నుంచి ఊహించి ఉండవచ్చు. జాతీయస్థాయి నినాదాల టైప్‌లో 'జబ్ తక్ సూరజ్, చాంద్ రహేగా తబ్ తక్ ఆంధ్రామే బాబు రహేగా' అంటారని కూడా స్వప్నించి ఉండవచ్చు.

లాయర్లు, విద్యార్థుల మీద బాబు నోటి వెంట అసభ్యరత్నాలు రాలడం మొదలైంది. ''పనికిమాలిన వ్యక్తుల్లారా... నేరాలు ఘోరాలు చేసే దరిద్రుల్లారా... రేయ్ వాణ్ణి తన్ను.. రేయ్ రారా చూపిస్తా... మా ఆఫీసుకే వస్తార్రా మీరు... ఎంత ధైర్యంరా మీకు... ధైర్యముంటే రాండ్రా గాడిద ల్లారా... బోడినాకొడుకులు తామాషాలాడతారా... రౌడీలకే రౌడీనిరా నేను.. తరిమి తరిమి కొట్టిస్తా... గుడ్డలిప్పదీసి కొట్టిస్తా..'' ఇలా లాఠీ లేకుండా నోటి తుంపర్లతోనే ఆయన ఛార్జ్ చేశారు. ఈ వాక్ప్రవాహంలో కొసమెరుపు ఏమిటంటే కక్కాల్సినంత అసభ్యాన్నంతా వెళ్లగక్కుతూనే ఆయన సభ్యతను కూడా అడ్డం పెట్టుకున్నారు. 'నన్ను రెచ్చగొట్టకండి. రెచ్చగొట్టిన వాళ్లంతా పతనమయ్యారు. నాకు వస్తున్న కోపానికి చెప్పు చూపించాలి. కానీ చూపించలేదు. అదీ నా సభ్యత' అని చెప్పుకున్నారు. ఈ సభ్యత బాణం పవన్ కల్యాణ్ మీద కావచ్చని సోషల్ మీడియా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈమధ్యనే పవన్ కల్యాణ్ ఒక సభలో ఆవేశంతో ఊగిపోతూ చెప్పు తీసి చూపించిన సంగతి అందరికీ తెలిసిందే. బాబు తన తాజా వ్యాఖ్యానం ద్వారా పవన్‌కు సభ్యత లేదని చెప్పదలుచుకున్నారా? అదే నిజమైతే ఆయనకు ఎందుకింత కోపం వచ్చింది? లోగుట్టు తెలిసిన పెరుమాళ్లే దీనికి సమాధానం చెప్పాలి.

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న చంద్రబాబునాయుడులో పెరుగుతున్న అసహనాన్నీ, నిస్పృహనూ అర్థం చేసుకోవచ్చు. అనుభవం కారణంగా క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను అంతో ఇంతో అంచనా వేయగలరనే అనుకోవాలి. అలా అంచనా వేయగలిగిన స్థితిలోనే ఉంటే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం సాధ్యం కాదనే విషయం అర్థమయ్యే ఉండాలి. అర్థం కాలేదు, తాము గెలవగలమనే భ్రాంతిలోనే నిజంగా ఉన్నాడంటే 'కుంజర యూథంబు దోమ కుత్తుక జొచ్చెన్' అనే వాక్యాన్ని అక్షరాల నమ్ముతున్న అమాయకుడై ఉండాలి. ఆయన అమాయకుడు కాదు, గుండెలు తీసిన మొనగాడనే విషయం లోకోత్తర వ్యావహారికం. కనుక అసలు విషయం ఆయనకు తెలుసనే అనుకోవాలి.

వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీని ఓడించడం దాదాపు అసాధ్యమన్న భావన ఎందుకు ఏర్పడింది? దానికి కారణాలున్నాయి. గడచిన ఎన్నికల్లో ఆ పార్టీకి 50 శాతం ఓట్లు వచ్చాయి. ఈ మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన పేదల అనుకూల విధానాలు, సాధించిన బలహీనవర్గాల సాధికారత, విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ మద్దతుదార్ల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. తమ గోబెల్స్ ప్రచారం ఫలితంగా అధికార పార్టీ ఓట్లలో రెండు మూడు శాతం ఓట్లను తగ్గించగలమనే నమ్మకంతో ఎల్లో మీడియా – తెలుగుదేశం పార్టీలు ఉన్నాయి. ఒకవేళ అదే నిజమని నమ్మినా, అధికార పార్టీకి పేదవర్గాల నుంచి కొత్తగా జమ కానున్న ఓట్లతో పోల్చితే ఈ సంఖ్య తక్కువే. ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతానికి తగ్గని ఓట్ల బ్యాలెన్స్‌తో ఉన్న అధికార పార్టీని ఓడించేదెట్లా?

రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదనే సామెత కూడా ఒకటున్నది. ఏవైనా అద్భుతాలు జరిగితే?... ఏమో... గుర్రం ఎగరావచ్చు అనే ఆశ ఏదో ఎల్లో కూటమిలో ఎక్కడో మిణుకు మిణుకుమంటూ ఉండేది. సదరు మిణుగురు ఆశను సాకారం చేసుకోవడానికి చాలాకాలం నుంచే ఎల్లో కూటమి ఒక ద్విముఖ వ్యూహాన్ని అమలుచేయడం మొదలుపెట్టింది. ఇందులో మొదటిది – సుడిగాలి మాదిరిగా సాగించే గోబెల్స్ ప్రచారంతో వైసీపీ మద్దతు ఓట్లను తగ్గించడం! రెండోది – కుడి నుంచి ఎడమకూ, ఎడమ నుంచి కుడికీ సమస్త పార్టీలనూ, రథ గజ తురగ పదాతి శ్రేణులన్నింటినీ తమకు అనుకూలంగా ఏకం చేసుకోవడం! ఈమధ్య పవన్ కల్యాణ్‌ను పరామర్శించినప్పుడు చంద్రబాబు ఉద్ఘాటించిన 'ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యత' అనే పిలుపులోని పరమార్థం ఇదే!

ఈ ఐక్యతలో ముందుగా జనసేనను కూటమిలో కలుపుకోవాలి. జనసేన గాలంతో బీజేపీ చేపను పట్టేయాలి. ఆ తర్వాత ఎలాగోలా కమ్యూనిస్టులను పట్టేయాలి. బీజేపీ ఉన్న కూటమిలోకి కమ్యూనిస్టులు ఎట్లా వస్తారు? 'ప్రజాస్వామ్య పరిరక్షణ' కోసం వస్తారు. సీపీఐ నాయకుల్లో కొందరు చంద్రబాబు పట్ల తమ వ్యామోహాన్ని బహిరంగంగానే ప్రదర్శించడం తెలిసిందే. వారి ద్వారా సీపీఎంకూ లైన్ వేయాలి.

> 'ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యత'లో ముందుగా జనసేనను కూటమిలో కలుపుకోవాలి. జనసేన గాలంతో బీజేపీ చేపను పట్టేయాలి. ఆ తర్వాత ఎలాగోలా కమ్యూనిస్టులను పట్టేయాలి. బీజేపీ ఉన్న కూటమిలోకి కమ్యూనిస్టులు ఎట్లా వస్తారు? 'ప్రజాస్వామ్య పరిరక్షణ' కోసం వస్తారు. సీపీఐ నాయకుల్లో కొందరు చంద్రబాబు పట్ల తమ వ్యామోహాన్ని బహిరంగంగానే ప్రదర్శించడం తెలిసిందే. వారి ద్వారా సీపీఎంకూ లైన్ వేయాలి. ఇంకా ఎక్కడన్నా చిన్నా చితకా పార్టీలుంటే వాటికీ వల వేయాలి. 'నోటా' ఓట్లు, చెల్లని ఓట్లతో కూటమి కట్టడానికి ఏవైనా ఉపాయాలున్నాయేమో ఆలోచించాలి... ఇట్లా సాగుతున్న ఎల్లో కూటమి ఆలోచనా స్రవంతికి ఎక్కడో బ్రేక్ పడ్డట్టుగా కనిపిస్తున్నది. మోదీతో భేటీ తర్వాత పవన్ కల్యాణ్ పర్యటన వార్తలను ఎల్లో మీడియా పూర్తిగా తగ్గించివేసిందని సోము వీర్రాజు అధిక్షేపించారు. చంద్రబాబేమో పవన్‌కు సభ్యత లేదన్నట్టు పరోక్షంగా బాంబులు విసురుతున్నారు. ఏం జరుగుతున్నదో? ఎల్లో కూటమి ప్రవచిస్తున్న 'ప్రజాస్వామ్యం' కోసం ఐక్యతా కార్యక్రమానికి ఆదిలోనే హంసపాదు పడిందా? లేక టీడీపీ – జనసేనల మధ్య తాత్కాలిక వియోగమే సంభవించిందా? తేలడానికి కొంత సమయం పట్టవచ్చు. కానీ, మళ్లీ ఆట మొదలుపెట్టాలి. ఈలోగా పుణ్యకాలం గడిచిపోవచ్చు. మరోపక్కన గోబెల్స్ ప్రచారం మునుపటి మాదిరిగా ప్రభావం చూపుతున్నట్టు లేదు.

ఇంకా ఎక్కడన్నా చిన్నా చితకా పార్టీలుంటే వాటికీ వల వేయాలి. 'నోటా' ఓట్లు, చెల్లని ఓట్లతో కూటమి కట్టడానికి ఏవైనా ఉపాయాలున్నాయేమో ఆలోచించాలి... ఇట్లా సాగుతున్న ఎల్లో కూటమి ఆలోచనా స్రవంతికి ఎక్కడో బ్రేక్ పడ్డట్టుగా కనిపిస్తున్నది. మోదీతో భేటీ తర్వాత పవన్ కల్యాణ్ పర్యటన వార్తలను ఎల్లో మీడియా పూర్తిగా తగ్గించివేసిందని సోము వీర్రాజు అధిక్షేపించారు. చంద్రబాబేమో పవన్‌కు సభ్యత లేదన్నట్టు పరోక్షంగా బాంబులు విసురుతున్నారు. ఏం జరుగుతున్నదో? ఎల్లో కూటమి ప్రవచిస్తున్న 'ప్రజాస్వామ్యం' కోసం ఐక్యతా కార్యక్రమానికి ఆదిలోనే హంసపాదు పడిందా? లేక టీడీపీ – జనసేనల మధ్య తాత్కాలిక వియోగమే సంభవించిందా? తేలడానికి కొంత సమయం పట్టవచ్చు. ఒకవేళ ఇది తాత్కాలిక వియోగమే అయినా, మళ్లీ ఆట మొదలుపెట్టడానికి ఇంకాస్త టైమ్ పడుతుంది. ఈలోగా పుణ్య కాలం గడిచిపోవచ్చు. మరో పక్కన గోబెల్స్ ప్రచారం మునుపటి మాదిరిగా ప్రభావం చూపుతున్నట్టు లేదు. ఒక్కో బోగస్ కథనాన్ని వంద సార్లు అచ్చొత్తినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నిర్వహించిన కర్నూలు తరహా యాత్రలు రాయలసీమ జిల్లాల్లో, ఉత్తరాంధ్రలో కూడా చేపట్టవచ్చు. ఉరుములు మెరుపులతో కూడిన రెచ్చగొట్టే తుంపర్లు మరిన్ని రాలవచ్చు. ఇది రాజకీయ వాతావరణ హెచ్చరిక. ఆంధ్ర రాష్ట్రాన్ని ఉన్మాదపు మేఘాలు ఆవరించకుండా ఉండుగాక!

vardhelli1959@gmail.com

లక్షలాది జీవితాలను మార్చిన విప్లవమూర్తి

నివాళి



రేనానా ఝాబ్‌వాలా

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మహాత్మా గాంధీ స్ఫూర్తిగా సామాజిక సేవకు తమ జీవితాలను అందించిన అనేకమందిలో ఇలా భట్ లేదా అందరికీ చిరపరిచితమైన ఇలా బెన్ ఒకరు. ఆకాశమే హద్దుగా దేశ భవిష్యత్తు గురించి కలలు కన్న ఇలాబెన్ అహ్మదాబాద్‌లో న్యాయవిద్యను అభ్యసించారు. నవ భారత నిర్మాణంలో తాను భాగస్వామిననని గర్వంగా భావించారు. ''జాతి నిర్మాణం అంటే నా దృష్టిలో కార్మికులకు దగ్గర కావడమే. ఎందుకంటే.. ఈ దేశానికి పునాదులైన వీరు ఇప్పటికీ పేదలుగానే ఉన్నారు. నిర్లక్ష్యానికి గురవుతున్నారు'' అనేవారు ఆమె. ఆ కాలపు విద్యార్థి నేత రమేశ్ భట్ కార్యకలాపాలకు ఆకర్షితులైన ఇలా బెన్ అతడినే పెళ్లి చేసుకుని జీవిత భాగస్వామి గానూ మారిపోయారు. విద్యాభ్యాసం తరువాత ఇలా బెన్ మజూర్ మహాజన్ (టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్–టీఎల్ఏ)లో చేరిపోగా... రమేశ్ భట్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠ్‌లో చేరారు.

మిల్లు వర్కర్ల ట్రేడ్ యూనియన్ అయిన టీఎల్ఏను స్థాపించింది అనసూయ సారాభాయ్ అయినప్పటికీ దీని రాజ్యాంగాన్ని రచించింది మాత్రం స్వయంగా మహాత్మా గాంధీ కావడం గమనార్హం. ట్రేడ్ యూనియన్ ప్రాముఖ్యం, నిర్వహణ వంటి అనేక అంశాలను టీఎల్ఏ లోనే నేర్చుకున్న ఇలా బెన్ ఇక్కడే మొదటిసారి అసంఘటిత రంగంలోని మహిళా కార్మికులను కూడా కలిశారు. వారంతా కాయగూరలు అమ్మే, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే, దుస్తులు కుట్టే కష్టజీవులైనప్పటికీ పేదలుగానే ఉండటం ఆమెలోని ఆలోచనలను తట్టిలేపింది. వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఇలా బెన్ 1972లో 'సేవా' సంస్థను ప్రారంభించారు. చిన్నగా మొదలైన ఈ సంస్థ అనతి కాలంలోనే దేశం.. ఆమాటకొస్తే ప్రపంచవ్యాప్త అసంఘటిత మహిళా కార్మికుల ఉద్యమాలకు ఆధారభూతమైంది. ఒక్కో మహిళా కార్మికురాలు... యూనియన్ కోసం తమ చిన్న చిన్న సంచి ముడులు విప్పి పావలా చొప్పున చెల్లించడం ఇలా బెన్‌ను ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందట. అయితే కేవలం వీరి హక్కుల కోసం పోరాడటమే సరిపోదని ఇలా బెన్ వేగంగా గుర్తించారు. యజమానుల మనసు మార్చే.. మున్సిపాలిటీ, పోలీస్ వంటి వ్యవస్థలు మహిళా కార్మికులను దోచుకోకుండా రక్షించేందుకు తగిన చట్టాలూ అవసరమని భావించారు.

ఇజ్రాయెల్ పర్యటనలో సహకార సంఘాలు, ట్రేడ్ యూనియన్ల పనితీరుపై అవగాహన పెంచుకున్న ఇలా బెన్ వాటిని భారత్‌లోనూ స్థాపించే ప్రయత్నం మొదలుపెట్టారు. మహిళా కార్మికులకు తాము పొదుపు చేసుకున్న డబ్బును దాచుకునేందుకు బ్యాంకుల్లాంటి వ్యవస్థలేవీ లేకపోవడం



ఇలా బెన్ (1933-2022) : సామాజిక ఉద్యమశీలి, గాంధేయవాది

గుర్తించిన ఆమె... వారితో ఓ సహకార బ్యాంకును ఏర్పాటు చేయించారు. అప్పట్లో ఇదో విప్లవాత్మకమైన చర్యే. ఆలోచనలు, కార్యాచరణ రెండూ అలాగే ఉండేవి. సమాజంలోని అట్టడుగు పేదల జీవితాలు మార్చే ఈ పనులకు ఆమె పెట్టుకున్న పేరు 'అభివృద్ధికి పోరాటం'. ఇలా బెన్ మార్గాన్ని ఒక్క గుజరాత్‌లోనే కాదు... భారత్‌తో పాటు ప్రపంచంలోని మరికొన్ని దేశాల్లోనూ అనుకరించారు.

ఇలా బెన్ ఆలోచనలు ఎంత విప్లవాత్మకంగా ఉండేవంటే.. కొన్ని పనులు చేయడంతోనే సమస్యలు పరిష్కారం కావనీ, అసలు సమస్య ఆలోచనా ధోరణులు మార్చడంలోనే ఉందనీ ఆమె గుర్తించారు. చట్టాలు, విధానాలు, దృక్పథాల్లో మార్పులు తీసుకురావడం ద్వారా మాత్రమే అసంఘటిత రంగ మహిళా కార్మికుల హక్కుల సాధన సాధ్యమని నమ్మి ఆచరించారు. ఇలా బెన్ కృషికి గుర్తింపు చాలా వేగంగానే రావడం మొదలైంది. 1977లో రామన్ మెగసెసె అవార్డు వరించింది. ఆ తరువాతి కాలంలో పద్మశ్రీ, పద్మభూషణ్‌లు కూడా! రాజ్యసభ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో హార్వర్డ్, యేల్ యూనివర్సిటీలు డాక్టరేట్‌లతో సత్కరించాయి. నెల్సన్ మండేలా స్థాపించిన అంతర్జాతీయ బృందం 'ద ఎల్డర్స్'లోనూ ఆమెకు సభ్యత్వం లభించింది.

ఇలా బెన్ రాజ్యసభ సభ్యురాలిగా వీధి వ్యాపారులు, ఇళ్లలోంచి పనిచేసేవారి కోసం పలు బిల్లులను ప్రవేశపెట్టారు. ఆమె కృషి ఫలితంగానే వీధి వ్యాపారుల బిల్లు చట్టమైంది. పద్మశ్రీ అవార్డు అందుకునేటప్పుడు కూడా ఇలా బెన్ కోరింది ఒక్కటే... అసంఘటిత రంగంలోని మహిళా కార్మికుల కోసం ఓ కమిషన్ ఏర్పాటు చేయమని! 1988లో వీరిపై చేసిన అధ్యయనం 'శ్రమశక్తి' పేరుతో విడుదలైంది.

శ్రామికులను సంఘటిత పరచడం ఎంత ముఖ్యమైందో ఇలా బెన్‌కు బాగా తెలుసు. అందుకేనేమో... అహ్మదాబాద్‌లో మొదలుపెట్టిన కార్మిక సంస్థలు అంతర్జాతీయ స్థాయికి విస్తరించాయి. ఆమె స్ఫూర్తితో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్, హోమ్ బేస్డ్ వర్కర్స్‌తోపాటు ఇళ్లల్లో పని చేసేవారు, చెత్త ఏరుకునేవారికీ సంఘాలు ఏర్పడ్డాయి. ఇంటర్నేషనల్ లేబర్ యూనియన్‌లోనూ ఇలా బెన్ ఇళ్లల్లోంచి పనిచేసుకునే వారి కోసం ఓ సదస్సు ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. పరిశోధకులు, విధాన రూపకర్తలు, సామాజిక కార్యకర్తలతో ఆమె 'వీగో' పేరుతో ఒక అంతర్జాతీయ సంస్థను కూడా ఏర్పాటు చేశారు. ఇలా బెన్ సాధించిన అతి గొప్ప విజయం ఏదైనా ఉందంటే.. అది పేద మహిళా కార్మికుల జీవితాలను మార్చడమే కాదు.. విద్యావంతులు, ప్రొఫెషనల్స్ కూడా ఉద్యమంలో పాల్గొనేలా చేయడం! గత ఏడాది 'సేవా' సంస్థ స్వర్ణోత్సవాలు జరిగాయి. అయితే ఇలా బెన్ మాత్రం అప్పటికి కూడా రానున్న యాభై ఏళ్లలో ఎలాంటి మార్పులు తీసుకురాగలమో చూడాలన్న ఆశాభావంతోనే ఉండేవారు.

వ్యాసకర్త ప్రఖ్యాత సామాజిక కార్యకర్త
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తం

పూర్వం విలువిద్యలో ఆరితేరాలని ఆశించిన ఓ యువకుడు ఓ గురువు దగ్గర శిష్యునిగా చేరాడు. కొన్ని రోజులకు ఆ శిష్యుడికి ఓ విపరీతమైన కోరిక పుట్టింది. విలువిద్యలో తనొక్కడే గొప్ప వీరుడని నలుగురూ ప్రశంసించాలని అనుకున్నాడు. అయితే తనకు విలువిద్యలో శిక్షణ ఇచ్చే గురువుగారు ఉన్నంతకాలం తాను ఏకైక విలువిద్యా పారంగతుడిని కాలేననీ, అన్ని కిటుకులూ నేర్చుకున్న తర్వాత గురువుగారిని హతమారిస్తే సరిపోతుందనీ అనుకున్నాడు. అలాగే ఓరోజు ఆయనను అంత మొందించడానికి ప్రయత్నించాడు. కానీ గురువుగారు ఆ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.



అది ఆ శిష్యుడి కుట్రే అని తెలుసుకున్న ఆ గురువుగారు – 'నువ్వు నన్ను చంపినా నీ ఆశ నెరవేరదు... ఎందుకంటే నన్ను మించిన నా గురుదేవులు అదిగో ఆ పర్వతం మీదున్నారు... కావాలంటే ఆయనను గెలువు చూద్దాం' అన్నారు.

మరుక్షణం ఆ శిష్యుడు పర్వతం మీదికి వెళ్లాడు. ఓ పెద్ద బండ మీద కూర్చున్న ఆ పెద్ద గురువుగారిని చూశాడు. వెనుకగా వెళ్ళి ఆయన మీద ఓ బాణం ఎక్కుపెట్టి విడిచాడు. వెనుక నుంచి వచ్చిన ఆ బాణాన్ని చూడకుండానే ఆ పెద్ద గురువు అడ్డుకోవడం చూసి ఈ శిష్యుడు విస్తుపోయాడు. ఆ పెద్ద గురువుగారి ముందు తానొక సామాన్యుడనని గ్రహించాడు. ఆయన కాళ్ళపై పడి క్షమించమని ప్రార్థించాడు. తాను కీర్తి కాంక్షతో తన సొంత గురువును కూడా చంపబోయాననీ చెప్పుకున్నాడు.

అందుకు పెద్ద గురువుగారు... తన శిష్యుడు తన కన్నా గొప్పవాడు కావాలని ప్రతి గురువూ ఆశిస్తాడనీ, అందువల్ల ప్రతి శిష్యుడూ గురువును మించడానికి ప్రయత్నించాలే కానీ గురువును చూసి కుళ్లుకుంటూ చంపాలనుకోవడం సరికాదన్నారు. ప్రత్యక్షంగా ద్రోణుని దగ్గర విద్య అభ్యసించకపోయినా ఆయననే తన గురువుగా భావించినందున ఏకలవ్యుడు గురుదక్షిణగా వేలు కోసి ఇచ్చాడనీ... గురుభక్తంటే అదనీ బోధించారు.

'నీ తప్పు తెలుసుకున్నావుగా... పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం ఏముంది' అని తన ప్రశిష్యుని సముదాయించారు పెద్ద గురువుగారు. అప్పుడు తేలికైన హృదయంతో శిష్యుడు అక్కడి నుండి తన గురువును చేరి జరిగింది వివరించాడు.

– యామిజాల జగదీశ్

అప్పు చెల్లించలేదని గృహ నిర్బంధం

కోవెలకుంట్ల: అప్పు తీర్చలేదని ఓ కుటుంబాన్ని గృహ నిర్బంధం చేసిన ఘటన శనివారం నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో జరిగింది. బొగ్గరపు చంద్రశేఖర్ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట కిరాణాషాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన హోల్‌సేల్ వ్యాపారి రాధాకృష్ణ వద్ద కిరాణాషాపునకు సరుకులు అప్పుగా తీసుకున్నాడు. రెండు నెలల కిందట చంద్రశేఖర్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. తీసుకున్న సరుకులకు సంబంధించి రూ.60 వేలు చెల్లించకపోవడంతో వ్యాపారి గత కొన్ని రోజుల నుంచి మృతుడి కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నాడు. కుటుంబాన్ని పోషించే యజమాని మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు ఆ ఘటన నుంచి కోలుకోలేని స్థితిలో ఉన్నారు. ఆ సమయంలో వ్యాపారి శనివారం వారి ఇంటి వద్దకు వెళ్లి డబ్బులివ్వాలని వాగ్వాదానికి దిగాడు. మృతుడి భార్య గీతావాణి, అత్తమామలు సుబ్బరత్నమ్మ, రామసుబ్బయ్యను ఇంట్లో పెట్టి తాళం వేశాడు. పోలీసులు వచ్చి వారిని విడిపించి వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. వారి మధ్య సయోధ్య కుదుర్చి సమస్యను తీర్చారు.

వైజాగ్ స్టీల్ నయా బ్రాండింగ్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త సిరీస్

- నకిలీలకు ఆస్కారం లేకుండా అన్ని ఉత్పత్తులపైనా ముద్రణ
- ఉత్పత్తి గ్రేడ్ కూడా తెలిసేలా కొత్త పరిజ్ఞానంతో న్యూ బ్రాండింగ్



స్టీల్ ప్లాంట్‌లో వైర్ రాడ్ కాయిల్స్ తయారీ

ఉక్కు నగరం (విశాఖపట్నం): ఉత్పత్తుల విక్రయంలో బ్రాండింగ్‌దే ప్రధాన భూమిక. వివిధ కంపెనీలు ఉత్పత్తి చేసే వస్తువులకు ఉండే బ్రాండ్ ఇమేజ్‌ను చూసి వినియోగదారులు ఆయా వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. దేశీయ ఉక్కు పరిశ్రమలో విశాఖ స్టీల్ ప్లాంట్ తనదైన టీఎంటీ పేరిట ప్రత్యేక బ్రాండింగ్ కలిగి ఉంది. తాజాగా ఈ ప్లాంట్ కొత్త బ్రాండింగ్‌కు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైజాగ్ టీఎంటీ 500డి, వైజాగ్ టీఎంటీ హెచ్‌సీఆర్‌డీ బ్రాండింగ్ స్థానంలో కొత్తగా వైజాగ్ టీఎంటీ ఎఫ్ఈ 550డి, 500డి 6686 59, 8568 66 అనే బ్రాండ్ నంబర్లు ముద్రిస్తోంది. 16 ఎంఎం నుంచి 36 ఎంఎం వరకు ఉన్న సైజు ఊచలు, రైల్వే సంస్థకు పంపే ఉత్పత్తులపై హెచ్‌సీఆర్‌డీ (హై కరోజన్ రెసిస్టెంట్ డీటైల్)ను ముద్రిస్తున్నారు.

ఎలా మొదలైందంటే..

విశాఖ ఉక్కు ఉత్పత్తులను తొలినాళ్లలో ఇతర కంపెనీల ఉత్పత్తుల మాదిరిగానే ఎలాంటి గుర్తింపు మార్కులు లేకుండా విక్రయించేవారు. దీంతో విశాఖ ఉక్కును గుర్తించడం కష్టంగా ఉండేది. ఆ తరువాత స్టీల్ ప్లాంట్ అధికారులు రీబార్స్ మధ్యలో ఆంగ్ల అక్షరం 'వి' ఉండేలా చేశారు. అది స్పష్టంగా కనిపించేది కాదు. అనంతరం ఉత్పత్తులపై ప్రారంభంలో బ్రాండింగ్ కోసం పెద్ద సైజు 'నంబర్ పంచ్' అనే సాధనంతో వైజాగ్ స్టీల్ అని వేసేవారు. ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. అన్ని ఉత్పత్తుల మీద ఇలా వేయాలంటే ఎక్కువ శ్రమ, సమయం పట్టేవి. 2002 తర్వాత నేరుగా ఉత్పత్తి మీద ముద్రపడేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. స్టీల్ ప్లాంట్‌లో రోలింగ్ మిల్స్ విభాగాలైన లైట్ అండ్ మీడియం మర్చంట్ మిల్ (ఎల్ఎంఎంఎం), మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్ (ఎంఎంఎస్‌ఎం), వైర్ రాడ్ మిల్స్ (డబ్ల్యూఆర్ఎం), స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం), వైర్ రాడ్ మిల్ (డబ్ల్యూఆర్ఎం)-2, స్ట్రక్చరల్ మిల్ (ఎస్టీఎం)లలో రీబార్స్, రౌండ్స్, ఏంగిల్స్, చానల్స్, బీమ్స్ తదితర వస్తువులను ఉత్పత్తి చేస్తారు. నిర్ణీత పరిమాణంలో ఆ రోల్స్‌ను సిద్ధం చేసిన తర్వాత దానిపై విశాఖ ఉక్కు ప్రతిష్టగా నిలిచే వైజాగ్ స్టీల్ టీఎంటీ (థర్మో మెకానికల్ ట్రీట్‌మెంట్) ముద్రను వేస్తారు.

నకిలీలకు చెక్

జాతీయ, అంతర్జాతీయ విపణిలో విశాఖ ఉక్కు ఉత్పత్తులకు ఉన్న గిరాకీ నేపథ్యంలో తరచూ నకిలీ ఉత్పత్తులు తయారవుతున్నట్టు విశాఖ స్టీల్స్ యాజమాన్యం గుర్తించింది. ఈ దృష్ట్యా డూప్లికేటింగ్ జరగకుండా బ్రాండింగ్ చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ఇప్పుడు ఆ ఉత్పత్తి గ్రేడ్‌ను కూడా తెలిపేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బ్రాండింగ్ చేస్తున్నారు. రోలింగ్ మిల్స్‌లో ఆయా ఉత్పత్తులు రోల్ అవుతున్న క్రమంలోనే ఆ ఉత్పత్తిపై ఇది విశాఖ ఉక్కు ఉత్పత్తి అని తెలిసేలా బ్రాండింగ్ చేస్తున్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో రత్నగిరిపై శ్రీ సత్యదేవుని ఆలయానికి కార్తీక శుద్ధ దశమి, శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేల సంఖ్యలో సత్యదేవుని సన్నిధికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వ్రతమండపాలు, క్యూ లైన్లు నిండిపోయాయి. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. లక్షకుపైగా భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 11,500 జరుగగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.20 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ కార్తీకంలో ఇప్పటి వరకు సత్యదేవుని వ్రతాలు 01,16,000 జరిగాయి. ఆది,సోమ, వారాలు కూడా సత్యదేవుని ఆలయానికి ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో సత్యదేవుని దర్శనం, వ్రతాల నిర్వహణ తెల్లవారుజాము నుంచి ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 22 నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,861 మంది స్వామి వారిని దర్శించుకోగా 28,519 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి భక్తులు కానుకల రూపంలో రూ.4.53 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి:



ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి కుటుంబసభ్యులతో కలిసి శనివారం శ్రీవారి నైవేద్య విరామ సమయంలో దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు ఆలయ మహాద్వారం వద్ద స్వాగతం పలికి, అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఏపీ టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోవిందరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కర్ణాటక రాష్ట్ర మంత్రి సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ

తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శనివారం అమ్మవారి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల మధ్య పుణ్యాహవచనం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీర బ్రహ్మం, సదా భార్గవి పాల్గొన్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల మధ్య వివాదం

- రెండు గంటలు నిలిచిపోయిన రైలు



రేగుపాలెం రైల్వేస్టేషన్ వద్ద బొకారో రైలుకు ఎదురుగా ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

యలమంచిలి(అనకాపల్లి జిల్లా): అధిక రద్దీ కారణంగా ప్రయాణికుల మధ్య ఏర్పడిన వివాదంతో బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు రెండు గంటల సేపు నిలిచిపోయింది. రిజర్వేషన్ బోగీల్లో అన్‌రిజర్వ్‌డ్ టికెట్లతో ప్రయాణికులు అధిక సంఖ్యలో ఎక్కడంతో ఇరువర్గాల మధ్య గొడవ ఏర్పడింది. ఇది కాస్త పెద్దదికావడంతో శనివారం యలమంచిలి మండలం రేగుపాలెం రైల్వేస్టేషన్ వద్ద దన్బాద్-అలెప్పి (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఈ రైలును యలమంచిలి దాటిన తర్వాత వెనుక వస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (12889) కోసం రేగుపాలెం రైల్వేస్టేషన్లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై నిలిపివేశారు. ఇదే సమయంలో రిజర్వుడు టికెట్లున్న ప్రయాణికులు, అన్‌రిజర్వుడు టికెట్లున్న ప్రయాణికుల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత పెద్దదైంది. దీంతో వందల సంఖ్యలో ప్రయాణికులు రైల్వే ట్రాక్‌పైకి వచ్చిరైలు ఇంజిన్‌కి ఎదురుగా ఆందోళనకు దిగారు. రైలు వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా దాదాపు 500 మంది ప్రయాణికులు ట్రాక్‌పై ఇంజిన్‌కు ఎదురుగా ఉండిపోవడంతో దాదాపు రెండు గంటల సేపు అక్కడే నిలిచిపోయింది. సమాచారం అందుకొన్న తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న ప్రయాణికులకు నచ్చజెప్పారు. రైల్వే ట్రాక్ నుంచి వారిని పక్కకు తొలగించారు. అనంతరం 12.05 నిమిషాల సమయంలో రేగుపాలెం స్టేషన్ నుంచి రైలును ముందుకు పంపించారు. అన్నవరం రైల్వే స్టేషన్ వరకూ ఎస్కార్ట్‌గా వెళ్లారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

పటమట(విజయవాడతూర్పు): పుస్తక పఠనంతో మానసిక వికాసం సాధ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పుస్తక పఠనం, డ్రాయింగ్, క్విజ్ పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ విజ్ఞానాన్ని ఎవ్వరూ దొంగిలించలేరన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవటానికి విద్యార్థులు నిరంతర సాధన చేయాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర కల్కుర మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అన్నింటిలో మనదేశ రాజ్యాంగం ఎంతో గొప్పదని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద, సర్వోత్తమ గ్రంథాలయ అధ్యక్షులు కామినేని పట్టాభి రామయ్య, ఉపాధ్యక్షులు డోకిపర్తి శంకర్రావు, కార్యదర్శి రావి శారద పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు నాలుగోసారి ఐఎస్ఓ గుర్తింపు

- ఏడు అంశాలకు లభించిన సర్టిఫికెట్లు
- భక్తులకు అందిస్తున్న సేవలకు దక్కిన గౌరవం



చైర్మన్ సుధాకరరావుకు ఐఎస్ఓ సర్టిఫికెట్లను అందిస్తున్న శివయ్య

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న దేవస్థానానికి వరుసగా నాల్గోసారి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. శ్రీవారి కొండపై ఉన్న ఛాంబర్‌లో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుకు హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఆలపాటి శివయ్య ఈ సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ మూడేళ్లుగా స్థానిక దేవస్థానంలో పరిపాలన విభాగం, ఆహార భద్రత, నాణ్యత, కాలుష్య నివారణకు మొక్కల పెంపకం, సిబ్బంది ఉద్యోగ, ఆరోగ్య భద్రత, భక్తులకు అర్థమయ్యే రీతిలో సమాచారం అందించడంతో పాటు ఆలయ కార్యాలయం, ఉద్యోగుల ముఖ్య సమాచారాన్ని పరిరక్షించేందుకు అవలంబిస్తున్న చర్యలు, విద్యుత్ ఆదా, శ్రీవారి ప్రసాదాలు, అన్నప్రసాదం తయారీలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత ఇలా ఏడు అంశాలను పరిశీలించి ఐఎస్ఓ సర్టిఫికెట్లను అందించినట్టు చెప్పారు. ఆలయ చైర్మన్ సుధాకరరావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం మోసాలు

- నెల్లూరులో మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్
- రూ.7లక్షల విలువైన బంగారం, బైక్ స్వాధీనం



నెల్లూరు(క్రైమ్): జీతం తన జల్సాలకు సరిపోవడం లేదని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం మానేసి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని నెల్లూరులోని సంతపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కావలి రూరల్ మండలం చిన్ననట్టు పట్టుపుపాలేనికి చెందిన వి.వెంకటేశ్వర్లు ఎంబీఏ చదివాడు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేశాడు. జల్సాలకు అలవాటు పడి, వ్యసనాలకు బానిసయ్యాడు. జీతం తన అవసరాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఉద్యోగం మానేసి విభిన్న రూపాల్లో మోసాలకు తెరలేపాడు. తాను ట్రైనీ ఎస్ఐగా, డాక్టర్‌గా, రైల్వే టీసీగా పని చేస్తున్నానని నమ్మబలికి 2018 నుంచి కావలి, అల్లూరు, రాజమహేంద్రవరం, ఒంగోలు, నెల్లూరులో పలువురిని మోసం చేసి పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 9న నెల్లూరులోని వినీతసాయి జ్యూయలరీ షాపునకు వెంకటేశ్వర్లు వెళ్లి తాను డాక్టర్‌ను అని యజమానితో పరిచయం చేసుకుని నమ్మించాడు. డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పి 122 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకువెళ్లాడు. ఈ నెల 17న రంగనాయకులపేట రైల్వేగేటు వద్ద బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి మోటారుసైకిల్ తీసుకుని పారిపోయాడు. బాధితులు సంత పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం సంతపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరాజేష్ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో వెంకటేశ్వర్లు బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. జ్యూయలరీ షాపు యజమానిని మోసగించానని, బెదిరించి బైక్‌ను తీసుకెళ్లానని అంగీకరించడంతో అతడ్ని అరెస్ట్‌చేశారు. అతని వద్ద నుంచి రూ.7లక్షల విలువచేసే 122 గ్రాముల బంగారం, రెండు సెల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తన వారి మేలు కోసమే చంద్రబాబు తపన

- 783వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : అవినీతి అమరావతిని నెత్తికెత్తుకున్న చంద్రబాబుకు కర్నూలులో తగిన శాస్తి జరిగిందని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 783వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శనివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని విడనాడి కేవలం తన సామాజికవర్గ సంక్షేమం కోసమే పాటుపడే వ్యక్తి దేశంలో ఎవరైనా ఉన్నారంటే ఆ ఏకైక వ్యక్తి చంద్రబాబేనని దుయ్యబట్టారు. రాయలసీమలో పుట్టి సీమకు అన్యాయం చేసిన వ్యక్తిగా చంద్రబాబు చరిత్ర హీనుడిగా చరిత్రపుటల్లో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. అమరావతి పేరుతో రైతులను మోసం చేసిన చంద్రబాబును 29 గ్రామాల ప్రజలు ఓడించినప్పటి నుంచి తనను జనంలో తిరగకుండా ఎక్కడ తరిమికొడతారోనన్న భయంతోనే దొంగ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. ఇందుకోసం కులవాదులను వెంటేసుకుని.. దళిత దళారులను అడ్డుపెట్టి బాబు దొంగ ఉద్యమం నడుపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఇందుపల్లి సుభాషిణి, మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో గండికోట అభివృద్ధి

- ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు వెల్లడి



ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డితో కలిసి మల్లయ్యకొండపై పర్యటిస్తున్న కన్నబాబు

బి.కొత్తకోట: వైఎస్సార్ జిల్లా గండికోటను రూ.100 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) ఎండీ కె.కన్నబాబు తెలిపారు. గండికోటకు స్పెషల్ ప్రాజెక్టు కింద కేంద్రం రూ.100 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తోందని తెలిపారు. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశగా కృషి చేస్తోందని చెప్పారు. గండికోటలో చేపట్టిన రోప్ వే పనులు త్వరలో పూర్తవుతాయని చెప్పారు. శ్రీకాళహస్తి, లంబసింగి, పెనుగొండ, గాలికొండ, అన్నవరంలో 20 కిలో మీటర్ల మేర రోప్ వేను రూ.1,200 కోట్లతో పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఒబెరాయ్ సంస్థ రూ.1,350 కోట్లతో గండికోట, తిరుపతి, పిచ్చుకలంక, హార్సిలీహిల్స్, విశాఖపట్నంలో సెవెన్ స్టార్ హోటళ్లను నిర్మించనుందని చెప్పారు. వైజాగ్ బీచ్ కారిడార్ అమలుకు ప్రణాళికలు రూపొందించామని, భోగాపురం, భీమిలిలో పర్యాటకుల కోసం సీ ప్లేన్, తొట్లకొండలో రూ.120 కోట్లతో అక్వేరియం టన్నెల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. విజయవాడ భవానీ ద్వీపం అభివృద్ధికి రూ.149 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని తెలిపారు. ఇంద్రకీలాద్రి నుంచి భవానీ ద్వీపం వరకు 2.5 కిలోమీటర్లు రోప్‌వే ఏర్పాటు ఈ మాస్టర్ ప్లాన్‌లో ఉందన్నారు. లంబసింగి, పాడేరులో కొత్తగా హోటళ్ల నిర్మాణం, అన్నవరంలో ఎకో రిసార్ట్‌కు చర్యలు చేపట్టామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

- శ్రీ సత్యసాయి జిల్లాలో కల్వర్టు దిమ్మెను ఢీకొన్న కారు
- తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, భార్య, తల్లి దుర్మరణం
- ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు, పరిస్థితి విషమం

కనగానపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం వరంగల్ నగరానికి చెందిన ఎల్లంకుల గోపీనాథ్ (38) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆయన కుమార్తె హాసిని మొదటి పుట్టిన రోజు ఈ నెల 25వ తేదీ కాగా, ఘనంగా సొంత నగరం వరంగల్‌లో వేడుకలు చేయడానికి ఫంక్షన్ హాలు కూడా బుక్ చేసుకున్నారు. వారాంతపు సెలవులు రావడం, కుమార్తె పుట్టిన రోజు వేడుకలు కూడా ఉండడంతో శనివారం ఉదయం గోపీనాథ్ తన కారులో కుటుంబ సభ్యులతో కలసి బెంగళూరు నుంచి వరంగల్‌కు బయలుదేరారు. కారు పర్వతదేవరపల్లి సమీపంలో అదుపుతప్పి కల్వర్టు దిమ్మెను వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగమంతా పూర్తిగా దెబ్బతిన్నది. కారు నడుపుతున్న గోపీనాథ్, ముందు సీటులో కూర్చొన్న ఆయన భార్య శ్వేత రమ్యశ్రీ (32) తీవ్రంగా గాయపడి వాహనంలోనే ఇరుక్కుపోయారు. వెనుక సీటులో ఉన్న ఆయన తల్లి తారకేశ్వరి (52), కుమారుడు సాయితిక్(6), హాసిని(1) కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, కనగానపల్లి పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. గోపీనాథ్, ఆయన భార్య ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన తల్లి తారకేశ్వరి, పిల్లలను 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తారకేశ్వరి మృతిచెందారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

తెరపైకి కిమ్ కూతురు

తండ్రితో కలిసి క్షిపణి పరీక్షకు హాజరు



తొలిసారి కూతురితో బహిరంగంగా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్

సియోల్: అమెరికా బెదిరింపులను బేఖాతరు చేస్తూ ఉత్తరకొరియా శుక్రవారం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి హ్వాసంగ్–17ను పరీక్షించింది. అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ తన భార్య రి సోల్ జుతో పాటు కుమార్తెతో కలిసి దీన్ని తిలకించినట్లు అధికార మీడియా శనివారం వెల్లడించింది. తండ్రి కిమ్ చేతిని పట్టుకుని నడుస్తున్న బాలిక ఫొటోలను ప్రచురించింది. కిమ్ కూతురి ఫొటోలు బయటికి రావడం ఇదే మొదలు. ఆమె పేరు, వయసు వంటి వివరాలేవీ తెలియలేదు. గాయని రి సోల్ జును కిమ్ 2009లో పెళ్లాడారు. వీరికి ముగ్గురు పిల్లలంటారు. ప్రజల్లో తన కుటుంబ పాలన పట్ల సానుకూలతను పెంచుకునేందుకు గానీ, తన వారసత్వాన్ని ప్రకటించుకునే ప్రయత్నం గానీ అయి ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. 1948లో కిమ్ తాత కిమ్–2 సంగ్ హయాం నుంచి వారి కుటుంబ పాలన అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది.

కారంత తాబేలు!



ఈ తాబేలును చూస్తున్నారుగా! ఇది ఏకంగా ఓ చిన్నపాటి కారంత ఉండేదట!! అవును. ఎందుకంటే ఇదిప్పుడు లేదు. రాక్షస బల్లుల కాలానికి చెందినదట. ఇది కనీసం 3.7 మీటర్ల (12 అడుగుల)కు పైగా పొడవుండేదని తేల్చారు. దీని భారీ ఆకారం తమను నిజంగా ఆశ్చర్యపరిచిందని పరిశోధకులు అంటున్నారు. 2016లో ఈశాన్య స్పెయిన్‌లో సముద్రంలోంచి ఈ తాబేలు తాలూకు శిలాజాలను వెలికితీశారు. వాటి ఆధారంగా దీని రూపురేఖలపై వారు ఓ అంచనాకొచ్చారు. బైబిల్లో వర్ణించిన అతి భారీ సముద్ర జీవి పేరిట దీన్ని లెవియాథా నోచెలిస్ ఎనిగ్మాటికా అని ముద్దుగా పిలుస్తున్నారు. 8.3 కోట్ల ఏళ్ల క్రితం నేటి యూరప్‌కు రూపాన్నిచ్చిన ఆర్చిపెలాగో తీరాల వెంబడి ఈ తాబేళ్లు జీవించేవని క్రుసఫొంట్ కాటలన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలియెంథాలజీ పరిశోధకుడు ఆస్కార్ కాస్టిలో చెప్పారు. ఇవి సముద్రంలో అత్యంత లోతుల్లోకి వెళ్లగలిగేవని వివరించారు. అంతకు మరో 20 లక్షల ఏళ్లు, అంటే 8.5 కోట్ల ఏళ్ల నాటి తాబేళ్లు 13 అడుగులకు పైగా పొడవుండేవట!

మలేరియాపై అస్త్రం.. అలిస్పోరివిర్

జేఎన్‌యూ పరిశోధకుల ఆవిష్కరణ



న్యూఢిల్లీ: మలేరియా. దోమకాటు వల్ల వచ్చే అతి పెద్ద జబ్బు. దేశంలో ఏటా లక్షలాది మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వందలాది మంది మరణిస్తున్నారు. ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల వచ్చే మలేరియా నివారణకు ఎన్నో ఔషధాలు అందుబాటులో ఉన్నా అది పూర్తిగా అంతం కావడం లేదు. ఔషధాలను తట్టుకొనేలా కొత్త శక్తి పొందుతూ వస్తోంది. దీనిపై ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) 'సెంటర్ ఫర్ మాలిక్యులార్ మెడిసిన్' పరిశోధకులు దృష్టి సారించారు. డ్రగ్–రెసిస్టెంట్ మలేరియా రకాల భరతం పట్టడానికి యాంటీ–హెపటైటిస్ సి డ్రగ్ 'అలిస్పోరివిర్'ను కనిపెట్టారు. అవయవాల మార్పిడి ప్రక్రియలో ఉపయోగించే సైక్లోస్పోరిన్–ఎ డ్రగ్‌లో మార్పులు చేయడం ద్వారా దీన్ని సృష్టించారు. క్లోరోక్విన్–రెసిస్టెంట్, ఆర్టిమెసినిన్–రెసిస్టెంట్ మలేరియా రకాలపై ఇది చక్కగా పనిచేస్తుందని డాక్టర్ ఆనంద్ రంగనాథన్ చెప్పారు. ''దీన్ని ఆర్టిమెసినిన్ డ్రగ్‌తో కలిపి వాడొచ్చు. ప్రీ క్లినికల్ పరీక్షలు ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయి. క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. ఇది పూర్తిగా సురక్షితం'' అని ప్రొఫెసర్ శైలజా సింగ్ తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయ్యాక 'అలిస్పోరివిర్' అందుబాటులోకి రానుంది. 2021లో మాస్కిరిక్స్ అనే యాంటీ–మలేరియా టీకాకు డబ్ల్యూహెచ్‌ఓ అనుమతి మంజూరు చేసింది. మలేరియా నివారణకు టీకా రావడం మాత్రం ఇదే మొదటిసారి!

క్లుప్తంగా...

దలైలామాకు గాంధీ-మండేలా అవార్డు

ధర్మశాల: టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా గాంధీ–మండేలా పురస్కారం అందుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రా జిల్లా ధర్మశాల సమీపంలోని మెక్లాయిడ్ గంజ్‌లో శనివారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ పురస్కారం ప్రదానం చేశారు. యుద్ధం ద్వారా ఏ సమస్యకూ పరిష్కారం లభించదని దలైలామా అన్నారు. గాంధీ, నెల్సన్ మండేలా ఆశయసాధనకు పోరాడే ఆసియా, ఆఫ్రియా దేశాల నేతలకు గాంధీ–మండేలా ఫౌండేషన్ 2019 నుంచి పురస్కారాలను ప్రదానం చేస్తోంది.

నవ్‌లఖా గృహ నిర్బంధం

ముంబై: ఎల్గార్ పరిషత్–మావోయిస్టులతో సంబంధాల కేసులో నిందితుడైన గౌతమ్ నవ్‌లఖాను అధికారులు శనివారం ముంబైలోని తలోజా జైలు నుంచి విడుదల చేశారు. వెంటనే నవీముంబైలోని బెలాపూర్– అగ్రోలీ ప్రాంతంలోని ఓ భవనంలోకి మార్చారు. అక్కడే నెల రోజులపాటు ఆయన గృహ నిర్బంధంలో ఉంటారు. నవ్‌లఖాను గృహ నిర్బంధంలో ఉంచొద్దన్న ఎన్ఐఏ అర్జీని సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 24 గంటల్లోగా గృహ నిర్బంధంలోకి తరలించాల్సిందేనంటూ ఆదేశించడం తెలిసిందే.

ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్

న్యూఢిల్లీ: సీనియర్ అధికారి అరుణ్ గోయల్ ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. మేలో రిటైరైన సుశీల్ చంద్ర స్థానంలో ఆయన్ను నియమిస్తూ కేంద్రం శనివారం ఆదేశాలు జారీ చేసింది. 1985 ఐఏఎస్ బ్యాచ్ పంజాబ్ కేడర్ అధికారి అయిన గోయల్ ఈ నెల 18వన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. 2025 ఫిబ్రవరిలో ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి2027 డిసెంబర్ వరకు దాకా కొనసాగుతారు.

చైనాలో కరోనా కల్లోలం

25 వేల కేసులు, బీజింగ్‌లో లాక్‌డౌన్

బీజింగ్: చైనాలో మరోసారి కోవిడ్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. బీజింగ్‌లో 500పైగా కేసులతో కలిపి శుక్రవారం దేశవ్యాప్తంగా 25 వేలకు పైగా కేసులు బయటపడ్డాయి. దాంతో బీజింగ్‌లో పాక్షిక లాక్‌డౌన్ అమల్లోకి వచ్చింది. నగరంలోని ప్రధాన షాపింగ్ మాల్స్‌లో రెస్టారెంట్లను మూసివేశారు.

ఉత్తరాఖండ్‌లో లోయలో పడ్డ కారు...

ఐదుగురి దుర్మరణం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లో శనివారం మరో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి 400 మీటర్ల లోతైన లోయలో పడిపోవడంతో అందులోని ఇద్దరు మహిళలు సహా అయిదుగురు చనిపోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లా బ్రహ్మఖాల్ సమీపంలో ధరాసు–యమునోత్రి హైవేపై శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన మహిళ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణంగా అనుమానిస్తున్నామన్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. చమోలీ జిల్లాలో శుక్రవారం వ్యాన్ లోయలో పడిన ఘటనలో 12 మంది మృత్యువాతపడిన విషయం తెలిసిందే.



ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో బ్రిటన్ ప్రధాని రిషి కరచాలనం

దేశం కోసమే నా తపన

- 365 రోజులు.. 24/7 పని చేస్తున్నాం
- నేను పునాదిరాయి వేసిన ప్రాజెక్టును నేనే ప్రారంభిస్తున్నా: ప్రధాని మోదీ
- అరుణాచల్‌ప్రదేశ్‌లో తొలి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభం



వారణాసిలో 'కాశీ తమిళ సంగమం' కార్యక్రమంలో ప్రధాని మోదీ

ఈటానగర్: ''మా ప్రభుత్వం దేశ ప్రగతి కోసం 365 రోజులూ, 24/7 పని చేస్తోంది. నేనూ రోజంతా దేశం కోసమే శ్రమిస్తున్నా. ఈ రోజు ఉదయం ఇలా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉన్నా. తర్వాత వారణాసి వెళ్తా. సాయంత్రానికల్లా దేశానికి మరోవైపున ఉన్న గుజరాత్‌కు చేరుకుంటా'' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అరుణాచల్‌లో రాజధాని ఈటానగర్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని హొలోంగీలో తొలి గ్రీన్‌ఫీల్డ్ 'డోన్యీ పోలో ఎయిర్‌పోర్ట్'ను ఆయన శనివారం ప్రారంభించారు. సరిహద్దు రాష్ట్రమైన అరుణాచల్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించడానికి ఇది దోహదపడనుంది. దీని నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో మోదీ పునాదిరాయి వేశారు. ''నేను పునాదిరాయి వేసిన ప్రాజెక్టులను నేనే ప్రారంభిస్తున్నా. పనుల్లో కాలయాపన జరిగే రోజులు పోయాయి. అన్నింటినీ రాజకీయ కోణంలో చూడడం మానుకోవాలి. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు ఎన్నికల గిమ్మిక్కన్నారు. కానీ, ఇప్పుడిక్కడ ఎన్నికల్లేకున్నా ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించాం. సదరు వ్యాఖ్యాతలకు ఇది చెంపదెబ్బ లాంటిది'' అని ఈ సందర్భంగా ఆయనన్నారు. అనుసంధానం, విద్యుత్ మౌలిక సదుపాయాలతో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిలో నూతన ఉషోదయం కనిపిస్తోందని మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, తమ ప్రభుత్వం ఇక్కడి అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ''ఈశాన్య రాష్ట్రాల్లో గత ఎనిమిదేళ్లలో ఏడు ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించాం. టూరిజం, వాణిజ్యం, టెలికాం, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈశాన్య ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. మాకు ప్రగతే ముఖ్యం. ఎన్నికలు కాదు'' అన్నారు. అరుణాచల్‌లోని తూర్పు కెమాంగ్ జిల్లాలో నిర్మించిన 600 మెగావాట్ల కెమాంగ్ హైడ్రోపవర్ ప్రాజెక్టును మోదీ శనివారం జాతికి అంకితం చేశారు. రూ.8,450 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుతో అరుణాచల్‌లో విద్యుత్ కొరత తీరిపోనుంది.

కాశీ, తమిళనాడు.. కాలాతీత సాంస్కృతిక కేంద్రాలు

వారణాసి: మన దేశంలో కాశీ, తమిళనాడు కాలాతమైన గొప్ప సాంస్కృతిక, నాగరికత కేంద్రాలని మోదీ ప్రశంసించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శనివారం 'కాశీ తమిళ సంగమం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''కాశీ, తమిళనాడు రెండూ శివమయం, శక్తిమయం. కాశీలో విశ్వనాథ మందిరం, తమిళనాడులో రామేశ్వరం కొలువుదీరాయి. తమిళ సీమలో దక్షిణ కాశీ ఉంది'' అన్నారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్'తో భాగంగా కాశీ తమిళ సంగమం నిర్వహించారు. తమిళనాడు నుంచి 2,500 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. నెల రోజులపాటు ఎగ్జిబిషన్ జరుగనుంది. చేనేత వస్త్రాలు, హస్త కళాకృతులు, పుస్తకాలు, డాక్యుమెంటరీలు ప్రదర్శిస్తారు.

జైల్లో జల్సాలు!

తిహార్ జైల్లో మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ మసాజ్



జైల్లో మసాజ్ చేయించుకుంటున్న సత్యేంద్ర జైన్

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సత్యేందర్ జైన్ (58) తిహార్ జైలులో రాజభోగాలు అనుభవిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జైలులో లగ్జరీ పరుపుపై పడుకొని, ఏవో పత్రాలు చదువుకుంటూ కాళ్లకు మసాజ్ చేయించుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న జైన్ సందర్శకులను నేరుగా తన గదికే రప్పించుకుంటున్నట్లు చెప్తున్నారు. తిహార్ జైలు సిబ్బంది ఆయనకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారని ప్రత్యేక కోర్టుకు ఈడీ తెలిపింది. ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని కోరింది. దాంతో జైలు సూపరింటెండెంట్‌ను ఇటీవలే సస్పెండ్ చేశారు.

స్పా, మసాజ్ పార్టీ: బీజేపీ

జైల్లో జైన్ విలాసాలపై ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఎందుకు నోరువిప్పడం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా నిలదీశారు. ఆప్‌స్పా అండ్ మసాజ్ పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. మనీ లాండరింగ్ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నా జైన్‌ను ఇప్పటికీ మంత్రి పదవి నుంచి తొలగించలేదని మండిపడ్డారు.

ఫిజియోథెరపీ: సిసోడియా

జైన్‌పై బీజేపీ ఆరోపణలను ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియా ఖండించారు. ''ఆయన మసాజ్‌లు చేయించుకోవడం లేదు. జైల్లో కింద పడిపోవడంతో వెన్నెముకకు గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఫిజియో థెరపీ చేయించుకుంటున్నారు'' అని చెప్పుకొచ్చారు. బీజేపీవి చౌకబారు రాజకీయ ఎత్తుగడలన్నారు. వీడియోల లీక్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనన్నారు.

ఈడీపై కోర్టు కోర్టుకెక్కిన జైన్

మరోవైపు జైన్ శనివారం ఈడీపై ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీసీటీవీ ఫుటేజీని లీక్ చేసినందుకు కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై సోమవారం లోగా వివరణ ఇవ్వాలని ఈడీని కోర్టు ఆదేశించింది.

రాహుల్ వ్యాఖ్యలపై రగడ

- మహా వికాస్ అగాడీకి బీటలు?
- కూటమి మనుగడపై ప్రభావం: రౌత్
- బ్రిటిషర్ల నుంచి సావర్కర్‌కు పెన్షన్
- పీసీసీ చీఫ్ పటోలే వ్యాఖ్యలతో కాక




ముంబై: వీర సావర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు మహారాష్ట్రలో రాజకీయ కాక రేపుతున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో భారత్ జోడో పాదయాత్ర చేస్తున్న రాహుల్ గురువారం సావర్కర్‌పై తీవ్ర విమర్శలు చేయడం తెలిసిందే. ఆయన బ్రిటిష్ వారికి భయపడి క్షమాభిక్ష కోరారని, గాంధీ, పటేల్, నెహ్రూ వంటి స్వాతంత్ర్య సమర యోధులకు ద్రోహం చేశారని ఆరోపణలు గుప్పించారు. వీటిపై కాంగ్రెస్ మిత్రపక్షమైన శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం మండిపడుతోంది. ఇందుకు నిరసనగా కాంగ్రెస్, ఎన్సీపీలతో కూడిన మహా వికాస్ అగాడీ నుంచి బయటికి వచ్చే ఆలోచన కూడా చేస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. రాహుల్ వ్యాఖ్యలను ఉద్ధవ్ ఠాక్రే వెంటనే ఖండించడం తెలిసిందే. మహారాష్ట్రులకు ఆరాధ్యుడైన సావర్కర్ వ్యతిరేక వ్యాఖ్యలను తాము సహించే ప్రసక్తే లేదని ఉద్ధవ్ వర్గానికి చెందిన నేత అరవింద్ సావంత్ కుండబద్దలు కొట్టారు. ఇటీవలే రాహుల్‌తో కలిసి జోడో యాత్రలో నడిచిన ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే కూడా తాజాగా అదే మాట చెప్పారు. రాహుల్ అలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని ఉద్ధవ్ వర్గం సీనియర్ నేత సంజయ్ రౌత్ కూడా శనివారం అభిప్రాయపడ్డారు. అవి అగాడీ కూటమి మనుగడపై ప్రభావం చూపుతాయంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఈ కాకను మరింత పెంచేలా సావర్కర్‌పై మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే శనివారం మరిన్ని విమర్శలు గుప్పించారు! బ్రిటిష్ వారి నుంచి సావర్కర్ రూ.60 పెన్షన్ తీసుకున్నారంటూ మరోసారి వివాదాల తేనెతుట్టెను కదిపారు. రాహుల్ వ్యాఖ్యలను విమర్శిస్తున్న వారు ముందుగా దీనికి బదులివ్వాలన్నారు. మరోవైపు ఉద్ధవ్‌కు సావర్కర్‌పై ఏ మాత్రం గౌరవమున్నా కాంగ్రెస్‌కు తక్షణం గుడ్‌బై చెప్పాలని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత రావ్ సాహెబ్ దన్వే శనివారం డిమాండ్ చేశారు. ఆ ఉద్దేశముందో లేదో చెప్పాలని సవాలు చేశారు.

'ఉగ్ర' దేశాలపై ఆర్థిక ఆంక్షలు: అమిత్ షా

న్యూఢిల్లీ: ఉగ్రవాద మూకలకు స్వర్గధామాలుగా మారిపోయిన దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించాల్సిందేనని కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. పరోక్షంగా పాకిస్తాన్‌పై విరుచుకుపడ్డారు. కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకున్నాయని ఆరోపించారు. ఆయన శనివారం ఢిల్లీలో 'నో మనీ ఫర్ టెర్రర్' సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రసంగించారు. ఉగ్రవాద సంస్థలకు నిధులు అందకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ''ఉగ్రవాదానికి అంతర్జాతీయ సరిహద్దులుండవు. దాని నిర్మూలనకు ప్రపంచ దేశాలన్నీ కలిసి పని చేయాలి. రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టాలి. కొన్ని దేశాలు ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్నాయి. వారి కార్యకలాపాలకు నిధులు సమకూరుస్తున్నాయి'' అని పాకిస్తాన్‌ను ఉద్దేశించి విమర్శించారు. ''టెర్రరిజం రాజకీయ అంశం కాదు. పౌరుల రక్షణ, ప్రజాస్వామిక హక్కులకు సంబంధించినది. లాభాపేక్ష లేని సంస్థల ముసుగులో ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేయకుండా చర్యలు తీసుకోవాలి. కౌంటర్–టెర్రర్, ఫైనాన్సియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలను బలోపేతం చేసుకోవాలి'' అని అమిత్ షా తెలిపారు.

వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యం: సీజేఐ

రోజూ 10 బెయిలు, 10 బదిలీ పిటిషన్లు విచారిస్తామని వెల్లడి




సాక్షి, న్యూఢిల్లీ: వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన పిటిషన్లకు ప్రాధాన్యం ఇస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడించారు. పెండింగ్ కేసులను తగ్గించే క్రమంలో వివాహ వివాదాలకు చెందిన బదిలీ, బెయిలు పిటిషన్లు చెరో పది చొప్పున అన్ని కోర్టులు విచారించాలని ఫుల్ కోర్టు సమావేశంలో నిర్ణయించామని సీజేఐ తెలిపారు. ''ఫుల్ కోర్టు సమావేశంలో ప్రతి బెంచ్ రోజూ కుటుంబ వ్యవహారాలకు చెందిన పది బదిలీ పిటిషన్లు చేపట్టాలని నిర్ణయించాం. ఆ తర్వాత రోజూ పది బెయిలు సంబంధిత కేసులు.. శీతాకాల సెలవులకు ముందు పరిష్కరించాలని నిర్ణయించాం. వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది'' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. వివాహ వివాదాలకు సంబంధించి ప్రస్తుతం 3 వేల కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 13 కోర్టులు రోజూ పది బదిలీ కేసులు తీసుకుంటే రోజుకు 130 కేసులు చొప్పున వారానికి సుమారు 650 కేసులు పరిష్కరించొచ్చని సీజేఐ ఉదాహరించారు. శీతాకాల సెలవులకు ముందుగా ఈ బదిలీ కేసులు కొలిక్కి వస్తాయని తెలిపారు. అన్ని కోర్టులూ బెయిలు, బదిలీ పిటిషన్లు విచారించిన తర్వాత సాధారణ కేసులు విచారిస్తాయన్నారు. న్యాయమూర్తులు అర్ధరాత్రి వరకూ దస్త్రాలు చూడాల్సి వస్తుండడంతో వారిపై భారం తగ్గించాలని, అనుబంధ జాబితా తగ్గించాలని నిర్ణయించామని చెప్పారు.

కాప్ 27లో కాక!

కీలకాంశాలపై ఏకాభిప్రాయం మృగ్యం

- ఇంధన లాబీ కనుసన్నల్లో సదస్సు
- వర్ధమాన దేశాల తీవ్ర ఆరోపణలు
- పర్యావరణ లక్ష్యాలపై పట్టింపేది?
- ఈజిప్టు సంప్రదింపుల పత్రంపై యూరప్ దేశాల అభ్యంతరం
- 'పరిహార నిధి'కి పెద్ద దేశాలు ఓకే!



షెర్మెల్ షేక్ (ఈజిప్ట్): ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ పర్యావరణ సదస్సు కాప్ 27 దేశాల మధ్య ఉద్రిక్తతలకు వేదికగా మారింది. విషయం వాడివేడి చర్చల స్థాయిని దాటి ఏకంగా గొడవల దాకా వెళ్లింది. పలు కీలకాంశాలపై ఏకాభిప్రాయం మృగ్యమైంది. దాంతో శుక్రవారం ముగియాల్సిన ఈ 12 రోజుల సదస్సు శనివారమూ కొనసాగింది. అయినా పలు విషయాలపై పీటముడి కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా ఆతిథ్య దేశం ఈజిప్ట్ రూపొందించిన సంప్రదింపుల పత్రం పూర్తిగా నిస్సారమంటూ చాలా దేశాలు పెదవి విరిచాయి. అందులోని పలు అంశాలపై తీవ్ర అసంతృప్తి, అభ్యంతరాలు వెలిబుచ్చాయి. ఇలాగైతే గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమేనంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి. '1.5 డిగ్రీల లక్ష్యం'తో పాటు యూరోపియన్ యూనియన్ తాజాగా చేసిన చాలా ప్రతిపాదనలను సదరు పత్రంలో బుట్టదాఖలు చేయడంపై యూరప్ దేశాలు గుర్రుగా ఉన్నాయి. ఒక దశలో అవి వాకౌట్ చేస్తామని ముక్త కంఠంతో హెచ్చరించే దాకా వెళ్లింది! ఇలాగైతే పత్రంపై యూరప్ దేశాలేవీ సంతకం చేయబోవని ఈయూ కుండబద్దలు కొట్టింది. వాతావరణ మార్పుల వల్ల సముద్ర మట్టాలు ప్రమాదకరంగా పెరిగిపోతే భారీగా ముంపు తదితర ముప్పును ఎదుర్కోవాల్సి వచ్చే ద్వీప దేశాల భద్రతను పత్రంలో అసలే పట్టించుకోలేదన్నది మరో అభ్యంతరం. మరోవైపు ఈజిప్ట్ ఈ ఆరోపణలన్నింటినీ ఖండించమే గాక ఆయా దేశాలపై ప్రత్యారోపణలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో సదస్సుకు హాజరైన 40 వేల పై చిలుకు ప్రతినిధుల్లో చాలామంది వెనుదిరుగుతుండటంతో ప్రాంగణమంతా బోసిపోయి కన్పిస్తోంది.

మరోవైపు, విచ్చలవిడి పోకడలతో పర్యావరణ విపత్తులకు ప్రధాన కారకులైన సంపన్న దేశాలు వాటివల్ల తీవ్రంగా నష్టపోయిన పేద, వర్ధమాన దేశాలను ఆదుకునేందుకు భారీ పరిహార నిధి ఏర్పాటు చేయాలంటూ భారత్ సహా పలు దేశాలు చేసిన డిమాండ్‌పైనా చివరిదాకా ప్రతిష్టంభనే కొనసాగింది. ఎట్టకేలకు నిధి ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడినట్టు మధ్యవర్తులు శనివారం సాయంత్రం ప్రకటించారు. అయితే దానిపైనా ఏకాభిప్రాయం ఇంకా కుదరాల్సే ఉంది! ఇందుకోసం ఏటా ఏకంగా 100 బిలియన్ డాలర్లు వెచ్చిస్తామంటూ 2009లో చేసిన వాగ్దానాన్ని సంపన్న దేశాలు ఇప్పటికీ నిలుపుకోకపోవడం గమనార్హం. మరోవైపు, ''శిలాజ ఇంధనాల వాడకాన్ని వీలైనంత త్వరలో పూర్తిగా నిలిపేయాలన్నది గత సదస్సులోనే చేసిన ఏకగ్రీవ తీర్మానం. కానీ ఇప్పటికీ వాటి వాడకం పెరిగిపోతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. నిజానికి శిలాజ ఇంధన పరిశ్రమే సదస్సులో ప్రతి చర్చాంశాన్నీ తన కనుసన్నల్లో నియంత్రిస్తోంది'' అంటూ వర్ధమాన దేశాలు ఆరోపణలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

సౌరాష్ట్ర ఎవరికి సై?

గుజరాత్ సమరం



సౌరాష్ట్ర.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత కీలక ప్రాంతం. పటీదార్ల ఉద్యమానికి కేంద్ర బిందువు. ఈ ఉద్యమ ప్రభావంతో గత ఎన్నికల్లో ఈ ప్రాంతంపై పట్టు కోల్పోయిన బీజేపీ తిరిగి పూర్వవైభవం సాధించడానికి ప్రయత్నిస్తోంది. మరి సౌరాష్ట్ర ఓటర్లు ఎవరికి జై కొడతారు...?

సౌరాష్ట్ర కేంద్రంగా 2015లో మొదలైన పటీదార్ (పటేళ్ల) ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసిపడింది. రాష్ట్రంలో అగ్రకులమైన పటేళ్లను ఒబిసిలో చేర్చాలని, వారికి కూడా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో యువ నాయకుడు హార్దిక్ పటేల్ నేతృత్వంలో సాగిన ఉద్యమం 2017 ఎన్నికల్లో బీజేపీని బాగా దెబ్బ తీసింది. సౌరాష్ట్రలో పటీదార్లు, ఒబీసీ ఓటర్ల సంఖ్య ఎక్కువ. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పటీదార్లు చేసిన ఉద్యమంతో 2017 ఎన్నికల్లో మొత్తం 48 స్థానాలకు గాను 19 సీట్లను మాత్రమే గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో హార్దిక్ పటేల్ కాంగ్రెస్‌కు వెలుపల నుంచి మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీ ఏకంగా 28 స్థానాలను గెలుచుకొని తన పట్టు పెంచుకుంది. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీని 99 స్థానాలకే పరిమితం చేయగలిగింది. ఇప్పుడపా మాదిరి భావోద్వేగ పరిస్థితుల్లేవు. పటీదార్ల ఉద్యమం చల్లారింది. హార్దిక్ పటేల్ కాంగ్రెస్‌లో చేరినా 2019 ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటూ గెలవలేకపోయింది. హార్దిక్ ఇప్పుడు బీజేపీలో చేరారు. విరమ్‌గమ్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బరిలోకి దిగింది. ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బగా మారేలా ఉన్నాయి.

సౌరాష్ట్రలో ఎవరికెన్ని సీట్లు (ఓట్లు శాతంలో)		
ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ
2017	28 (46%)	19 (45%)
2012	15 (37%)	30 (44%)

సౌరాష్ట్రలో పటీదార్లు, కొలి జనాభా 40% దాకా ఉంది. 18 అసెంబ్లీ స్థానాల్లో పటీదార్ల ఓట్లు, 10 అసెంబ్లీ స్థానాల్లో కొలి వర్గం ఓట్లు నిర్ణయాత్మకం. ఓబీసీ, క్షత్రియులు, మత్స్యకారులు కూడా ప్రభావం చూపించగలరు. ''సౌరాష్ట్ర యువ ఓటర్లు ఈసారి ఆప్‌వైపు మొగ్గుతున్నారు. పటీదార్లు వ్యాపారాలంతా ఆప్‌కు అవకాశమిద్దామని అనుకుంటున్నారు. కొలి, ఇతర ఓబీసీ ఓటర్లు కాంగ్రెస్‌కి ఓటేయొచ్చు'' అని రాజకీయ విశ్లేషకుడు దిలీప్ గొహ్లి అభిప్రాయపడ్డారు.

బీజేపీ ఓబీసీ మంత్రం

సౌరాష్ట్రలో 48 సీట్లలో సగానికిపైగా స్థానాల్లో పటేళ్ల ఆధిక్యం ఉంది. హార్దిక్ వంటి నాయకుల్ని బీజేపీ తమ వైపు తిప్పుకున్నా పటేళ్లలో ఉపకులాల కారణంగా అందరూ బీజేపీ వైపుండే పరిస్థితి లేదు. దీంతో బీజేపీ ఓబీసీలకు టిక్కెట్లు ఎక్కువ ఇచ్చింది. 2017 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుంచి తొమ్మిది మంది ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంపయ్యారు. పటీదార్, కొలి, అహిర్ సామాజిక వర్గాలకు చెందిన కున్వర్జీ బవాలియా, బ్రిజేశ్ మెర్జా, చవడ వంటి అగ్రనాయకులూ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

– సాక్షి నేషనల్ డెస్క్

సంపన్న సౌరాష్ట్ర

సౌరాష్ట్ర ప్రాంతం మొదట్నుంచి సంపన్న ప్రాంతమే. అరేబియా తీరంలో ఉండే ఈ ప్రాంతంలో సహజవనరులు చాలా ఎక్కువ. నీటి లభ్యత ఎక్కువగా ఉండడం వల్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. ఇటీవల కాలంలో కరువు కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతోంది.2019లో సర్దార్ సరోవర్ డ్యామ్ దగ్గర నర్మద నది నుంచి నీళ్ల ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ ప్రాంతంలో 11 జిల్లాలున్నాయి. సురేంద్రనగర్, మోర్బీ, రాజ్‌కోట్, జామ్‌నగర్, దేవ్‌భూమి ద్వారక, పోర్‌బందర్, జునాగఢ్, గిర్ సోమ్‌నాథ్, అమ్రేలి, భావనగర్, బోతాడ్.. ఈ 11 జిల్లాలకు గాను బీజేపీ 2017 ఎన్నికల్లో మోర్బీ, గిర్ సోమ్‌నాథ్, అమ్రేలి జిల్లాల్లో ఒక్క సీటు సాధించలేకపోయింది. ఈ సారి ఎన్నికల్లో అధిక ధరలు, రైతు సమస్యలు, నిరుద్యోగం, నీటి సమస్య కీలకం కానున్నాయి.

సాక్షి
విజయవాడ సిటీ


ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 20 । నవంబర్ । 2022



కిడ్నీ బాధితులకు అండదండలు

ఎ.కొండూరు: కిడ్నీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని హామీ ఇచ్చారు. మండలంలోని కిడ్నీ బాధితులను శనివారం పరామర్శించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.1326 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 9465 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఉత్సాహంగా ఆడిట్ రన్

విజయవాడ స్పోర్ట్స్: ఆడిట్ దివస్ వారోత్సవాల్లో భాగంగా బీఆర్టీఎస్ రోడ్డులో శనివారం నిర్వహించిన ఆడిట్ రన్(వాక్థాన్) ఉత్సాహంగా సాగింది. రిటైర్డ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ సుధీర్ కుమార్ ఈ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు.

న్యూస్‌రీల్

ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక క్యాంపెయిన్

చిలకలపూడి(మచిలీపట్నం): ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించి ప్రతి శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఈఆర్వో)లు ఈ నెల 19, 20, డిసెంబర్ మూడు, నాలుగు తేదీల్లో ప్రతి పోలింగ్‌స్టేషన్ వద్ద ప్రత్యేక క్యాంపెయిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని పోలింగ్‌స్టేషన్లను ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తనిఖీ చేసి సాయంత్రం ఆరు గంటల్లోగా నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో పోలింగ్‌స్టేషన్లు కలిగిన పాఠశాలలు, కళాశాలలు తెరిచి ఉంచేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులు, అభ్యంతరాలను స్వీకరించడానికి పోలింగ్‌స్టేషన్‌లో అన్ని ఫారాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. బూత్‌లెవల్ అధికారులు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండాలని స్పష్టంచేశారు. బీఎల్‌ఓల హాజరును ఈఆర్వోలు తనిఖీ చేయాలని సూచించారు. అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల ఎంపిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2022–23కు సంబంధించి మండల స్థాయి ప్రాజెక్టుల ఎంపిక కార్యక్రమం శనివారం జరిగింది. పున్నమ్మతోటలోని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ సి.వి.రేణుక ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. అన్ని మండలాల నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 325 ప్రాజెక్టులకు న్యాయ పరిశీలన జరిపి జిల్లా స్థాయికి 60 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. అప్‌కాస్ట్ డీసీ ఎం హుస్సేన్, రిసోర్స్ పర్సన్ పి.నాగేశ్వరరావు, మండల సైన్స్ కో ఆర్డినేటర్స్ ఐ.రామయ్య, వై.పుల్లారావు, జె.సుధానంద్, ఇ.సత్యం తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కృష్ణా జిల్లా కార్యవర్గం ఎన్నిక



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బి.లోవకుమార్, పరిశీలకులు జి.జయబాబు, నారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం వెనుకవైపు ఉన్న సంఘ కార్యాలయ భవనంలో ఈ ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా కె.రాజేంద్రప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.ఆదినారాయణరావు, సీహెచ్.గంగాజలరావు, కార్యదర్శిగా సీహెచ్.ఆశీర్వాదం, ఉపాధ్యక్షులుగా వి.వి.కృష్ణారావు, ఎస్.రాఘవరావు, ఎస్.సుబ్బారెడ్డి, కె.ఫణిభూషణరావు, వై.దుర్గారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎల్.వెంకటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్.ప్రమీల, బి.కె.దుర్గారావు, ఎస్.వెంకటేశ్వరరావు, కె.గరుడాచారి, కోశాధికారిగా ఎ.శంకరరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

21 నుంచి ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చిర్రావూరులో సినీనటి సావిత్రి జ్ఞాపకార్థం ఒంగోలు జాతి ఎడ్ల తృతీయ జాతీయ స్థాయి పూటీ బండిలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ధనేకుల నరసింహారావు (బాబు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఈ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 21వ తేదీ స్థానిక వృషభాలు, 22న జూనియర్స్, 23న సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగనున్నాయన్నారు.

సరికొత్తగా గోరుముద్ద

మరిన్ని పోషకాలతో..
- ఈ నెల 21 నుంచి కొత్త మెనూ
- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 2,375 పాఠశాలల్లో అమలు
- ఈ పాఠశాలల్లో 2,43,799 మంది విద్యార్థులకు లబ్ధి
- వారందరికీ మరింత పోషకాలతో కూడిన ఆహారం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్) ఆకుకూర పప్పు, గుడ్డుతో భోజనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడు ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడే చదువులో చురుగ్గా రాణించగలుగుతారు. వారి ఎదుగుదల కూడా సక్రమంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు మరిన్ని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం సరికొత్త మెనూ రూపొందించింది. ఈ నెల 21వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరికొత్త మెనూ అమలు చేయనుంది. ఈ మేరకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయాల నుంచి అన్ని స్కూళ్లకు సర్క్యులర్లు వెళ్లాయి.

సరికొత్త మెనూ ఇదే

ప్రతి పాఠశాలలో సరికొత్త మెనూతో ఆరు రోజుల పాటు మధ్యాహ్న భోజనం అందిస్తారు.

సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు / వెజిటేరియన్ పలావ్, గుడ్డుకూర, వేరుశనగ చిక్కీ
మంగళవారం: చింతపండు లేదా నిమ్మకాయ పులిహోర, టమాట పచ్చడి/బెండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
బుధవారం: కూరగాయల అన్నం, బంగాళా దుంపల కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ,
గురువారం: సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం: ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి

2,375 పాఠశాలల్లో అమలు

ఎన్టీఆర్ జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 921 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1.12 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. కృష్ణా జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 1,454 స్కూళ్లు ఉండగా, వాటిలో 1,31,799 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ మరిన్ని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సరికొత్తగా జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. అంతేకాదు అక్టోబరు నుంచి వంట ఏజెన్సీలకు ఇచ్చే వ్యయాన్ని సైతం పెంచింది. ఇప్పుడు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5.88, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.57 చొప్పున చెల్లిస్తోంది.

విద్యార్థులకు ఎంతో మేలు

పిల్లలు మధ్యాహ్న భోజనంలో పోషకాలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. ఆహారం సరిగా తీసుకోని పిల్లలకు తలనొప్పి, మెదడు సరిగా పనిచేయక పోవడం, నీరసం, చదువుపై ధ్యాస పెట్టలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో పిల్లలు ఇష్టంగా తినే ఆహారం పెట్టడం ద్వారా వారిలో కార్బోహైడ్రేడ్లు, ప్రొటీన్లు, విటమిన్లు సమతూకంగా అంది వారి ఎదుగుదలలో దోహదపడుతుంది. అంతేకాకుండా చదువులో కూడా రాణించగలుగుతారని ఆహార నిపుణులు చెపుతున్నారు.

విద్యార్థుల మేలుకే కొత్త మెనూ



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూలో ప్రభుత్వం కొత్తగా మార్పులు చేసింది. పిల్లలు తినేందుకు ఆసక్తి చూపని కిచిడీ వంటి వాటిని తొలగించి సాంబార్ బాత్‌ను మెనూలో చేర్చింది. హాట్ పొంగల్, వెజిటబుల్ పలావ్ వంటి వాటిని ప్రవేశపెట్టింది. పిల్లలు సరైన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉండి చదువుపై దృష్టి సారించగలుగుతారు. అందుకే మెనూలో మార్పులు చేశారు.

– సి.వి.రేణుక, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా

సమతుల ఆహారంతో మేలు



విద్యార్థులకు కార్బోహైడ్రేడ్లు, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ అవసరం. పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారంలో ఐదు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వడం ద్వారా వారికి అవసరమైన పోషకాలు పూర్తిగా అందుతాయి. అప్పుడు పిల్లలు యాక్టివ్‌గా, ఎదుగుదలలో లోపం లేకుండా ఉంటారు. పోషకాహారం తీసుకుంటే చదువుపై దృష్టి పెట్టగలుగుతారు.

– గర్రే హరిత, న్యూట్రీషియన్, విజయవాడ

టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం



గూడూరు(పెడన): చదువుతో పాటుగా క్రీడల్లోనూ విద్యారులకు ప్రాధాన్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం మల్లవోలు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలను బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలసి మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. మంత్రి రమేష్ మాట్లాడుతూ.. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థీ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లా స్థాయి జట్ల ఎంపికకు వచ్చిన క్రీడాకారులంతా ప్రథమ స్థానం కోసం పోటీపడాలన్నారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కోసం పట్టుదలతో ఆడాలని ఆకాంక్షించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. దేశంలోని ఇతర ఏ రాష్ట్రానికి వెళ్లినా ఏపీ విద్యావ్యవస్థలో అమలవుతున్నన్ని పథకాలు ఎక్కడా కనిపించవని పేర్కొన్నారు. మన బడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చి విద్యార్థులకు శాశ్వత ఆస్తిగా విద్యను ప్రసాదిస్తున్నారని వివరించారు. విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనేలా వ్యాయామోపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తలుపుల కృష్ణ, గొరిపర్తి రవి, ఆర్బీకే చైర్మన్ పర్లం పెదబాబు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, హెచ్ఎం పాండురంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి టెన్నికాయిట్ ఆడి విద్యార్థులను ప్రోత్సహించారు.

దేశం దుస్థితి.. ధిక్కరణ పరిస్థితి

మీ వారసత్వంతో కలిసి పనిచేయలేం
- మీకు నచ్చినోళ్లకు టికెట్లు ఇచ్చుకోండి
- అధినేత ఎదుట తేల్చిచెప్పిన విజయవాడ ఎంపీ కేశినేని నాని
- నానిపై ఆగ్రహం వ్యక్తంచేసిన చంద్రబాబునాయుడు
- పార్టీలో ఉండేవాళ్లు ఉండండి, పోయేవాళ్లు పోండని హెచ్చరిక

కీలక జిల్లాల్లో గడ్డు పరిస్థితులు

'అత్యంత కీలకమని భావించే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో టీడీపీకి గడ్డుపరిస్థితులు ఉన్నాయి. పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జులు లేని దుస్థితి. ఉన్న వారి మధ్య సఖ్యత లేదు. పార్టీ క్యాడర్‌లో అధినాయకత్వం కనీస నమ్మకాన్ని కలిగించలేకపోతోంది' అని గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. కొన్నాళ్ల కిందట ఎన్టీఆర్ జిల్లా సమావేశంలో జరిగిన వాగ్వివాదాన్ని విశ్లేషిస్తే అధినేతకు ముఖ్య నాయకులపై ఎంత పట్టు ఉందో ఇట్టే తేటతెల్లం అవుతోందని మరో మాజీ ఎంపీ పేర్కొన్నారు. అమరావతి రాజధానికి కేంద్రంగా చెప్పుకుంటున్న జిల్లాల్లో పార్టీ దుస్థితిని సీనియర్లు బేరీజు వేసుకుంటూ పెదవి విరుస్తున్నారు. గత సాధారణ, మునిసిపల్ ఎన్నికలు మొదలు ప్రతి సందర్భంలోనూ అధినేత ఎంత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా స్పందన నిరాశాజనకంగానే ఉందని సీనియర్ నాయకత్వం వాపోతోంది. తాజాగా కర్నూలు జిల్లా పర్యటనలో 'ఇవే చివరి ఎన్నికలు. మీరు గెలిపిస్తేనే అసెంబ్లీకి. లేదంటే ఇంటికే' అంటూ చంద్రబాబు తన బేలతనాన్ని వ్యక్తం చేయడం ద్వారా పార్టీ దుస్థితిని తేటతెల్లం చేస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: 'టీడీపీ ఓ కంపెనీ. దాని ఓనర్ మీరు. మీ ఇష్టం వచ్చినట్లు పార్టీని నడుపుకోండి. నా కంపెనీకి నేనే యజమానిని. నా వీలును బట్టి నేను వెళ్తాను. మీ వారసత్వంతో కలిసి పనిచేయలేం' అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ఘాటుగా స్పందించడంతో విస్తుపోవడం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ ముఖ్యనాయకుల వంతైంది. కాసేపటికి చంద్రబాబు షాక్ నుంచి తేరుకుని 'ఇష్టమున్నవాళ్లు పార్టీలో ఉండండి. వెళ్లిపోయేవాళ్లు పోండి' అంటూ హెచ్చరించడంతో టీడీపీ నాయకులు మిన్నకుండిపోయారు.

ఎన్టీఆర్ జిల్లాలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహణకు ముందు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఎంపీ కేశినేని నాని, గద్దె రామ్మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జులు వర్ల రామయ్య, నెట్టెం రఘురాం, బుద్దా వెంకన్న తదితర సీనియర్లతో మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో చంద్రబాబు భేటీ అయ్యారు. 'జిల్లాలో పార్టీ పరిస్థితులు ఏమాత్రం బాగోలేవు. అంతర్గత కుమ్ములాటలతో నష్టం జరుగుతోంది. ఎంత చెప్పినా మీలో మార్పు రావడం లేదు' అంటూ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నన్ను దృష్టిలో పెట్టుకునే మీరు మాట్లాడుతున్నట్లు ఉంది. నా వల్ల పార్టీలో ఎలాంటి డిస్టర్బెన్స్ లేదు. నేనేమీ తగాదాలు పెట్టుకోవడం లేదు. ఎవరి మధ్యా గొడవలు పెట్టడం లేదు. ఈ పార్టీ మీ కంపెనీ. దీనికి మీరు ఓనర్. అలాగే కేశినేని కంపెనీకి నేను ఓనర్‌ని. నా ఇష్ట ప్రకారం నా కంపెనీ నడుస్తుంది. పార్టీలో మీరు చెప్పిందే జరుగుతుంది. ఆ తరువాత మీ వారసులు చెప్పింది నడుస్తుంది' అంటూ ఎంపీ కేశినేని కూడా అంతే స్థాయిలో స్పందించడంతో చంద్రబాబు సహా అక్కడున్న నాయకులు అవాక్కయ్యారని సమాచారం. కాసేపటికి తేరుకున్న బాబు.. 'నానీ అసలు నువ్వేం మాట్లాడుతున్నావు. నీకేమైనా తెలుస్తోందా? కంపెనీ ఏంటి? వారసులేంటి?' అని హెచ్చుస్వరంతో అనడంతో కేశినేని మౌనం దాల్చారని తెలిసింది.



పోటీపడి పార్టీని చేజిక్కించుకున్నా

'ఈ పార్టీకి వారసులుగా నేను, హరికృష్ణ, లక్ష్మీపార్వతి పోటీపడ్డాం. మా ముగ్గురి మధ్య జరిగిన పోటీలో నేను ఎక్కువగా కష్టపడ్డాను. పార్టీ నాయకత్వాన్ని చేజిక్కించుకోగలిగాను. నిత్యం కష్టపడితేనే పార్టీని నడపగలం అని చంద్రబాబు అనడంతో... 'ఓకే సార్. థాంక్స్. మీరు టికెట్ ఇచ్చారు. రెండుసార్లూ గెలిచాను. మీ వారసత్వంతో నేను పనిచేయలేనులెండి. నాకు హైదరాబాద్, ఢిల్లీలో ఆఫీసులు ఉన్నాయి. అక్కడికెళ్లి నా పనేదో నేను చూసుకుంటాను. మా పార్టీలోకి రండని రాజ్‌నాథ్‌సింగ్, గడ్కరీ ఎప్పుడో ఆహ్వానించినా నేనుగా వెళ్లలేదు. మీకు దగ్గరి వారైన సుజనా, రమేష్‌లే వెళ్లారు. ఇక్కడ (విజయవాడ) కూడా మీరు ఎవరినో (కేశినేని శివనాథ్ ఉరఫ్ చిన్నిని పరోక్షంగా ఉదహరిస్తూ) ఆల్రెడీ చూసుకుంటున్నారుగా. అలాగే కానివ్వండి. ఎంకరేజ్ చేయండి' అంటూ కేశినేని నాని ముక్తాయించడంతో బాబు సీరియస్ అయ్యారని సమాచారం.

ఉంటే ఉండండి... పోతేపోండి

'ఎవరినైనా సరే నేను ఉపేక్షించను. పార్టీలో ఉండేవాళ్లు ఉండండి. వెళ్లిపోయేవాళ్లు పోండి' అని చంద్రబాబు గట్టిగా అనడంతో 'నేనేమీ పోటీ చేయనులెండి. మీకు నచ్చినోళ్లకే టికెట్ ఇచ్చుకోండి' అంటూ కేశినేని ఇచ్చిన సమాధానంతో సమావేశాన్ని ముగించేశారని పార్టీ వర్గాల సమాచారం.

గుంటూరులోనూ తీసికట్టే..

గుంటూరు జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులు లేక పార్టీ కార్యక్రమాల నిర్వహణ కొరవడుతోందని ఓ సీనియర్ మాజీ మంత్రి వాపోయారు. సత్తెనపల్లి, నరసరావుపేట, ప్రత్తిపాడులో పరిస్థితులను ఉదహరించారు. కొన్ని నియోజకవర్గాలకు పేరుకే ఇన్‌చార్జులని పార్టీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి. మొన్నటికి మొన్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ సవాల్ విసిరినా పార్టీ స్పందించకపోవడాన్ని టీడీపీకి చెందిన పొన్నూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఒకరు తప్పుపట్టారు. లోకేష్ నాయకత్వం వహిస్తున్న మంగళగిరిలో సీనియర్ నాయకులు వరుసపెట్టి వీడుతున్న వైనం పార్టీ దుస్థితికి అద్దంపడుతోందని టీడీపీ నాయకులు వాపోతున్నారు. రాజధాని ప్రాంతంగా గొప్పలుపోతున్న తాడికొండలోనూ సానుకూలత కనిపించడం లేదనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

సాకారం దిశగా దశాబ్దాల కల

- పోర్టు నిర్మాణానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు మంజూరు
- డిసెంబర్ 21వ తేదీన పోర్టు పనుల ప్రారంభానికి ఏర్పాట్లు
- మచిలీపట్నం ఎంపీ బాలశౌరి వెల్లడి



నిధుల మంజూరు పత్రాన్ని చూపుతున్న ఎంపీ బాలశౌరి, వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు ప్రజల దశాబ్దాల కల త్వరలో నెరవేరబోతోందని పార్లమెంట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక తన కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు పోర్టు నిర్మాణంపై ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పోర్టుకు రూ.3,904 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధుల మంజూరు పత్రాన్ని ఆయన విలేకరులకు చూపారు. డిసెంబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బందరు పోర్టు పనులను ప్రారంభించేందుకు అడుగులు వేస్తున్నామని వివరించారు. పోర్టు నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని స్పష్టంచేశారు. పోర్టు నిర్మాణంతో అనేక పరిశ్రమలు ఏర్పాటుకావటంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం 75 శాతం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. పూణె వరకు బందరు పోర్టు అందుబాటులో ఉంటుందన్నారు.

ఆరులైన్లతో మచిలీపట్నం – విజయవాడ రోడ్డు

పోర్టు నిర్మాణం ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న మచిలీపట్నం – విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరామని ఎంపీ బాలశౌరి తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఆరు లేన్ల రహదారికి డీపీఆర్ తయారుచేయాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారని వెల్లడించారు. సాగరమాల ప్రాజెక్టు ద్వారా పోర్టుకు అనుసంధానంగా మరో ఐదు రహదారులను ఏర్పాటు చేయాలని సూచించారని తెలిపారు. మచిలీపట్నం – రేపల్లె రైలు మార్గం అతి దగ్గర రైలుమార్గంగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రులకు సూచించామన్నారు. మచిలీపట్నం నుంచి అవనిగడ్డ మీదుగా రేపల్లెకు రైలు మార్గం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌లు చూపామని వివరించారు.

మాది చేతల ప్రభుత్వం

బందరు పోర్టు నిర్మించి తీరుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం చర్యలు చేపట్టామని ఎంపీ బాలశౌరి తెలిపారు. ప్రతిపక్ష నాయకులు పోర్టు నిర్మాణం జరుగుతుందో లేదోనని వ్యాఖ్యానిస్తున్నారని, అయితే తాము చేసేది మాత్రమే చెబుతామని స్పష్టంచేశారు. రెండున్నర సంవత్సరాల్లో పోర్టు నిర్మాణం పూర్తి చేసుకుని ఓడల్లో ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయని ధీమా వ్యక్తంచేశారు. దశాబ్దాల కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు రొండి కృష్ణ, రాజులపాటి అచ్యుతరావు, మాదివాడ రాము, తలుపుల కృష్ణ, గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్, వక్ఫ్ బోర్డు కమిటీ డైరెక్టర్ అల్తాఫ్‌హుస్సేన్, కృష్ణాంజనేయులు, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రిమినల్ కేసుల్లో అరెస్టయిన ఇద్దరు ఉపాధ్యాయులను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక సస్పెండ్ చేశారు. విస్సన్నపేట మండలం నరసాపురం (బీసీకాలనీ) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఇ.నాగేశ్వరరావు, ఎ.కొండూరు మండలం చీమలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా పనిచేస్తున్న కె.నారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిద్దరూ క్రిమినల్ కేసుల్లో అరెస్టయినట్లు నివేదిక అందిందని డీఈఓ పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరి, ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినట్లు రుజువైందని, దీనికితోడు రెడ్డిగూడెం పోలీసు స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు డీఈఓ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను విజయవాడ కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ రాణిగారితోటలోని మాదంశెట్టి సీతయ్య వీధికి చెందిన గూడూరి సురేష్, కోదాడకు చెందిన జంజనం నాగస్వాతికుమార్, కృష్ణలంకలోని గంగానమ్మ గుడి రోడ్డుకు చెందిన పీతా దుర్గాప్రసాద్‌లు స్నేహితులు. వీరు ముగ్గురు కలిసి ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం ముగ్గురు కలిసి అరకు వెళ్లారు. అక్కడ ఏజెన్సీ ప్రాంతంలో 21 కేజీల గంజాయిని కొనుగోలు చేసి శనివారం మధ్యాహ్నం 11గంటల సమయంలో వారధి గుంటూరు బస్టాప్ వద్ద బస్సు దిగారు. దానిని ముగ్గురు పంచుకునేందుకు ఫీడర్ రోడ్డు గుండా కృష్ణానదిలోకి వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మూటలోని 21 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

స్కిల్ కాలేజ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన స్కిల్ కాలేజ్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏపీఎస్ఎస్‌డీసీ ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ ప్రకటనలో కోరారు. ఈ కోర్సుల్లో అర్హత కలిగిన ఎన్టీఆర్ జిల్లాలోని అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ప్రతి స్కిల్ కాలేజ్‌లో శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని, శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 96769 52583 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

అదుపు తప్పి వ్యాను బోల్తా

కృత్తివెన్ను: కూలీలు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడిన ప్రమాదంలో తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోని పాశ్చాపురం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం వడ్డిగూడెంకు చెందిన కూలీలు వైఎస్సార్ కడప జిల్లా పొద్దుటూరులో చెరువుల్లో చేపలు పట్టే పనులకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో 12 మంది బొలెరో వాహనంలో వస్తుండగా శనివారం పాశ్చాపురం సమీపంలో అదుపు తప్పి 216 జాతీయ రహదారిపై నుంచి రోడ్డు పక్కన పల్లం ప్రాంతంలోకి బోల్తా పడింది. తొమ్మిది మందికి గాయాలు కాగా వీరిలో ఇద్దరికి తీవ్రగాయలైనట్లు తెలిపారు. బాధితులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెరిసిన మెకానిక్ మౌలాలి !


మౌలాలి తయారుచేసిన పరికరంతో పత్తి పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు


ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందుతున్న మౌలాలి

- ప్రభుత్వ ప్రోత్సాహం వినియోగించుకొని కొత్త ఆవిష్కరణలు
- రైతులకు మేలు చేసేలా తైవాన్ స్ప్రేయర్ల అభివృద్ధి

నందిగామ: సమాజంలో ఎంతో మంది మట్టిలో మాణిక్యాలు ఉన్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యాలు సంపాదించి వెలుగులోకి రాకుండా కొందరుంటే... మరికొందరు ప్రభుత్వ ప్రోత్సాహంతో తమ ప్రతిభకు మరింత మెరుగుపెట్టి ముందుకు దూసుకుపోతున్నారు. ఆ కోవలోకి వచ్చే వ్యక్తే చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి. తన తెలివితేటలను గుర్తించి ప్రభుత్వం అందించిన ఆర్థిక చేయూతతో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నాడు. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు అనేక మంది రైతులకు మేలు చేసే పరికరాలు తయారుచేసి అందిస్తున్నాడు.

నాడు మహానేత... నేడు ఆయన తనయుడు..

చింతలపాడు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి ఓ మధ్య తరగతి కుటుంబీకుడు. ఇంటర్ వరకు చదివి గతంలో హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేసేవాడు. అప్పట్లో పక్షవాతం రావడంతో ఆ కంపెనీ మౌలాలిని ఉద్యోగంలో నుంచి తొలగించింది. చేసేది లేక తిరిగి స్వగ్రామానికి వచ్చేసాడు. ఆ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. అప్పట్లో గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి శిక్షణ కల్పించింది. దీంతో తైవాన్ స్ప్రేయర్లు రిపేరు చేయడం నేర్చుకున్నాడు. ఈ తరహా శిక్షణ పొందిన వాళ్లని వైఎస్సార్ ప్రభుత్వం మండలానికి ఒకరిని చొప్పున నియమించారు. వీరు వ్యవసాయశాఖ అనుబంధంగా ఉంటూ పనిచేశారు. రైతుల స్ప్రేయర్లు మరమ్మతులకు గురైతే వీళ్లే బాగు చేసేవారు. అప్పట్లో వీరికి నెలకు రూ.8 వేలు చొప్పున పారితోషికం సైతం ప్రభుత్వం అందించింది. దీంతో భరోసాగా ముందుకు సాగుతూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. అయితే ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయశాఖ తరుపున పని చేస్తున్న ఇటువంటి మెకానిక్‌లను తొలగించింది. దీంతో మౌలాలి ఉపాధి కోల్పోయాడు.

రూ.5 లక్షల ఆర్థిక సాయం

మరో మారు నిరుద్యోగిగా మారిన మౌలాలికి ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేయూతనిచ్చింది. గత ఏడాది విభిన్న తెలివితేటలు ఉన్న మెకానిక్‌లను గుర్తించి వారికి ప్రత్యేక ట్రైనింగ్ కూడా ఇప్పించింది. ఆ సమయంలో ఎన్జీ రంగా అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయంలో తిరుపతిలో రెండు నెలలపాటు మౌలాలి శిక్షణ పొందాడు. ఆ తరువాత ప్రభుత్వమే రూ.5 లక్షల ప్రోత్సాహక బహుమతి అందించింది. తన తెలివితేటలకు మరింత పదును పెట్టి రైతులకు సేవలందించడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు.

మౌలాలీ తయారుచేసిన పరికరాలు ఇవే....

సాధారణంగా తైవాన్ స్ప్రేయర్లు 34 సిసి ఇంజిన్‌తో ఉంటాయి. ఆ స్ప్రేయర్ కంపెనీని బట్టి రూ.8 వేల నుంచి రూ.23 వేల వరకు ధర ఉంటాయి. దానికి ఒక ఇన్‌పుట్ చానల్ ఉంటుంది. దానికి ప్రత్యేకంగా చాంబర్లు ఏర్పాటు చేసి రెండు ఇన్‌పుట్ చానల్స్‌ను అమర్చుతారు. దానికి ప్రత్యేకంగా అతి పొడవు ఉన్న పైపు ఏర్పాటు చేస్తారు. అలా ఏర్పాటు చేయడం వల్ల పొలంలో ఒకే చోట స్ప్రేయర్ ఉంచి దాదాపు రెండు ఎకరాలకు పైగా పొలంలో తిరుగుతూ మందులు పిచికారీ చేయవచ్చు. దీనివలన రైతు స్ప్రేయర్ భుజం మీద పెట్టుకొని బరువు మోస్తూ తిరిగే పని తగ్గిపోవడంతో పాటు సమయం కూడా చాలా వరకు కలిసి వస్తుంది. అదేవిధంగా మరో మోడల్ స్టీల్ పైపు ద్వారా నాలుగు నాజిల్స్‌తో ప్రత్యేకంగా తయారుచేసిన పరికరం ద్వారా మందును పిచికారీ చేసినప్పుడు అది రైతుకు హాని కలగకుండా చూడటంతో పాటు డబ్బు, సమయం కూడా ఆదా అవుతుంది. ఈ రెండిటి తయారీకి పెద్దగా ఖర్చు కూడా కాదని మౌలాలి చెబుతున్నాడు. రైతుకు ఎంతగానో ఉపయోగపడుతుండడంతో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రైతులకు హాని లేకుండా మందు పిచికారీ

తైవాన్ స్ప్రేయర్ అంటే తెలియని రైతులు ఉండరు. పొలాల్లో పురుగు మందులు పిచికారీ చేయడానికి దీనిని వినియోగిస్తారు. సాధారణంగా రైతు మందు కొట్టే సమయంలో చేతి ద్వారా ముందుకు పట్టుకుని స్ప్రే చేయాల్సి ఉంటుంది. దానివల్ల మందు ప్రభావం రైతుపై పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ తరుణంలో మందు స్ప్రే చేసే సమయంలో రైతుకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఓ పరికరాన్ని తయారు చేశాడు. దానిద్వారా రైతు మందు కొట్టే సమయంలో ముందుకు నడుస్తూ ఉంటే అది వెనుక భాగంలో మొక్కలపై పడేలా మందును పిచికారీ చేస్తూ ఉంటుంది. అదేవిధంగా ఒకే సమయంలో మూడు మడుల వరకు కవర్ చేయవచ్చు. దీనివల్ల రైతు ఆరోగ్యానికి మేలు జరగడంతో పాటు సమయం కూడా కలిసి వస్తుంది. గతంలో అనేక మంది రైతులు పొలంలో పురుగుల మందు పిచికారీ చేసిన తర్వాత ఆ ప్రభావానికి అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడేవారు. అనేక ప్రాంతాల్లో ఈ విధమైన సమస్యలు రైతులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యకు చెక్ పెడుతూ మౌలాలి తయారుచేసిన పరికరం దోహద పడుతుంది. దీంతో రైతులు ఉత్సాహంగా వీటిని కొనుగోలు చేస్తున్నారు.


ఆధునిక పరికరం ద్వారా వరి పొలంలో మందు కొడుతున్న రైతు

డబ్బు, సమయం ఆదా



గతంలో పొలంలో మందు పిచికారీ చేయాలి అంటే తప్పనిసరిగా కూలి మనిషిని పిలవాల్సి వచ్చేది. ఒక్కో సమయంలో కూలీలు దొరక్క ఇబ్బంది పడేవాళ్లం. గత ఏడాది నేను ఆధునిక విధానంతో తయారుచేసిన స్ప్రేయర్ ను కొనుగోలు చేశాను. అప్పటి నుంచి కూలీలతో పని లేకుండా ఒకే చోట స్ప్రేయర్‌ను ఉంచి పొలంలో తిరుగుతూ మందు పిచికారీ చేసుకుంటున్నాము. దీని కారణంగా నాకు డబ్బుతో పాటు, సమయం కూడా ఆదా అవుతోంది.

వినయ్ భూషణ్ రెడ్డి, కొత్త రెడ్డిపాలెం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా

జగనన్న రుణం తీర్చుకోలేనిది



నేను ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాను అంటే అది ప్రభుత్వ సహకారంతోనే సాధ్యమైంది. నాడు మహానేత కారణంగా నేను ఉచితంగా మెకానిక్ విద్యను నేర్చుకోగలిగాను. నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారణంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాను. ప్రభుత్వమే నా ఆలోచనలకు మరింత పదును పెట్టేలా ట్రైనింగ్ ఇచ్చి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేసింది. నిజంగా ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేనిది.

షేక్ మౌలాలి, తైవాన్ స్ప్రేయర్ మెకానిక్

రైతులకు ఎంతో మేలు



మౌలాలి తయారుచేసిన తైవాన్ స్ప్రేయర్లు రైతులకు ఎంతో మేలు చేస్తుంది. రైతుల ఆరోగ్యానికి హాని కలగకుండా ఉండడంతో పాటు డబ్బు, సమయం ఆదా అవుతుంది. ముఖ్యంగా వాణిజ్య పంటలు పండించే రైతులకు తరచూ ఈ స్ప్రేయర్ అవసరం ఉంటుంది. దీని ద్వారా ఆకు అడుగు భాగంలో ఉండే తెగుళ్ల సైతం నశిస్తాయి. రైతు ఆధునిక పద్ధతులకు అనుగుణంగా మారి వ్యవసాయాన్ని చేయడం ఎంతో మేలు.

రమణమూర్తి, ఏడీఏ, నందిగామ


ఆంధ్రుల వైభవం.. ఆలయ నృత్యం..


ఆంధ్రనాట్యంలో శిక్షణ తీసుకుంటున్న యువతీ యువకులు

భారతీయ నృత్య సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. కూచిపూడి, భరతనాట్యం, కథక్ తదితర నృత్యాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. వీటి సరసన చేరిన మరొక పురాతనమైనది ఆలయ నృత్యం. ఆంధ్రుల సాంస్కృతిక వైభవానికి గుర్తుగా ఈ సంప్రదాయ నృత్యం నిలుస్తోంది. నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ కృషితో అంతరించిపోతున్న ఆలయ నృత్యం వెలుగులోకి వచ్చింది. ఆయన ఆ నృత్యానికి శాస్త్రీయతను జోడించడంతో ఆంధ్ర నాట్యంగా రూపుదిద్దుకుంది. ఆంధ్ర నాట్యానికి జీవితాన్ని అంకితం చేసిన నటరాజ రామకృష్ణ శత జయంతి వేడుకలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన కృషితో వెలుగులోకి వచ్చిన ఆలయ నృత్యంపై ప్రత్యేక కథనం.


ఆంధ్రనాట్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్:ఆంధ్ర నాట్యం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది డాక్టర్ నటరాజ రామకృష్ణ. తెలుగు వాడైన రామకృష్ణ తల్లిదండ్రులతోపాటు ఇండోనేషియాలోని బాలీ ద్వీపానికి ఉద్యోగరీత్యా వెళ్లారు. మరలా హైదరాబాద్ చేరుకొని ఆలయ నృత్య పరిశోధనకు బీజం వేశారు. సహజంగా నృత్య ప్రియుడైన నటరాజ రామకృష్ణ అనేక దేవాయాలను దర్శించి అక్కడి నృత్య శిల్పాలను పరిశీలించారు. శాసనాలు, పురాణ గ్రంథాలను శోధించి ఆలయ నృత్యానికి ఆంధ్ర నాట్యం పేరు పెట్టడంతో సరికొత్త నాట్యానికి అంకురార్పణ చేశారు.


నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ

కాలానుగుణమైన మార్పులతో...

రెండు వేల సంవత్సరాల పూర్వం నుంచే ఆంధ్ర నాట్యం ఛాయలున్నాయని చరిత్ర చెబుతోంది. ఆలయ సంప్రదాయంలో భగవంతునికి కైంకర్య సమయంలో సంప్రదాయ రీతిలో దేవాలయాల్లో జరిగే ఉత్సవాల్లో మహిళలు మాత్రమే నృత్యాలు చేసే వారు. కాలనుగుణమైన మార్పులతో నటరాజ రామకృష్ణ లాంటి నాట్యాచార్యుల ప్రేరణతో ఆలయ నృత్యం ఆంధ్ర నాట్యంగా రూపుదిద్దుకొని ప్రదర్శిస్తున్నారు. ప్రారంభంలో ఆలయ నృత్యాన్ని స్త్రీ లాస్యం, నర్తనం, కచేరి, కేళిక అనే పేర్లతో పిలిచే వాళ్లు. అన్నాబత్తుల బలివెంకట రత్తమ్మ, ఇందువదన, సరిదే వెంకటరమణమ్మ తదితరులు కనుమరుగైన ఆలయ సంప్రదాయాన్ని వెలికి తీసి ఆంధ్ర నాట్యంగా నామకరణం చేశారు.

సాంస్కృతిక శాఖ గుర్తింపు....

ఆంధ్ర నాట్యం విశిష్టతను గుర్తించిన కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆంధ్ర నాట్యానికి ప్రాచీన హోదానిచ్చి సంప్రదాయ నృత్యంగా గుర్తించింది. పరిశోధకులకు ఫెలోషిప్ సైతం ప్రదానం చేస్తోంది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. నాట్య సంప్రదాయం కాపాడుతున్న కొందరు నాట్యాచార్యులు శారదా రామకృష్ణ, రంగం రాఘవకుమారి, సునంద, కళాకృష్ణ, డెందులూరి పద్మ, పేరిణీ ప్రకాష్, సువర్చల, నవత, శీతల్, ఉమామహేశ్వరి, సప్పా దుర్గా ప్రసాద్, అన్నాబత్తుల మంగతాయారు, కల్పన ఆంధ్రనాట్య అభివృద్ధికి కృషి చేస్తున్న వారిలో ఉన్నారు.

పూర్వవైభవం కోసం కృషి



నటరాజ రామకృష్ణ వద్ద ఆంధ్రనాట్యంలో శిక్షణ తీసుకున్నాను. గురు సంప్రదాయాన్ని పాటిస్తూ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నాను. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠంతోపాటు, ప్రభుత్వం నిర్వహించే సంగీత కళాశాల, పాఠశాలలోనూ ఆంధ్రనాట్యం కోర్స్‌ను ప్రారంభించాలి. ప్రభుత్వ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆంధ్రనాట్యంకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పిళ్లా ఉమా మహేశ్వరపాత్రుడు, ఆంధ్రనాట్య ఆచార్యులు

కబడ్డీ రాష్ట్ర జట్టు శుభారంభం


జట్టుకు సూచనలిస్తున్న కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు శుభారంభం చేసింది. ఉత్తరాంఖండ్‌లోని రిషికేష్‌లో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌లలో రాష్ట్ర జట్టు వెస్ట్ బెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్ జట్లపై తలపడాల్సి ఉంది. శనివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో రాష్ట్ర జట్టు వెస్ట్ బెంగాల్‌పై 20 పాయింట్ల ఆధిక్యంతో గెలిచింది. రెండో మ్యాచ్‌లో తమిళనాడుపై 12 పాయింట్లతో ఓడింది. ఆదివారం మూడో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌లో రాష్ట్ర జట్టు తలపడుతుంది. ఈ మ్యాచ్ గెలిస్తే ప్రీ క్వార్టర్స్‌కు జట్టు అర్హత సాధిస్తుంది.

ఒత్తిడిలోనూ విజయం.....

రాష్ట్ర జట్టు ఎంపిక ఆసాంతం వివాదాల నడుమ సాగిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని రెండు కబడ్డీ సంఘాల వివాదాల నడుమ హైకోర్టు ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) జట్టును ఎంపిక చేసింది. పోటీల తేదీకి ఒక్క రోజు ముందు హడావిడిగా ఎంపికైన జట్టు ఉత్తరాంఖండ్ చేరుకునేందుకు నానా తంటాలు పడింది. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తన గ్రూప్ క్రీడాకారులను విమానంలో తీసుకెళ్లగా మరో అసోసియేషన్ ప్రతినిధులు వారి గ్రూప్ క్రీడాకారులను గాలికొదిలేశారు. తుదకు మళ్లీ శాప్ అధికారులు జోక్యం చేసుకుని పోటీల నిర్వాహకులతో మాట్లాడి సమయం తీసుకుని మిగిలిన కొందరు క్రీడాకారులను పోటీల ప్రాంగణానికి పంపారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర జట్టు రోజుకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే వివాదాల కారణంగా జట్టు ఆలస్యంగా రిషికేష్‌కు చేరుకుంది. దీంతో ఒకే రోజు మూడు మ్యాచ్‌లను ఆడాల్సి వచ్చింది. తీవ్ర ఒత్తిడిలోనూ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ఒక మ్యాచ్‌లో విజయం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుట్రలు, కుతంత్రాలను ఖాతరు చేయకుండా రాష్ట్ర జట్టును జాతీయ పోటీలకు పంపేందుకు తీవ్ర కృషి చేసిన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డికి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్‌లకు కబడ్డీ జట్టు బృందం కృతజ్ఞతలు తెలిపింది. పలు ప్రసార మాధ్యమాలను వేదిక చేసుకుని శాప్, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు పన్నుతున్న అనధికార కబడ్డీ అసోసియేషన్ నాయకులకు త్వరలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

నేరసమీక్షా సమావేశంలో ఎస్పీ జాషువా


మాట్లాడుతున్న ఎస్పీ జాషువా, చిత్రంలో ఏఎస్పీ రామాంజనేయులు

కోనేరుసెంటర్: పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో అలసత్వం వహించినా, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. మహిళలపై జరిగిన దాడులకు సంబంధించి ఇప్పటి వరకు నమోదైన కేసులను పరిశీలించి సమీక్షించాలని తెలిపారు. విచారణలో ఉన్న కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాపర్టీ కేసులకు సంబంధించి నూరు శాతం రికవరీ ఉండాలని పేర్కొన్నారు. నేరం జరిగిన ప్రాంతాలకు స్వయంగా వెళ్లి సాక్ష్యాలను సేకరించి పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నేరాలకు అలవాటుపడిన వ్యక్తులు ఉంటే వారిపై అనుక్షణం కన్నేసి ఉంచాలన్నారు. పోక్సో కేసుల్లో నిర్దేశించిన సమయంలోగా విచారణ పూర్తి చేసి బాధితులకు ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌లలో రిసెప్షన్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో సమాచార వ్యవస్థ మరింత బలోపేతం చేయాలని తెలిపారు. అల్లర్లు, అలజడులు సృష్టించే గ్రూపులపై నిఘా ఉంచి వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ప్రధాన కూడళ్ళు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో విజువల్ పోలీసింగ్‌ను పటిష్ట పరచాలన్నారు. బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రాత్రిపూట గస్తీ తిరిగే సిబ్బందికి పాయింట్ బుక్స్ అందజేయటంతో పాటు సిబ్బంది ఎన్ని ప్రాంతాలు తిరిగారు, ఎంత మంది అపరిచిత వ్యక్తులను గుర్తించారు అనే విషయాలను పాయింట్ బుక్‌లలో నమోదు చేయాలని వివరించారు. మిస్సింగ్ కేసులపై దృష్టి సారించాలని తెలిపారు. కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్‌లను పెండింగ్‌లో ఉంచకుండా జాగ్రత్తపడాలని స్పష్టం చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకట రామాంజనేయులు, బందరు, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం డీఎస్పీలు మాసూంబాషా, మహబూబ్‌బాషా, సత్యానందం, పాల్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం



లబ్బీపేట(విజయవాడతూర్పు):ఫార్మసీ చదివే విద్యార్థులకు జీవరాశుల వైద్యశాస్త్రంలో సవాళ్లను పరిష్కరించడంపై పట్టు సాధించేందుకు కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల మంగళగిరిలోని ఎయిమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఈ నెల 18 అనుసంధాన్ -2022 పేరుతో నిర్వహించిన పరిశోధనా సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత, ఎయిమ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ టీఎస్ రవికుమార్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. పరిశోధనలపై పట్టు సాధించి ఫార్మా పరిశ్రమల్లో నేరుగా మంచి ఉద్యోగ అవకాశాలు సాధించగలరని పేర్కొన్నారు. ఎయిమ్స్ రీసెర్చ్ డీన్ డాక్టర్ దీప్తి వేపకొమ్మ, అసోసియేట్ డీన్ డాక్టర్ సుశీల్ శర్మ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులు సరళ, తన్విత సమర్పించిన పరిశోధనా పత్రాలకు బహుమతులు వచ్చాయన్నారు.

విద్యతోనే బాలలపై వేధింపుల నివారణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు):బాలలపై వేధింపులు లేని సమాజాన్ని నిర్మించడంలో యువత పాత్ర చాలా కీలకమని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, చైల్డ్‌లైన్ డైరెక్టర్ బీఎస్ కోటేశ్వరరావు చెప్పారు. సిద్ధార్థ కళాశాల సెమినార్ హాల్లో బాలల హక్కుల పరిరక్షణకై చైల్డ్‌లైన్-1098, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, మహిళా శిశు సంక్షేమ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో పసిమొగ్గలపై పైశాచికం లేని సమాజ నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. బీఎస్ కోటేశ్వరరావు అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యతోనే బాలలపై వేధింపులను నివారించగలమని తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఏవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజు రోజుకు బాలలపై వేధింపులు, బాల్య వివాహాలు, మిస్సింగ్, అత్యాచారం వంటి కేసులు అధికం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ రమేష్, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రేమలత, ఏఎస్ఐ శివకుమారి, సచివాలయం మహిళా పోలీస్ జిల్లా కో-ఆర్డినేటర్ నీలా శాంతి, వార్డు సచివాలయం మహిళా సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూలుతున్న కాపురాలు

వన్‌టౌన్‌కు చెందిన ఓ జంట 17 ఏళ్ల క్రితం వేదమంత్రాల సాక్షిగా మూడు ముళ్లు, ఏడు అడుగులతో ఒక్కటయ్యారు. వీరికి తొమ్మిది, ఏడో తరగతి చదివే ఇద్దరు కుమార్తెలున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవిస్తున్నారు. లాక్‌డౌన్‌లో భర్త ఉద్యోగం పోయింది. కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు భార్య ఓ జాబ్‌లో చేరింది. కొన్నాళ్ల సక్రమంగానే నడిచిన కాపురంలో ఒక్కసారిగా కలహాలు ఆరంభమయ్యాయి. భార్యపై అనుమానం పెంచుకుని శారీరక, మానసిక, విచక్షణారహిత దాడికి భర్త దిగాడు. ఇంటి పని, ఉద్యోగ రీత్యా ఎదురయ్యే టెన్షన్‌లకు భర్త వేధింపులు తోడవడంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. రోజురోజుకి శ్రుతిమించుతున్న భర్త వేధింపులను తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించి విడాకులు కావాలంటూ కోర్టు మెట్లెక్కింది.

ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో నిత్యం ఎవరెవరితోనో చాటింగ్ చేస్తుండే తన భార్య నుంచి విడాకులు కోరుతూ ఓ వ్యక్తి ఇటీవల పోలీసులను ఆశ్రయించాడు. మరో కేసులో 56 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగి తన భార్య నుంచి విడాకులు కోరుతూ కోర్టు మెట్లెక్కాడు. మద్యం మత్తులో భర్త తనపై విచక్షణా రహితంగా లైంగిక దాడికి పాల్పడి అనారోగ్యం పాల్జేశాడని, తనకు విడాకులు ఇప్పించాలని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సహజీవనం ఫలితంగా బిడ్డకు జన్మనిచ్చిన తరువాత మొహం చాటేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల బిడ్డతో సహా ఓ మహిళ దిశ పోలీసుల వద్దకు వచ్చింది.

- ఎగతాళిగా మారుతున్న పవిత్రబంధం
- వివాహబంధాన్ని భారంగా భావిస్తున్న వైనం
- పెరుగుతున్న భార్యాభర్తల వివాదాల కేసులు
- ఎక్కువ మంది విడిపోయేందుకే మొగ్గు



పవిత్రమైన భార్యాభర్తల బంధం ఎగతాళిగా మారుతోంది. కొత్తగా పెళ్లిళ్లు చేసుకొని కొద్ది రోజులు సక్రమంగా కాపురాలు చేసిన జంటలు మొదలుకొని.... ఎన్నో ఏళ్ల పాటు ఎలాంటి వివాదాలు లేకుండా జీవనం సాగించి.... పిల్లలు పెద్దవాళ్లుగా ఎదిగి పెళ్లీడుకొచ్చినా కొందరు దంపతులు ఘర్షణలు పడి విడివిడిగా జీవించేందుకు విడాకులు కోరుతున్న ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఎందరో అధికారులు, పై స్థాయి వ్యక్తులు సైతం వైవాహిక జీవితాల విషయంలో ఏర్పడిన వివాదాలతో పోలీసుస్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు. చిన్నపాటి విషయాలకే ఘర్షణలకు పాల్పడి శాశ్వతంగా విడిపోయేందుకు అనేక జంటలు సిద్ధమవుతున్నాయి. తమకు విడాకులు మంజూరు చేయాలంటూ కోర్టులకు చేరుతున్నారు. నిత్యం పోలీసుస్టేషన్లకు భార్యాభర్తల మధ్య వివాదాలకు సంబంధించిన కేసులే ఎక్కువగా వస్తున్నాయి.

విజయవాడస్పోర్ట్స్: సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా, టీవీ సీరియల్స్ ప్రభావం దంపతుల ఎడబాటుకు కారణాలుగా ఉన్నాయని ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాల నిర్వాహకులు, మానసిక వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సోషల్ మీడియా ప్రధాన భూమిక పోషిస్తుందని అంటున్నారు. అన్ని కుటుంబాల్లోని ప్రజలు స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా, టెలిగ్రాం, యూట్యూబ్ తీసుకొచ్చిన వినోదానికి ఆకర్షితులవుతూ ఒంటరితనానికి దగ్గరవుతున్నారు. అత్యధిక సమయం ఫోన్‌లోనే లీనమవటం భాగస్వామి మదిలో అనుమానం రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఠాణా మెట్లెక్కే 50 శాతం జంటల వివాదాలకు స్మార్ట్‌ఫోన్‌లే మూలకారణమని నిపుణులు చెబుతున్నారు. గడిచిన పది నెలల్లో విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 13 స్టేషన్‌లలో భార్యాభర్తలకు సంబంధించిన 1,036 కేసులు నమోదయ్యాయి. ఆయా స్టేషన్‌లకు వచ్చిన ఫిర్యాదులు మూడు వేలకు పైగానే ఉంటాయని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాలు, పోలీస్‌స్టేషన్‌లు, పెద్దలు ద్వారా రాజీ పడిన వారు రెండు వేల మందికి పైగా ఉన్నారు.

మాట పట్టింపులతో....

మాట పట్టింపులు ఎన్నో కాపురాలను కూల్చేస్తోంది. పై చేయి సాధించాలనే ప్రయత్నంలో తలెత్తే వివాదాలు జంటలను పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిస్తున్నాయి. మానసిక, శారీరక, లైంగిక వేధింపుల కారణంగా 20 శాతం జంటలు విడిపోయేందుకు సిద్ధమవుతున్నాయని మానసిక వైద్యులు చెబుతున్నారు.

ఒంటరితనం కోసం....

కొందరు స్త్రీలు ఎక్కువమంది ఒంటరి తనాన్ని కోరుకుంటున్నట్లు కౌన్సెలింగ్ కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. తమ వద్దకు వచ్చే వివాహితలు పెద్దవాళ్లతో కలిసి జీవించేందుకు ఇష్టపడటం లేదని అంటున్నారు. కుటుంబ సభ్యుల నుంచి తలెత్తే చిన్న చిన్న సవాళ్లను సైతం ఎదుర్కొనలేక ఇబ్బందులు పడుతూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. తన సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలంటూ పోలీసులపై ఒత్తిడి తేవడం.. పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఉన్నతాధికారులను ఆశ్రయించడం... ప్రస్తుతం నగర పోలీసు కమిషనరేట్‌లో ఈ తరహా కేసులు అధికమవుతున్నాయి.

విజయవాడ నగరంలోని పోలీస్‌స్టేషన్‌లలో నమోదయిన కేసులు...

సంవత్సరం	పోలీస్ స్టేషన్‌లలో ఎఫ్ఐఆర్ కేసులు	కౌన్సెలింగ్ తీసుకున్న జంటలు
2019	430	210
2020	512	420
2021	849	630
2022 అక్టోబర్ వరకు	1,036	621

అవగాహన లేకపోవడం వల్లే గొడవలు



కొత్తగా వివాహం జరిగిన జంటలూ విడాకులు కోరుకుంటున్నాయి. పరస్పర అవగాహన లేమి గొడవలకు కారణమవుతోంది. ఒకరిపై మరొకరికి నమ్మకం, గౌరవం లేకపోవడం, ఆర్థిక వనరులన్నీ అందుబాటులో ఉండటం, ఎలాగైనా బతకగలమనే భావం పెరగడమూ ఒక కారణం. భార్య/భర్త భావాలను సరిగ్గా అర్థం చేసుకునే సామర్థ్యం ప్రస్తుతం చాలా మందిలో తగ్గిపోయింది.

రమాదేవి, సైకాలజిస్ట్

గిరి అందం.. ప్రకృతి రమణీయం

- కొండవీడు అభివృద్ధికి రూ.13.35 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఈ ఏడాది రూ.1.58 కోట్లతో పనులు
- నగరవనంతో పర్యాటకంగా ప్రగతి పథం



కొండవీడు మొదటి ఘాట్‌రోడ్డు

యడ్లపాడు: నిత్యం ఒత్తిళ్ల నడుమ బిజీబిజీగా సాగే సిటీ లైఫ్‌కు కాస్తంత కొత్తదనం..కొద్దిపాటి మన శ్శాంతి ఇచ్చేవి పర్యాటక ప్రదేశాలు. నగర, పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణ పరిస్థితులను చేరువ చేసేందుకు సర్కారు రూపొందించిన కార్యక్రమమే 'నగరవనం'. నగరవనం ప్రాజెక్టుతో కోట్ల రూపాయలు వెచ్చించి, సుందరీకరణ పనుల నిర్వహణకు అనువైన ప్రాంతంగా ప్రభుత్వం కొండవీడును ఎంచుకుంది. పచ్చని ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణం, ఎత్తయిన కొండలు, వాటి మధ్యలో విస్తారమైన పీఠభూమి, వాటన్నింటికీ మించి శతాబ్దాల చరిత్ర, పురాతన అవశేషాలు. ఇవన్నీ కొండవీడును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కలిసొచ్చే అంశాలు. చుట్టూ పల్లెలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యత ఇస్తుండటంతో కొండవీడుకు మంచి రోజులు వచ్చాయి.

పర్యాటకంపై ప్రత్యేక దృష్టి..

కొండవీడు నగరవనం – అభివృద్ధి పనులు కింద ప్రభుత్వం రూ.13.35 కోట్లు కేటాయించింది. అప్పటి అటవీశాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినితో కలిసి 2022 జనవరి ఎనిమిదో తేదీన కొండవీడుపై ఈ నిధులకు సంబంధించిన పనుల్ని ప్రారంభించారు. వీటితో చేపట్టిన పనులతో సందర్శకులకు పలు సౌకర్యాలు వనకూరగా, ఈ ఏడాది బడ్జెట్ రూ.1.58 కోట్లతో ఈ గిరిదుర్గానికి మరింత వన్నెతెచ్చే పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పచ్చదనం ఉండటంతో దీన్ని ఆధారంగా చేసుకుని అభివృద్ధి చేసేలా అటవీశాఖ ప్రణాళికలు చేస్తోంది. ముఖ్యంగా నగరవాసులకు స్వచ్ఛమైన వాయువును అందించేస్థాయికి తగినట్లు మొక్కలు పెంచుతున్నారు. ఇందులోనే వివిధ రకాల ఔషధ, పూలు, పండ్ల మొక్కల్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా సహజ సిద్ధ అందాలతో కనువిందు చేసే కొండవీడు మరిన్ని సొబగులను అద్దుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కొత్తకళను సంతరించుకుని త్వరలోనే పర్యాటకులను కనువిందు చేయనున్నది.


అందంగా..ఆకట్టుకునేలా...

అటవీ, ఆర్‌అండ్‌బీ, పురావస్తు, దేవదాయ, టూరిజం తదితర శాఖల ఆధ్వర్యంలో ఒక్కొక్కటిగా రూపుదిద్దుకుంటున్న పర్యాటక అభివృద్ధి పనులు సందర్శకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఘాట్‌రోడ్డు అందుబాటులో ఉండగా, రెండో ఘాట్‌రోడ్డు పనులు తుదిదశలో ఉన్నాయి. ఇవి రెండు అందుబాటులోకి రావడంతో కొండపై వరకు ప్రయాణం సులభంగా మారింది. ఇప్పటికే స్వాగత ద్వారం, పార్కింగ్, ఔషధ మొక్కలు, చిల్డ్రన్స్‌పార్కు, సోలార్ దీపాలు, పగోడాలు, వ్యూపాయింట్స్, రచ్చబండలు, పాత్‌వేలు, బెంచీలు, తాగునీటి వసతుల వంటివి కల్పించారు. పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం పునర్నిర్మించగా త్వరలోనే విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. చెరువు గట్టుల్ని బాగుచేసి వాకింగ్‌ట్రాక్, ఇరువైపులా మొక్కల పెంపకం చేస్తున్నారు. కొండపై చారిత్రక అంశాలను తెలిపే బోర్డుల్ని ఏర్పాటు చేశారు. కొండవీడు అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు మరింత సంతృప్తి చెందేలా అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకుల తాకిడి మరింతగా పెరిగింది. వీకెండ్స్‌తో పాటు ఫెస్టివల్స్ సమయంలో ఇక్కడ సరదాగా గడపడానికి వయోపరిమితి లేకుండా అంతా ఉత్సాహం చూపుతున్నారు. ప్రత్యేక వాహనాల్లో ఇక్కడకు వస్తున్నారు. ఇలా కొండవీడుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. తరచూ షార్ట్‌ఫిల్మ్స్, వెడ్డింగ్ షూట్ వంటి షూటింగ్‌లు సైతం ఎక్కువగానే చిత్రీకరిస్తున్నారు. దీంతో కొండవీడు ప్రాంతం నిత్యం సందడిగా ఉంటోంది.

సాహస క్రీడలకు స్వాగతం...

కొండవీడు త్వరలోనే పలు సాహస క్రీడలకు నెలవు కానుంది. ఔట్రాయిల్ అడ్వెంచర్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఆర్చరీ, ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, రాప్లింగ్, జిప్‌లైన్(ఒక శిఖరంపై నుంచి మరో శిఖరంపైకి వెళ్లడం), వెదుళ్ల చెరువులో బోటింగ్ ఏర్పాటుకు అటవీశాఖ సన్నాహాలు చేస్తోంది. వీటికి సంబంధించి ఈ ఏడాది సెప్టెంబర్ 27 (ప్రపంచ పర్యాటక దినోత్సవం నాడు)న డీఎఫ్‌ఓ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ వేయడం జరిగింది.

> **గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం ..**
>
> కొండవీడు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. చారిత్రక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండవీడు నగరవనం కింద రూ.13.35 కోట్లు కేటాయించింది. వీటితో ప్రస్తుతం పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తుండగా, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులను ఇక్కడ అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ చేస్తున్నాం. కొన్ని ప్రతిపాదనలు సైతం పంపించాం. కొండవీడును ఒకవైపు సుందరంగా, మరోవైపు పర్యాటకంగా రూపొందించేందుకు అన్నిశాఖలతో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
>
> – విడదల రజిని, రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి



కొండపై ట్రెక్కింగ్ చేస్తున్న దృశ్యం



కొండవీడు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవంలో మంత్రి విడదల రజని, మాజీ మంత్రి బాలినేని (ఫైల్)





వాక్ చేస్తున్న సీనియర్ గర్ల్స్

ఆకట్టుకున్న సీనియర్ గర్ల్స్ వాక్

నిత్యం ఇంటి పనులతో బిజీగా ఉండే మహిళలకు ఆటవిడుపుగా శనివారం గ్లోరీ ఆఫ్ ది గ్రే పేరుతో సీనియర్ గర్ల్స్ వాక్ నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి, జలియన్ హార్ట్స్ బీటింగ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని ఓ హోటల్లో నిర్వహించిన ఈ వాక్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వాక్ చేసి అలరించారు. ఈ కార్యక్రమాన్ని వాసవ్య మహిళామండలి అధ్యక్షురాలు కీర్తి, జలియన్ హార్ట్స్ బీటింగ్ హెడ్ సుధా జిజారియాలు పర్యవేక్షించారు.

– లబ్బీపేట (విజయవాడతూర్పు)

విలువలు లేని విద్య అనర్థదాయకం

- గ్రంథాలయాలతో అపూర్వ విజ్ఞానం
- ఏపీ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విలువలు లేని విద్య సమాజానికి అనర్థదాయకమని ఏపీ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు అన్నారు. విద్యార్థుల్లో మానవ విలువలను పెంపొందించే దిశగా విద్యాలయాలు కృషి చేయాలని ఆయన కోరారు. విజయవాడలోని కేబీఎన్ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 55వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవం ఆ కళాశాల గ్రంథాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన విజయబాబు మాట్లాడుతూ వివిధ కోర్సులకు తల్లిదండ్రులు లక్షలాది రూపాయలు వెచ్చించి తమ పిల్లలను చదివిస్తున్నారన్నారు. దాంతో ఆ పిల్లలు ఆర్థికాంశాలనే ప్రధానంగా తీసుకొని ముందుకు సాగటం వలన విలువలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఎక్కడైతే విలువలను బోధిస్తారో అక్కడ తమ పిల్లలకు విద్యాబుద్ధులను నేర్పించాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. ఆ గ్రంథాలయాలు జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందించే అద్భుత సాధనాలన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ ఉన్నతిని సాకారం చేసుకోవాలని కోరారు. మరో అతిథి న్యాయవాది నరహరిశెట్టి శ్రీహరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త పి.శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, గ్రంథాలయ విభాగాధిపతి శ్రీనివాసురాజు తదితరులు పాల్గొన్నారు.

తేజోమయం.. కార్తిక దీపోత్సవం

కార్తిక దీపారాధనతో అజ్ఞానాంధకారాన్ని తరిమికొట్టమని శత సహస్ర విపాసన సేవా మండలి పిలుపునిచ్చింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురంలోని శిశు విద్యా మందిర్ ప్రాంగణంలో సేవా మండలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన దీపోత్సవం భక్తి భావం నింపింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





కవులు, రచయితలు మేధో వికాసానికి కృషి చేయాలి



జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న కళాకారులు



మేయర్ రాయన భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

- విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- జాతీయ సాంస్కృతిక మహోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: కవులు, రచయితలు మేధో వికాసానికి కృషి చేయాలని, తమ రచనల ద్వారా సామాజిక చైతన్యానికి కృషి చేయాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి సూచించారు. మల్లెతీగ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే జాతీయ సాంస్కృతిక మహోత్సవాలు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. నేటి యువత ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్‌లతో విలువైన కాలాన్ని వృథా చేస్తోందని, ఇది మంచి పరిణామం కాదని అన్నారు. తల్లిదండ్రులే తమ పిల్లలను సరైన దారిలో పెట్టాలని సూచించారు. సాహిత్య పఠనం సన్మార్గంలో నడిపిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాకారులు, రచయితల సేవలు దేశానికి అవసరమన్నారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ.. గ్రంథాలయాల ద్వారా రచయితల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు పాలనలో నిర్వీర్యమైన గ్రంథాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి ఆదేశాలతో అభివృద్ధి బాటపట్టించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రవాసాంధ్ర తెలుగు సొసైటీ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విదేశాల్లో ఉన్న తెలుగు వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘ నాయకుడు జి.ఆంజనేయులు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చలపతిరావు, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.ఆర్.గాంధీనాగరాజ్ పాల్గొన్నారు. కలిమి శ్రీ, నిర్వహణ కమిటీ సభ్యులు చొప్పా రాఘవేంద్ర ప్రసాద్, ఇస్కా రాజేష్, యేమినేని వెంకటరమణ, వల్లూరి ప్రసాద్‌కుమార్ సమావేశాలను నిర్వహించారు.

వన భోజనాలకు వచ్చి ఇద్దరు చిన్నారులు మృతి

- లోతు ఎక్కువగా ఉన్న మునేటిలో మునక
- ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో ఘటన



మునేటిలో పడి మరణించిన చిన్నారులు

వత్సవాయి: కార్తిక వన భోజనాల కోసం వచ్చి ఇద్దరు చిన్నారులు ఏట్లో పడి మృతి చెందారు. ఈ ఘటన శనివారం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం మధిర మండలం మడుపల్లి గ్రామానికి చెందిన శీలం వెంకట నరసింహారెడ్డి (13), నీలం జస్వంత్ (10) గ్రామంలోని ఒక ప్రయివేటు పాఠశాలలో ఐదు, నాలుగు తరగతులు చదువుతున్నారు. వన భోజనాలు కోసమని పాఠశాలలోని విద్యార్థులు 85 మంది ఉపాధ్యాయులు కలిసి నాలుగు ఆటోలలో పెనుగంచిప్రోలు వచ్చారు. తోటి విద్యార్థులతో కలిసి సరదాగా ఆడిపాడిన ఆ ఇద్దరు విద్యార్థులు పక్కనే ఉన్న మునేటిలోకి స్నానం కోసమని దిగారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో మరో ముగ్గురు విద్యార్థులు వారి కోసం మునేటి ఒడ్డుకు వెళ్లి చూడగా వారి జాడ లేదు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆలస్యంగా తేరుకుని, ఏటి వద్దకు వెళ్లి స్థానికులతో కలిసి వెతికారు. లోతు ఎక్కువగా ఉన్న చోట స్నానం కోసం దిగడంతో నీట మునిగి చనిపోయారు. స్థానికులు మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. నందిగామ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, తహశీల్దార్ కల్యాణి, జగ్గయ్యపేట సీఐ ఆడపా నాగమురళి సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి చిన్నారులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

గుంటూరులో కిడ్నీ వైద్యుల రాష్ట్ర సదస్సు



గుంటూరు మెడికల్: ప్రజల్లో కిడ్నీ వ్యాధులపై పూర్తిగా అవగాహన లేదని, వ్యాధిపై అవగాహన కల్పించి ప్రజలు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు కిడ్నీ ఎడ్యుకేషన్ చానల్‌ను ప్రారంభించాలని సీనియర్ నెఫ్రాలజిస్టు, ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ఐదో వార్షిక సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చింతా రామకృష్ణ అన్నారు. శనివారం గుంటూరు వెల్‌కమ్ హోటల్‌లో కిడ్నీ వ్యాధుల్లో వస్తున్న ఆధునిక చికిత్స విధానాలపై వైద్యులకు అవగాహన సదస్సు గుంటూరు నెఫ్రాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. సదస్సులో నెఫ్రాలజీ ప్రాక్టీస్, చికిత్స అందించడంలో ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కిలారి సునిల్‌కుమార్, డాక్టర్ సోమయాజులు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సాయికృష్ణ మాట్లాడారు. డాక్టర్ చింతా రామకృష్ణ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి గురించి తెలిసిన వంద మందిలో 70 మంది వెంటనే చికిత్సకు రాకుండా ఆలస్యంగా రావడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించడం ద్వారా డయాలసిస్ బారిన పడకుండా కాపాడవచ్చు అన్నారు. డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ 60 ఏళ్లలో నెఫ్రాలజీ వైద్య విభాగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. 1970లో ఇండియాలో డయాలసిస్ ప్రక్రియ లేదని, మొట్టమొదటిసారిగా రాయవెల్లూరు సీఎంసీలో జయప్రకాష్‌నారాయణకు డయాలసిస్ చేశారన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా ఆసుపత్రుల్లోనే కాకుండా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో సైతం ఉచిత డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి రోగులకు ఎంతో మేలు చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ వి.శివకుమార్ మాట్లాడానే. సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ జి.శివరామకృష్ణ, జాయింట్‌సెక్రటరీ డాక్టర్ సి.వరలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ శివారు కృష్ణానదిలో ఇసుక దిబ్బమీద గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని పోలీసులు శనివారం కనుగొన్నారు. గుర్తు తెలియని ఈ వ్యక్తి రెండు, మూడు రోజుల క్రితం నీటిలో మునిగి చనిపోయి ఉంటారని భావిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వయస్సు 40–45 సంవత్సరాల లోపు ఉంటుందని, కుడి చేయి, ఎడమ చేతిపై పచ్చ బొట్లు ఉన్నాయని తెలిపారు. జుట్టు రాలిపోయి వంటిపైన నలుపు రంగు టీషర్టు, ఆకు పచ్చరంగు డ్రాయర్ ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఇతని వివరాలు తెలిస్తే, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

లంగ్ క్యాన్సర్.. పారాహుషార్

ఒకవైపు కాలుష్యం.. మరోవైపు ధూమపానం వెరసి అనేకులు నేడు ప్రమాదకరమైన లంగ్ క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు ఈ ఊపిరితిత్తుల రాచపుండు బారిన పడ్డారని తెలియజేస్తున్న వైద్య గణాంకాలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి.. నవంబర్ లంగ్‌క్యాన్సర్ అవగాహన నెలగా వైద్యులు ప్రకటించి, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు..



- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సులువు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- ఊపిరితిత్తుల క్యాన్సర్ అవగాహన నెలగా నవంబర్

గుంటూరు మెడికల్: పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో నేడు ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రతిముగ్గురిలో ఒకరు లంగ్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2.02 మిలియన్ల మంది, మన దేశంలో 70వేల మంది ప్రతిఏడాది వ్యాధి బారిన పడుతున్నారు.

కారణాలు...

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. లంగ్ క్యాన్సర్ మరణాల్లో 80శాతం సంభవించటానికి కారణం పొగతాగటమే. సిగరెట్లు కాల్చటం, హుక్కా, గంజాయి పీల్చటం లంగ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. కాలుష్య పొగల కారణంగా, వాహనాల కాలుష్యం, రేడియేషన్, వాతావరణ కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

వీరికి ముప్పు ఎక్కువ..

పొగతాగేవారికంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ అధికంగా సోకుతోంది. ట్రాఫిక్ పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారురోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనేవారికి వ్యాధి సోకుతోంది. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65శాతం మంది మహిళలు, 35శాతం మంది పురుషులు ఉన్నారు.

బాధితులు...

గుంటూరు జిల్లాలో 20 మంది పల్మనాలజిస్టులు, 30 మంది క్యాన్సర్ వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇరువురు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.

వ్యాధి లక్షణాలు...

విడవకుండా దగ్గు రావటం, దగ్గులో రక్తం పడటం, ఆకలి లేకపోవటం, ఛాతిలో నొప్పి, గొంతు బొంగురు పోవటం, ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే బరువు తగ్గిపోవటం, ఎముకలు, కీళ్ళు, వెన్ను, నడుంనొప్పి ఎక్కువ కాలం ఉండటం, శ్వాస సరిగా ఆడకపోవటం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడటం, నిద్రలో గురకరావటం, తరచుగా జబ్బుల బారిన పడటం లాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అలస్యం చేయకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలి.

ఈ జాగ్రత్తలు పాటించండి....

ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.

> **అందుబాటులో ఆధునిక వైద్యం**
>
> 
>
> క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను లోడోస్ సిటీస్కాన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఒక సెంటీమీటర్‌కన్న తక్కువ సైజులో ఉన్న గడ్డలను సైతం నిర్ధారణచేయవచ్చు.
>
> – డాక్టర్ కందుల రామ్, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు.

> **వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి**
>
> 
>
> వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. పలువురు వ్యాధి నిర్ధారణ సకాలంలో చేయించుకోవడం లేదు. వ్యాధి నిర్ధారణ చేసే సమయానికి క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు గుర్తిస్తున్నాం. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్, క్రయో తొరకోస్కోపి వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.
>
> –డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు.

మూడు రోజుల శిశువుకు పోస్టుమార్టం

- డీఎన్ఏ పరీక్షకు ఎముకలోని శాంపిల్స్
- శిశువు మారినట్లు తండ్రి ఫిర్యాదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూడు రోజుల శిశువుకు పోస్టుమార్టం నిర్వహించిన అరుదైన ఘటన శనివారం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చోటుచేసుకుంది. అంతేకాదు శిశువు మారినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో మృత శిశువు ఎముక నుంచి సేకరించిన శాంపిల్స్‌ను డీఎన్ఏ పరీక్షకు పంపించినట్లు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విసన్నపేటకు చెందిన నిర్మల ఈ నెల 9న పాత ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించింది. నెలల నిండకుండా ప్రసవించిన శిశువును ఎస్ఎన్‌సీయూలో ఉంచి చికిత్స అందించారు. కాగా శిశువు ఈ నెల 12న మృతి చెందగా, తండ్రి రంజిత్‌కుమార్ మృతశిశువు మాకు జన్మించింది కాదని, సిబ్బంది మార్చేశారంటూ గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అదే రోజు శిశువును మార్చురీకి తరలించారు. కాగా పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టగా, లేబర్‌రూమ్, ఎస్ఎన్‌సీయూలో చేర్చే సమయంలో తీసుకునే ఫుట్‌ప్రింట్‌ను వెరిఫై చేశారు. రెండు ఒకేలా ఉండటంతో ఈ విషయాన్ని శిశువు తండ్రి రంజిత్‌కుమార్‌కు చెప్పారు. ఆయన ససేమిరా అంటూ డీఎన్ఏ పరీక్ష చేయాలని డిమాండ్ చేశాడు. లేబర్ వార్డులో చెప్పిన శిశువు బరువుకు, ఎస్ఎన్‌సీయూలో చెప్పిన బరువుకు వ్యత్యాసం ఉందంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేయగా, శిశువు మరణించిన వారం రోజుల తర్వాత శనివారం పోస్టుమార్టం నిర్వహించి శాంపిల్స్‌ను డీఎన్ఏ పరీక్షల కోసం పంపారు. కాగా ఆస్పత్రిలో వైద్యం చేయడంలో నిర్లక్ష్యం లేదని, శిశువునే కిందస్థాయి సిబ్బంది మార్చారనేది తన అనుమానం అని శనివారం ఆస్పత్రి అధికారులు రంజిత్‌కుమార్‌తో జరిపిన చర్చల్లో పేర్కొన్నారు. డీఎన్ఏ రిపోర్టు వచ్చిన తర్వాత నిజానిజాలు వెల్లడి కానున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు.

స్టెల్లా ఆడిటోరియంలో ఖాదీ బజార్

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని స్టెల్లా ఆడిటోరియంలో ఖాదీబజార్–2022ను శనివారం ఖాదీ అభివృద్ధి గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ ప్రారంభించారు. ఈ ప్రదర్శన 28వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుందని, 75 యూనిట్ల నుంచి ఔత్సాహిక గ్రామీణ పారిశ్రామికవేత్తలు రూపొందించిన ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంటాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కేవీఐసీ సీఈవో ఎం.ఎం.నాయక్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, కేవీఐసీ సౌత్ డిప్యూటీ సీఈవో ఆర్ఎస్ పాండే, పీఎంఈజీపీ డిప్యూటీ డైరెక్టర్ రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న లే అవుట్ల పరిశీలన

- మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి
- వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న లే అవుట్లలో రాజీ లేకుండా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వెలగలేరులోని జగనన్న లేఅవుట్లను శనివారం ఆయన సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల లే అవుట్‌లో విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి 24 గంటలు కరెంటు ఉండే విధంగా త్రీ ఫేజ్ విద్యుత్ సదుపాయాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంచినీటికి సంబంధించి పోలవరం కాల్వ నుంచి నీటిని తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

జక్కంపూడి టిడ్కో గృహాల పరిశీలన

జక్కంపూడి గృహ నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో లబ్ధిదారులకు నిర్మించిన 300 చదరపు అడుగుల్లో 1,152 ప్లాట్లు, 365 చదరపు అడుగుల్లో 1,632 ఫ్లాట్స్, 430 చదరపు అడుగుల్లో 3,792 ఫ్లాట్స్ కేటాయించామని అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఆయా కేటగిరిల్లో మొత్తం 1,680 ఫ్లాట్స్‌ను వీఎంసీ సిద్ధం చేసిందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మిగిలిన వాటిని కాంట్రాక్టర్లతో చర్చించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనలో అధికారులు చొరవ చూపాలని, గ్రీనరీ పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా ఆకర్షణీయమైన మొక్కలు నాటాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వీఎంసీ ఏర్పాటు చేసిన 200 మొక్కలను కమిషనర్ నాటారు.



జక్కంపూడిలో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్లుప్తంగా

దత్తపీఠంలో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న స్వామి

పటమట(విజయవాడతూర్పు): పటమట దత్త పీఠంలో కార్తికమాసోత్సవాల్లో భాగంగా శనివారం గంగాధరేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి తిథి సందర్భంగా సాయంత్రం దత్త విజయానంద తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రహోమం మహన్యాస పూర్వకంగా 11 మంది వేద పండితులతో పూర్ణహుతి గావించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్



పటమట(విజయవాడతూర్పు): ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యాక్రమంలో భాగంగా వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. 24వ డివిజన్‌లోని సూర్యారావుపేట, కర్నాటి రామ్మోహనరావు మునిసిపల్ హైస్కూల్ లో ఉన్న పోలింగ్ బూత్ నం 151–161 వరకు ఉన్న 11 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ప్రతి పోలింగ్ స్టేషన్ నంబర్ తప్పని సరిగా రాయాలని, ప్రతి బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల శాతాన్ని తప్పనిసరిగా లొకేషన్ మ్యాప్‌లో పొందుపరచాలని సూచించారు. 18 ఏళ్ల వయస్సు వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, కొత్త ఓటర్ల నమోదు సంబంధించి బ్యానర్‌ను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు ఓటర్లకు ఫారం 6, 7, 8 గురించి అవగాహన కల్పించాలన్నారు. 6బి ఫారంలను తప్పనిసరిగా ఓటర్ సంతకంతో తీసుకోవాలని ప్రతి ఫారాన్ని తప్పనిసరిగా భద్రపరచాలని కమిషనర్ ఆదేశించారు.

చంద్రబాబు పతనం ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): సుదీర్ఘకాలంగా రాజకీయాల్లోనూ, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఇవే తన చివరి ఎన్నికలంటూ ప్రచారం చేసుకోవడం అంటే ఆయన పతనం ప్రారంభమైనట్లేనని జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంత కాలం ప్రజలకు ఏమీ చేశారో చెప్పుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలా నేను ఇది చేశాను నాకు ఓటు వేయండనే దమ్ము చంద్రబాబుకు లేదన్నారు. చంద్రబాబు ప్రజల్లో సెంటిమెంట్ రాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రయత్నిస్తుంటే చంద్రబాబు అడ్డుతగులుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు లాంటి నేతల వలనే రాయలసీమ గత దశాబ్దాలుగా వెనుకబాటు తనానికి గురైందని, మూడు రాజధానులనేది ఎవరి మీద ఆగ్రహంతో తీసుకున్న నిర్ణయం కాదన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి, చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు పాడికట్టేది తథ్యమని జోస్యం చెప్పారు.

డిసెంబర్ 2 నుంచి స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో డిసెంబర్ 2వ తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం విద్యారంగ బాధ్యుడు ఎస్.పి.రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు 40 రోజులు పాటు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీ లోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98042 నంబర్లలో సంప్రదించాలని కోరారు. బొడ్డపాటి చంద్రశేఖర్ బోధిస్తారని చెప్పారు. ఇంగ్లిషు నేర్చుకోవడం ఎలా అనే అంశంపై సాక్షి పత్రికలో ఆయన రాసిన వివరణాత్మక వ్యాసాలు విశేష ఆదరణ పొందాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన, దీపార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిపారు. నటరాజ స్వామి వారి కళా వేదిక వద్ద సహస్ర లింగార్చన చేపట్టారు. సహస్ర లింగార్చన అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఆర్జిత సేవలో పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. అమ్మ వారి పంచహారతుల సేవ పల్లకీ సేవ, సహస్ర దీపార్చన జరిగింది.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు





ఆలయ అధికారులకు విరాళాలు అందచేస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి శనివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన ఎం.నరసింహారావు, సౌభాగ్యలక్ష్మీ దంపతులు కుటుంబ సమేతంగా అమ్మ వారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116ల విరాళాన్ని అందించారు. విజయవాడకు చెందిన కె.అనీష్‌సాయి, యశ్వంత్ పేరిట కుటుంబ సభ్యులు అన్నదానానికి రూ.1,01,116ల విరాళాన్ని అందించాశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మ వారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మ వారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

సమాజాభివృద్ధికి వాసవీ క్లబ్స్ కృషి

లబ్బీపేట(విజయవాడతూర్పు): అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి వాసవీ క్లబ్స్ ఎంతగానో కృషి చేస్తున్నాయని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ గడ్డం పవన్‌కుమార్ తెలిపారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వి 212 ఎ 4వ వార్షిక సమావేశం శనివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గడ్డం పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని వార్షిక సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి సమావేశంలో చర్చించారు. సమావేశంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ యాద నాగేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు చెన్నగిరి శ్రీనివాసరావు, తూనుగుంట్ల శ్రీధర్, దుడ్డు నాగేశ్వరరావు, అడ్డగళ్ల శ్రీనివాసరావు, బొడ్డు శ్రీనివాసరావు, నందిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వార్షిక సమావేశం పోస్టర్ ఆవిష్కరిస్తున్న పవన్‌కుమార్, ప్రతినిధులు

హుండీ కానుకల ద్వారా రూ.12.11 లక్షల ఆదాయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో అమ్మ వారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు శనివారం లెక్కించారు. ఆగష్టు 1 నుంచి నవంబర్ 19వ తేదీ వరకు 3 నెలల 19 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకాలు లెక్కించగా రూ.12,11,745లు ఆదాయం లభించింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.ఫణికుమార్ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదన రావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీల్లో కానుకలు లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ సభ్యులు కె.జగదీష్‌కుమార్, బి.హెచ్.విజయకిరణ్, ఎం.వి.రాజా, జి.సత్యనారాయణ, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న అర్చకులు

నలందలో కిండర్ గార్టెన్ కార్నీవాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): చిన్నారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో శనివారం కిండర్ గార్టెన్ కార్నీవాల్ ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగింది. ఈ సందర్భంగా కేజీ చిన్నారులకు, తల్లిదండ్రులకు టిక్ పిక్, రింగ్‌టోస్, వాటర్‌గేమ్స్, వీల్‌స్పిన్, ఐస్‌క్రీం హంట్, హార్ట్‌బీట్, పీడ్ ది పార్క్ వంటి ఆటలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎ.విజయబాబు సైతం చిన్నారులతో కలిసి పలు పోటీల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ చిన్నవయస్సు నుంచే పిల్లల్లో నిర్భయత్వం, చురుకుదనం ఉండాలంటే వారిని ఇలాంటి పోటీల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హర్‌సిమ్రాన్‌కౌర్ పాల్గొని తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

మాదక ద్రవ్యాలతో అప్రమత్తంగా ఉండాలి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): మాదక ద్రవ్యాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత అధికంగా ప్రభావితమై జీవితాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారని నవజీవన్ బాల భవన్ జోనల్ కో–ఆర్డినేటర్ జె. ఆంజనేయులు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా శనివారం పటమటలోని గోవింద రాజులు ఈనాం ట్రస్ట్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు – దుష్పరిణామాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం 'బాలల హక్కుల దినోత్సవం' సందర్భంగా పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో ప్రశంసాపత్రం, బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ కో ఆర్డినేటర్ జె వాణి, హెచ్‌ఎం శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైల మల్లన్న కల్యాణోత్సవం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహేష్, కార్పొరేటర్లు అప్పాజీరావు, రాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీశైల ఆలయ వేద పండితుల పర్యవేక్షణలో శివకల్యాణోత్సవం ఆదివారం పాతబస్తీ కోమలవిలాస్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు శ్రీశైల ఆలయ పాలకవర్గ సభ్యుడు గురు మహంతు మహేష్, కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, రాజేష్ చెప్పారు. ఈ సందర్భంగా అప్పాజీరావు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కల్యాణోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ ఉదయం శ్రీశైలం దేవస్థానం ప్రచార రథం నగరానికి వస్తుందన్నారు. కనకదుర్గానగర్, విజయేశ్వరస్వామి ఆలయం నుంచి పాతబస్తీలో ఊరేగింపు జరుగుతుందన్నారు. కోమలవిలాస్ సెంటర్‌లో సాయంత్రం ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని శ్రీశైలం ఆలయ పండితులు నిర్వహిస్తారన్నారు. నవలక్ష దీపార్చన కల్యాణం అనంతరం స్వామి వారి ప్రసాద వితరణ చేస్తామన్నారు. కార్యక్రమానికి మంత్రులు కొట్టు సత్యనారాయణ, జోగి రమేష్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు రఘురామ్, రుహుల్లా, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తదితరులు అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు పడాల రాజేష్, పణకు ఫణి, బెవర ఉమా, పి.రామకృష్ణ, జే బాలు, పిల్లా ఆనంద్, మానికొండ శ్రీను పాల్గొన్నారు.

● నగరంలో వెడ్డింగ్ ఎగ్జిబిషన్ సందడి



నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో వెడ్డింగ్ పాప్‌అప్ షాప్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. చంద్రిక కంచర్ల స్టాల్‌లో మహిళలు చీరలు కొనుగోలు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తప్పులను సరిదిద్దుకుని సత్ప్రవర్తనతో మెలగాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గతంలో చేసిన తప్పులను తెలుసుకుని, మళ్లీ తప్పులు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సైకాలజిస్ట్ డాక్టర్ దుర్గాప్రసాద్ చెప్పారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం(జువెనైల్ హోమ్)లో శనివారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. బాలల సంక్షేమ శాఖ విశ్రాంత ఉద్యోగి, కార్టూనిస్ట్ బ్రహ్మం(బొమ్మన్) బాలురకు బొమ్మలు వేయడంలో మెలకువలు నేర్పించారు. ఆ తరువాత వారికి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురకు కౌన్సెలింగ్ చేసిన దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడి ఇక్కడికి వచ్చిన బాలలు, బయటకు వెళ్లిన తరువాత చెడు స్నేహాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడుచుకుంటూ మంచి పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పుట్టుకతోనే ఎవరూ నేరస్తులు కాదని, పరిస్థితుల ప్రభావం, చుట్టూ ఉన్న వాతావరణం, దుర్వ్యసనాల కారణంగా నేరస్తులుగా ముద్రవేయబడుతున్నారని చెప్పారు. అనంతరం రోటరీనగర్‌లోని ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బందితో బాలురకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో పరిశీలనా గృహం పర్యవేక్షణాధికారి పి.రామమోహన్‌రెడ్డి, ప్రొహిబిషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

తిట్లు, దూషణలు, పచ్చిబూతుల పార్టీ.. టీడీపీ

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



లబ్బీపేట(విజయవాడతూర్పు): తిట్లు దూషణలు పచ్చిబూతుల పార్టీగా టీడీపీని చంద్రబాబు మార్చేసారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఎద్దేవా చేశారు. కర్నూలులో చంద్రబాబు గో బ్యాక్ అన్నందుకు కోపం వస్తే, ఆయన వలన అన్యాయానికి గురైన, గురవుతున్న ఆ ప్రాంత ప్రజలకు ఇంకెంత కోపం రావాలని ఆయన పశ్నించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కర్నూలులో చంద్రబాబు ఆవేశంతో మాట్లాడలేదని, అక్కసుతో మాట్లాడి పోలీసులను, అధికారులను బెదిరించారన్నారు. చివరికి ప్రజలను కూడా బెదిరించారని, తనతో పెట్టుకుంటే ఫినిష్ అవుతారని వైఎస్సార్ మరణానికి ముందురోజు బెదిరించిన ఆయన ఇప్పుడు కూడా అదే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని తిడతాడు. పట్టాభి నుంచి పవన్ కళ్యాణ్ వరకూ అందరికీ ఏమి తిట్టాలో చంద్రబాబు చెబుతారని తెలిపారు. నిరాశ, చేతగాని తనం నుంచి ఇవన్నీ వస్తున్నాయని ప్రజలు గమనిస్తుంటే అక్కసు అసూయ పెరిగిపోతుందన్నారు. ఆ ఫలితంగానే లేని ధైర్యాన్ని చూపాలని, సాహసవంతుడినని చెప్పాలని మేకపోతు గాంభీర్యంతో గట్టిగా ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. తరిమి తరిమి కొడతా, బట్టలిప్పి కొట్టిస్తా, చిత్తు చిత్తు అవుతారు రౌడీలకు రౌడీని గూండాలకు గూండాని అని అక్కసుతో ఏవేవో మాట్లాడతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు వైఖరిని ప్రజలందరూ గమనిస్తున్నారని, అన్ని ప్రాంతాలకు న్యాయం జరగకుండా రాష్ట్ర అభివృద్ధి చెందిందంటే ఎవరూ అంగీకరించరనే విషయాన్ని గుర్తించాలన్నారు. మూడు రాజధానుల ద్వారానే అందరికీ న్యాయం జరుగుతుందని, అదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టాండ్ అని దేవినేని అవినాష్ పేర్కొన్నారు. అమరావతికి అన్యాయం చేసే ఉద్దేశం లేదని ఆయన తెలిపారు. 2024 చివరి ఎన్నికలు అని చెబుతున్న చంద్రబాబుకు ఆల్రెడీ 2019 ఎన్నికలే చివరి ఎన్నికలని గుర్తించాలని అవినాష్ హితవు పలికారు.

రిటైనింగ్‌వాల్ వెంబడి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వర నగర్ ప్రాంతంలోని రిటైనింగ్ వాల్ వెంబడి 20 ఎం.ఎల్.డి సివెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద రోడ్డు అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం నగర పర్యటనలో భాగంగా వీరిరువురూ కృష్ణలంక, రాణిగారి తోట, రామలింగేశ్వర నగర్ ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలిస్తూ స్థానిక ప్రజల ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. రిటైనింగ్‌వాల్ సమీపంలో ఉన్న ఇళ్లను సర్వే చేయాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో డెప్యూటీ సిటి ప్లానర్(ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.చంద్రశేఖర్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

చంద్రబాబు హయాంలో రాష్ట్రం అంధకారం

గుణదల(విజయవాడతూర్పు): టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో మన రాష్ట్రం పరిస్థితి అంధకారంగా మారిందని వైఎస్సార్ సీపీ నగర ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబు ప్రతి పర్యటనలో ప్రభుత్వాన్ని విమర్శించడం పరిపాటిగా మారిందన్నారు. బాబు వ్యాఖ్యలను ఖండించారు. టీడీపీ హయాంలో భూ కుంభకోణాలు, అత్యాచారాలు, దొమ్మీలు పెచ్చురిల్లాయని చెప్పారు. ఇంత ఘన చరిత్ర కలిగిన చంద్రబాబు సీఎం జగన్‌ను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. చిల్లర రాజకీయాలు చేయడంలో అపార అనుభవం ఉన్న చంద్రబాబు ప్రస్తుతం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సైతం పావులా వాడుకుంటున్నారని తెలిపారు. మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, వియ్యపు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు అంబేడ్కర్, అమర్‌నాథ్

పేద విద్యార్థులకు సాయం చేయడమే లక్ష్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేద విద్యార్థుల ఉన్నత విద్యావసరాల కోసం రౌండ్ టేబుల్ ఇండియా కృషి చేస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు జి.శ్రీహర్ష తెలిపారు. లబ్బీపేటలోని రౌండ్ టేబుల్ ఇండియా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీ హర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు రౌండ్ టేబుల్ ఇండియా సాయం చేస్తుందన్నారు. తమ సంస్థ 136 నగరాల్లో పని చేస్తుందని, ఇప్పటి వరకూ 7,940 తరగతి గదులు నిర్మించినట్లు తెలిపారు. విద్య, వైద్యం ఆరోగ్యం రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని రామలింగేశ్వరనగర్‌లో పాఠశాల నిర్మించినట్లు తెలిపారు. ఆ సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రశాంతి మాట్లాడుతూ ఈ నెల 22న డాన్స్ తంబోలా పేరుతో కార్యక్రమం నిర్వహించి, వచ్చే ఆదాయంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆ సంస్థ ప్రతినిధి కాట్రగడ్డ మోహన్ మాట్లాడుతూ.. సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ ఛాప్టర్ 68 చైర్మన్ డాక్టర్ గుత్తికొండ హర్ష, చైర్‌పర్సన్ డాక్టర్ ప్రశాంతి, కౌశిక్, ప్రఫుల్, వినయ్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీహర్ష తదితరులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మాతృభాషలోని ప్రముఖ పుస్తకాలను యువత చదవడం అలవాటు చేసుకోవాలని ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్‌లో జరిగింది. గోళ్ళ నారాయణరావు అతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్దర్శనం అనే పుస్తకాన్ని కవి గుమ్మా సాంబశివరావు సమీక్షించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, నగర ప్రజలు, పదవీ విరమణ చేసిన అధ్యాపకుల నుంచి సేకరించిన 400లకు పైగా పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. గ్రంథాలయ అధికారి వాణీశ్రీ మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందచేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

పటమట(విజయవాడతూర్పు): పటమటలంక శాఖా గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా మహిళలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటమట బాలికల, బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పద్మ, జ్యోతిరాణి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యార్థినులు తప్పనిసరిగా చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను అందిచారు. గ్రంథాలయ అధికారి కళ్లేపల్లి మధుసూదనరాజు, బి.అనూరాధ, కృష్ణవేణి పాల్గొన్నారు.



విజేతలతో అతిథులు, అధ్యాపకులు

రేపటి నుంచి ఈ-క్రాప్ రసీదులు

- ఈ-క్రాప్ ప్రామాణికంగానే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు
- కొనుగోలుకు ఇబ్బంది లేకుండా సివిల్ సప్లైస్‌కు ఈ-క్రాప్ డేటా

సాక్షి, అమరావతి: ధాన్యం సహా పంట ఉత్పత్తుల కొనుగోలు విషయంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈకేవైసీ పూర్తి చేసిన ప్రతి రైతుకు డిజిటల్ ఎక్నాలెడ్జ్‌మెంట్‌తోపాటు రసీదులను సోమవారం నుంచి ఇవ్వనున్నారు. మరోవైపు నూరు శాతం పూర్తయిన ఈ-క్రాప్ జాబితాను సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు వ్యవసాయ శాఖ బదలాయించింది. ఖరీఫ్-2022 సీజన్‌లో 1 కోటి 11 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా.. ఆ మేరకు 100 శాతం ఈ పంట నమోదు చేశారు. గతంలో ప్రతి సీజన్‌లో 85-90 శాతం రైతుల ఈకేవైసీ మాత్రమే నమోదవడంతో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తేవి. దీంతో ఈ ఏడాది నూటికి నూరు శాతం రైతుల ఈకేవైసీ పూర్తి చేసి తీరాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా.. రైతుల ఈకేవైసీ నమోదును యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. వీఏఏ, వీఆర్‌వోల వేలి ముద్రలను నూటికి నూరు శాతం పూర్తి చేయగా.. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రైతుల ఈకేవైసీని 99.99 శాతం పూర్తి చేశారు. వరి పంట కొనుగోలు నిమిత్తం 26 జిల్లాల తుది జాబితాలను సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు పంపించారు.

రేపటి నుంచి డిజిటల్ రసీదులు

ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి కావడంతో డిజిటల్, ఫిజికల్ రసీదులను సోమవారం నుంచి ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. రైతుల మొబైల్ నంబర్లకు డిజిటల్ రసీదులను ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపించనున్నారు. ఈకేవైసీ నమోదు చేసిన ప్రతి రైతుకు భౌతిక రసీదులను కూడా ఆర్బీకేల్లో ఈ నెల 30లోగా అందించనున్నారు. రైతులందరికీ ఈ-క్రాప్ రసీదు చేరిందీ లేనిదీ పర్యవేక్షించాల్సిన బాధ్యతను ఆర్బీకే ఇన్‌చార్జ్‌లకు అప్పగించారు. భౌతిక రసీదు ఇవ్వడంతో పాటు ఓ కాపీని రికార్డు ప్రయోజనం కోసం ఆర్బీకేల్లో భద్రపర్చాలని ఆదేశాలు జారీ చేశారు.

భౌతిక రసీదులు తీసుకోండి

ఆర్బీకే సిబ్బంది ద్వారా భౌతిక రసీదు తీసుకోండి. ఈ రసీదులు ఉన్నవారే పంట కొనుగోలు, పంటల బీమా, వడ్డీ రాయితీ తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులు. ఈ విషయాన్ని గుర్తించుకుని ప్రతి ఒక్కరూ విధిగా ఈ-క్రాప్ నమోదు రసీదు పొందాలి.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

మహిళలు, పిల్లలకు ఆరోగ్య భద్రత

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- వారిలో రక్తహీనత, పౌష్టికాహారలోపాల నివారణకు కార్యాచరణ
- వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వేతో ఇలాంటి వారి గుర్తింపు
- మందులు, పౌష్టికాహారం అందించి, ఆరోగ్యంగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- వీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- 8 సుస్థిర ప్రగతి సూచికల లక్ష్యాల సాధనే కర్తవ్యం
- స్కూళ్లలో డ్రాపవుట్స్, కనీస వసతుల పైనా సమాచారం సేకరణ
- 1,59,29,858 కుటుంబాల ఇళ్లకు వెళ్లి సర్వే
- ఇప్పటికే 40 లక్షల కుటుంబాల్లో సర్వే పూర్తి
- త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మహిళలు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను నివారించి, ఆరోగ్యంగా ఉంచాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. తొలి దశలో 8 అంశాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్ర బిందువుగా సుస్థిర ప్రగతి లక్ష్యాల సూచికలను సాధించడం ద్వారా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచేందుకు ఈ నెల 16 నుంచి ఇంటింటి సర్వే చేపట్టింది.

వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే చేసి, రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్న మహిళలు, పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన మందులు, పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టింది. వారికి మందులు, ఆహారం సరఫరాను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షిస్తారు. ఇప్పటికే 40 లక్షల ఇళ్లలో సర్వే పూర్తయింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఈ సర్వే కోసం వలంటీర్లకు ప్రాధాన్యత గల 8 సుస్థిర ప్రగతి లక్ష్యాల సూచికలతో ఓ అప్లికేషన్ కూడా రూపొందించింది. 2,65,979 క్లస్టర్ల వారీగా 1,59,29,858 కుటుంబాలను వీరు కలుసుకుంటున్నారు. రక్తహీనత, బరువు తక్కువ, పౌష్టికాహార లోపాలతోపాటు పిల్లల్లో స్కూల్ డ్రాపవుట్స్ పాఠశాలల్లో మహిళా టాయిలెట్ల నిర్వహణ, విద్యుత్, తాగునీటి సదుపాయాలపై సర్వే చేస్తున్నారు. ఆ వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. వాటిని పరిశీలించిన అధికారులు తదనుగుణంగా చర్యలు చేపడతారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, 11, 12 తరగతుల్లో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ రేషియోతోపాటు డ్రాపవుట్స్ లేకుండా ఆ ఈడు పిల్లలందరూ విద్యా సంస్థల్లో ఉండేలా సర్వే ద్వారా చర్యలు చేపడుతున్నారు. పిల్లలు ఎవ్వరైనా స్కూల్‌కు రాకపోతే ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి, మళ్లీ బడిలో చేర్పించేందుకు వలంటీర్లు చర్యలు తీసుకుంటారు. స్కూళ్లలో కనీస మౌలిక వసతుల వివరాలు సేకరించి, లోపాలుంటే వెంటనే సరిచేస్తారు. కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటింటి సర్వే పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ సమీర్ శర్మ సమీక్షించారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

8 సుస్థిర ప్రగతి సూచికల లక్ష్యాల సాధనకు సర్వే అంశాలు ఇవే

- కౌమారదశలో ఉన్న 10 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు మహిళల్లో రక్తహీనత కలిగిన వారు ఎంత శాతం ఉన్నారు?
- 15 ఏళ్ల నుంచి 49 ఏళ్ల గర్భిణుల్లో రక్తహీనత కలిగిన వారు ఎంత శాతం ఉన్నారు?
- ఎదుగుదల లేక కుచించుకపోయిన ఐదేళ్లలోపు పిల్లలు ఎంత మంది ఉన్నారు?
- తక్కువ బరువుగల ఐదేళ్లలోపు పిల్లలు ఎంత మంది ఉన్నారు?
- ఎలిమెంటరీ స్కూల్స్‌లో 1 నుంచి 10వ తరగతి వరకు ఎన్‌రోల్‌మెంట్ రేషియో
- ఉన్నత విద్యలో 11, 12 తరగతుల్లో స్థూల నమోదు నిష్పత్తి
- స్కూళ్లలో విద్యుత్, తాగునీరు అందుబాటు ఎంత శాతం ఉన్నాయి?
- స్కూళ్లలో ప్రధానంగా బాలికల టాయిలెట్ల నిర్వహణ, స్థితి ఎలా ఉంది?

ఈ నెల 25లోగా సర్వే పూర్తి

మహిళలు, పిల్లల ఆరోగ్యం.. ప్రధానంగా రక్తహీనత, పౌష్టికాహార లోపాలను గుర్తించేందుకు రాష్ట్రం అంతటా తొలిసారిగా పెద్ద ఎత్తున ఇంటింటి సర్వే చేపట్టాం. ఈ నెల 25కి సర్వే పూర్తవుతుంది. సర్వే కోసం ప్రత్యేకంగా నమూనా ఫారమ్‌ను రూపొందించాం. సర్వేలో వివరాల ఆధారంగా రక్త హీనత, పౌష్టికాహార లోపాలు గల, ఇతర ఆరోగ్య సమస్యలున్న వారిపై దృష్టి సారించి, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటాం. తద్వారా 8 అంశాల్లో సుస్థిర ప్రగతి సూచికల లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించడమే ధ్యేయం.

– గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

ఆ వాహనాలు రోడ్డెక్కితే అంతే

- కాలం చెల్లిన వాహనాల కోసం స్క్రాపింగ్ యూనిట్లు

సాక్షి, అమరావతి: కాలం చెల్లిన వాహనాలు ఇకపై రోడ్డెక్కితే చర్యలు తప్పవు. అలాంటి వాహనాలను వెహికల్ స్క్రాపింగ్ యూనిట్లకు తరలించాల్సిందే. ఇందుకోసం జిల్లా స్థాయిలో 'వెహికల్ స్క్రాపింగ్ యూనిట్లు' నెలకొల్పాలని రవాణా శాఖ నిర్ణయించింది. కాలుష్య నియంత్రణలో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా శాఖ వాహన తుక్కు విధానాన్ని ఇటీవల అమలులోకి తీసుకువచ్చింది. 15 ఏళ్ల జీవిత కాలం దాటిన వాణిజ్య వాహనాలు, 20 ఏళ్ల జీవిత కాలం దాటిన వ్యక్తిగత వాహనాలను తుక్కుగా మార్చాల్సిందేనంది. ఈ విధానాన్ని 2023 మే నుంచి అమలు చేసేందుకు 'వెహికల్ స్క్రాపింగ్ యూనిట్ల'ను జిల్లాల వారీగా ఏర్పాటు చేయనుంది.

కనీసం 2 లక్షల వాహనాలు తుక్కు

ఏపీలో దాదాపు 1.50 కోట్ల వాహనాలున్నాయి. వాటిలో 1.20 కోట్లు వ్యక్తిగత వాహనాలు కాగా.. 30 లక్షల వరకు వాణిజ్య వాహనాలు ఉన్నాయి. 15 ఏళ్ల జీవిత కాలం దాటిన వాణిజ్య వాహనాలు, 20 ఏళ్ల జీవిత కాలం దాటిన వ్యక్తిగత వాహనాలు కలిపి రాష్ట్రంలో దాదాపు 2 లక్షల వాహనాలు ఉంటాయని అంచనా. వాటన్నిటినీ తుక్కుగా మార్చాల్సి ఉందని గుర్తించారు. తరువాత ఏటా జీవిత కాలం ముగిసే వాహనాలను తుక్కు కింద మారుస్తారు. ఇందుకోసం రాష్ట్రంలో జిల్లాకు రెండు చొప్పున వెహికల్ స్క్రాపింగ్ యూనిట్లు నెలకొల్పాలని ప్రాథమికంగా నిర్ణయించారు. 2023లో ఒకటి.. 2025లో మరొకటి చొప్పున వీటిని నెలకొల్పాలని నిర్ణయించారు. ఆ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర రవాణా శాఖ నిధులు సమకూరుస్తుంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తుంది. రాష్ట్ర రవాణా శాఖ ఆ యూనిట్లను నిర్వహిస్తుంది. స్క్రాపింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం జిల్లా కేంద్రాల్లోని శివారు ప్రాంతాల స్థలాలను పరిశీలించనున్నారు.

• తెలంగాణ

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

- జనగామ కలెక్టర్, వెస్ట్‌జోన్ డీసీపీకి గద్దర్ వినతి

జనగామ: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండలగూడెం బాలసాయిబాబా ట్రస్ట్ భూములను రక్షించే క్రమంలో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ప్రజా గాయకుడు గద్దర్ కోరారు. ఈ మేరకు శనివారం వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాంను జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 2 షిఫ్టులు పనిచేసేలా నలుగురు గన్‌మెన్లను రక్షణగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గద్దర్ మాట్లాడుతూ బాలసాయిబాబా ట్రస్ట్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని కొంతకాలంగా పోరాటం చేస్తున్నానని చెప్పారు. భూముల పరిరక్షణకు తరుచూ ఈ ప్రాంతానికి వస్తున్నానని, పలువురు ప్రజాప్రతినిధులు, రియల్టర్లతో తనకు ప్రాణహాని ఉన్నట్లు తెలిసిందన్నారు. మండలగూడెం రియల్టర్ల చేతిలో ఉన్న 59 ఎకరాల బాలసాయిబాబా ట్రస్ట్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న పేరుతో అక్కడే వర్సిటీ ఏర్పాటు చేయాలని గద్దర్ డిమాండ్ చేశారు. ఇప్పటికే ఓసారి 1997, ఏప్రిల్ 6న తనపై హత్యాయత్నం జరిగిందని, బాలసాయిబాబా భూములను కాపాడేందుకు చేస్తున్న పోరాటంలో రక్షణ కల్పించాలని కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ సీతారాంకు విన్నవించారు.

మళ్లీ ఈడీ కస్టడీకి అభిషేక్ బోయినపల్లి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌లకు రౌజ్ అవెన్యూ కోర్టు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీని పొడిగించింది. నవంబర్ 14వ తేదీన ఇచ్చిన కస్టడీ శనివారంతో ముగియడంతో వీరిద్దరిని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచారు. ఈ నేపథ్యంలో వీరి కస్టడీని మరో 5 రోజుల పాటు పొడిగించాలని ఈడీ, కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మధ్యాహ్నం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం నిందితుల కస్టడీని మరో 5 రోజులపాటు పొడిగించింది. కేసు తదుపరి విచారణను నవంబర్ 24వ తేదీకి వాయిదా వేసింది.

సిట్ నోటీసులపై స్టే ఇవ్వలేం

సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, న్యాయవాది శ్రీనివాస్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలన్న ఆ పార్టీ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ పరిస్థితుల్లో దర్యాప్తును అడ్డుకోలేమని పేర్కొంది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయవద్దని ఆదేశించింది. సీఆర్‌పీసీ 41(ఏ) నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వెంటనే నోటీసులు అందజేసి విచారణ జరుపవచ్చని స్పష్టం చేసింది. ఢిల్లీలో ఉన్న బీఎస్ సంతోష్‌కు నోటీసులు ఇచ్చేందుకు ఢిల్లీ పోలీసులు.. తెలంగాణ పోలీసులకు సహకరించాలని సూచిస్తూ వివరాలను ఢిల్లీ పోలీసులకు మెయిల్ లేదా వాట్సాప్‌లో పంపాలని సిట్‌ను ఆదేశించింది.

రేవంత్ ఫెయిల్

- ఆయన వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ నాశనం: జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ నాశనమవుతోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. పార్టీలో ఏ పరిణామం జరిగినా పీసీసీ అధ్యక్షుడే బాధ్యత వహించాలని చెప్పారు. పార్టీని నడిపించడంలో రేవంత్ ఫెయిల్ అయ్యాడని, ఆయనతోపాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, తాను కూడా ఫెయిలేనని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నా.. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి ఉన్నా.. వ్యవస్థ బాగోలేదని, అంతా గాడి తప్పిందని వ్యాఖ్యానించారు. పార్టీలో ఉన్న పది మంది కూడా ఒక్క దగ్గర కూర్చునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగబోతుంటే రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఏం చేస్తోందో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.

మర్రి శశిధర్‌రెడ్డిని బహిష్కరించిన కాంగ్రెస్!

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు శశిధర్‌రెడ్డిని ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి శనివారం హైదరాబాద్‌లో ప్రకటించారు. శశిధర్‌రెడ్డి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లతో కలిసి ఈ నెల 18న అమిత్‌షాతో భేటీ అవడం, శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ చర్య తీసుకున్నట్టు తెలిపారు. శశిధర్‌రెడ్డి వైఖరి పార్టీ రాజ్యాంగ నియమాలకు విరుద్ధమని, ఈ బహిష్కరణ నిర్ణయాన్ని ఆమోదించాలని ఏఐసీసీకి ప్రతిపాదన పంపామని ఆయన వివరించారు.

సుపరిపాలనే లక్ష్యంగా గ్రామదర్శిని



దావులూరు వద్ద జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యం రాశి పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

- కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా
- చలివేంద్రపాలెంలో పర్యటన

కంకిపాడు: సమస్యల పరిష్కారం, సుపరిపాలన చేరువ చేయటమే గ్రామదర్శిని లక్ష్యమని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. రెండో విడత గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన చలివేంద్రపాలెం గ్రామంలో పర్యటించారు.

- జగనన్న లే అవుట్‌ను సందర్శించి అక్కడ జరిగిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి అయిన వ్యయం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగం కావటంతో పాటుగా రహదారులు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతుల కల్పన భేష్ అని కితాబిచ్చారు. అన్ని జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణం వేగవంతానికి తాగునీటిని సమృద్ధిగా కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆయన ఆదేశించారు.
- కూరగాయల తోటలను సందర్శించి సాగు చేపట్టిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. సాగులో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. కూరగాయల తోటల సాగుతో పాటు, పంట మార్పిడి ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు కలెక్టర్ వివరించారు.
- ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభ, ప్రగతి, సామర్థ్యాల మదింపు వివరాలను విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం నిర్వహణపై అభిప్రాయాలు సేకరించారు. మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణ మరింత సక్రమంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, తప్పులు, మార్పులు, సవరణ తీరు తెన్నులను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు.
- గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోని రేషన్ షాపు తనిఖీ చేశారు. రేషన్ సరఫరా సమర్థంగా జరగాలని, బయటి మార్కెట్‌కు రేషన్ బియ్యం పోకుండా నిఘా ఉంచాలని సూచించారు. ఓ దివ్యాంగురాలు, వృద్ధుడు అందించిన వినతులను పరిశీలించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా బాధ్యతతో పనిచేసి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు.
- దావులూరు గ్రామంలోని సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు తీసుకుంటున్న చర్యల వివరాలు సేకరించారు. రైతులకు అందుబాటులో ఉంటూ మద్దతు ధర అందేలా చూడాలని సూచించారు. సచివాలయం ద్వారా సేవలు పెండింగ్ లేకుండా ఉండాలని, అర్హులకు పథకాలు అందించాలని శాఖల వారీగా సమీక్షించారు. దావులూరు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యం రాశులను పరిశీలించారు. తేమ శాతం పరిశీలన, మిల్లులకు ధాన్యం తరలించేందుకు తీసుకుంటున్న చర్యలను తహసీల్దార్ టీవీ సతీష్ వివరించారు.



చలివేంద్రపాలెం ఎంపీపీ పాఠశాలలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

క్షేత్రస్థాయి పరిశీలనలో పల్లెల్లో ప్రగతి...

క్షేత్రస్థాయి పరిశీలనలో గ్రామాల్లో ప్రగతి చోటుచేసుకుంటుందని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. చలివేంద్రపాలెం గ్రామదర్శినిలో కలెక్టర్ రంజిత్ బాషా మీడియాతో మాట్లాడారు. రెండో విడత గ్రామదర్శిని కార్యక్రమం జిల్లాలో 75 గ్రామాల్లో జరుగుతుందన్నారు. జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు వారికి నిర్దేశించిన గ్రామాలను సందర్శించి సమస్యలను అధ్యయనం చేస్తారన్నారు. చలివేంద్రపాలెం ప్రధాన రహదారి అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. జగనన్న లే అవుట్ వద్ద కాలువ మార్జిన్‌కు రిటైనింగ్ వాల్ అవసరం ఉందని స్థానికులు విన్నవించారన్నారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలపై ఆయా శాఖలతో సమీక్షించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అగ్రి బోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి, తహసీల్దార్ టీవీ సతీష్, ఎంపీడీఓ పి.అనూష, సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి తదితరులున్నారు.

కౌన్సెలింగ్‌తో గం'జాయ్'కి చెక్!

- వినియోగాన్ని తగ్గించేందుకు పోలీసుల వినూత్న ప్రయత్నం
- గంజాయి సేవించే వారిపై ప్రత్యేక నిఘా
- టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ కార్యాలయంలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ కృష్ణలంకకు చెందిన ఓ యువకుడు గంజాయి మత్తులో పడి చదువు మధ్యలోనే వదిలేశాడు. స్నేహితులతో కలిసి నిర్మానుష్య ప్రదేశాల్లో గంజాయి సేవించడమే నిత్యకృత్యమైంది. కొన్నాళ్లకు ఓ సైకోలా మారిన యువకుడిని తల్లిదండ్రులు కౌన్సెలింగ్ సెంటర్‌కు తీసుకెళ్లారు. దాదాపు మూడు నెలల పాటు కౌన్సెలింగ్ తీసుకున్న తరువాత గంజాయికి స్వస్తి చెప్పి ఆపేసిన చదువును తిరిగి కొనసాగించాడు. ప్రస్తుతం ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కేంద్రం....

నగరంలో గంజాయి అక్రమ రవాణాపై దాడులు కొనసాగుతున్నా.. వినూత్న పంథాలు అనుసరిస్తున్న స్మగ్లర్లు అప్పుడప్పుడు పోలీసులపై పై చేయి సాధిస్తూనే ఉన్నారు. ఏదో ఒక మార్గంలో యువతకు గంజాయిని సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా 14 నుంచి 22 ఏళ్లలోపు యువకులను టార్గెట్ చేసుకుని తొలుత గంజాయి సేవకులుగా, కొన్నాళ్లకు గంజాయి అక్రమ రవాణాదార్లుగా స్మగ్లర్లు మార్చేస్తున్నారు. గంజాయికి బానిసై కౌన్సెలింగ్ ద్వారా మారిన యువకులను పోలీస్ కమిషనర్ టీకే రాణా గత కొంత కాలంగా పరిశీలిస్తూ వచ్చారు. క్షేత్ర స్థాయిలో గంజాయికి అడ్డుకట్ట వేసేందుకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆరంభించారు. మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకుంటున్న యువతను దారిలో పెట్టేందుకు నిపుణులైన ఇద్దరు మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు...

గంజాయి సేవిస్తున్న యువకులను పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం నగరంలో సంచరిస్తోంది. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాణిగారితోట ఏరియాలోని వాటర్ ట్యాంక్ వెనక వైపు, కృష్ణా వారిధి, తారకరామానగర్, శాంపిల్ బిల్డింగ్ పక్కన, కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీ, కొత్తపేట, వించిపేట, ఫోర్‌మెన్‌బంగ్లా, శ్రీనివాసమహల్ కొండ ప్రాంతం, బ్రహ్మంగారి మఠం, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గా అగ్రహారం, కొత్తవంతెన, గుజాబితోట, భవానీపురంలో పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమ్మరిపాలెం కొండ ప్రాంతం, అవుట్ ఏజెన్సీ, కెఎల్‌రావునగర్, సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌ఆర్‌పేట, వాంబేకాలనీ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన, నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లు గంజాయి బ్యాచ్‌కు అడ్డాలుగా మారాయి. ఈ ప్రదేశాల్లో టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక టీం జల్లెడ పట్టి గడిచిన 18 రోజుల్లో 590 మంది గంజాయి సేవకులను అదుపులోకి తీసుకుంది. ముందుగా వీరికి రక్త పరీక్షలు నిర్వహించి, రక్తంలో గంజాయి ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాతే కౌన్సెలింగ్ కేంద్రానికి వారి తల్లిదండ్రులు/బంధువులు సమక్షంలో తరలిస్తున్నారు.

అత్యంత ప్రమాదకరం....

గంజాయిలో ఉండే బెంజోడైజపిన్స్ రసాయనం శారీరక, మానసిక రుగ్మతలకు కారణమవుతుందని వైద్యులు చెబుతున్నారు. మెదడులో కొత్తకొత్త సెల్స్ ఉత్పత్తిని ఈ రసాయనం అడ్డుకుంటుందని, తద్వారా ఆలోచన శక్తి క్షీణిస్తుందంటున్నారు. ఆకలి మందగించడం/ఎక్కువ ఆహారం తీసుకోవడం జరుగుతుందని, లైంగిక సమస్యలు తలెత్తుతాయని, నిద్రపట్టదని, నరాల బలహీనత వస్తుందని చెబుతున్నారు. ఈ లక్షణాలు ఆరంభంలో కనిపిస్తాయని, గంజాయి సేవించడం ముదిరితే సైకో ఇజం బయటకు వచ్చి ఎదుటి వారిపై అకారణంగా దాడి చేస్తుంటారని చెబుతున్నారు. ఒంటరితనం కోరుకోవడం, చిరాకు, అధిక కోపం, విసుగుతో పాటు ఏకాగ్రత కోల్పోతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు



ఒక్కో విడతలో 30 మంది యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. రక్తంలో గంజాయి మోతాదు ఉన్నట్లు ల్యాబ్‌లో నిర్ధారణ అయిన తర్వాతే కౌన్సెలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్నాం. వారి తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడంతో యువకుల్లో మార్పు కనిపిస్తోంది. రెండు వారాలుగా ఈ కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆరంభించిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది.

– కె.శ్రీనివాసరావు, ఏడీసీపీ, టాస్క్‌ఫోర్స్

పోలీసుల ప్రయత్నంతో మార్పు



గంజాయి మత్తు జీవిత ఆశయాన్ని మరిపించేస్తుంది. గంజాయి వల్ల కలిగే చెడు గురించి యువకులకు వివరిస్తాం. ప్రాథమిక దశలో ఉన్న వాళ్లు త్వరగా బయటపడతారు. ఎక్కువ కాలం నుంచి సేవిస్తున్న వారు మారడానికి కాస్త సమయం పడుతోంది. ప్రస్తుతం పోలీసులు చేస్తున్న ఈ ప్రయత్నం చాలా వరకు మార్పు తీసుకొస్తుంది.

– డాక్టర్ గర్రె శంకరరావు, సైకాలజిస్ట్

దుండగులను కఠినంగా శిక్షించాలి

- జిల్లా ఎస్పీని ఆదేశించిన మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి
- గూడూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నిరసన

గూడూరు: గూడూరులో జాతీయ రహదారి వెంబడి ఉన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు నిప్పుపెట్టిన దుండగులను పట్టుకుని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి 40 అడుగుల కటౌట్‌కు నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ఉదయాన్నే ఘటనా స్థలానికి చేరుకుని దుండగుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ఆందోళన చేశారు.

నిందితులను ఉపేక్షించవద్దు....

కటౌట్‌కు నిప్పు పెట్టారన్న విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి ఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి ఫోన్‌లో మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని ఆదేశించారు. దర్యాప్తు ముమ్మరం చేసి దోషులను వెంటనే పట్టుకోవాలని స్పష్టం చేశారు. మంత్రి జోగి రమేష్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వాదులంతా ఇలాంటి ఘటనలను ఖండిస్తున్నారని చెప్పారు. పవన్ కళ్యాణ్ ప్రవర్తన కారణంగానే సమాజంలో ఇలాంటి చెడు సంప్రదాయాలకు బీజాలు పడుతున్నాయని తెలిపారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో కటౌట్ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కచ్చితంగా ఇది చేతకాని దద్దమ్మలు, పిరికిపందలు చేసే పని అని ధ్వజమెత్తారు. ఇలాంటి దురాగతాలకు పాల్పడటం సమంజసం కాదన్నారు.



విచారణ వేగవంతం చేసి దోషులను పట్టుకోవాలని జిల్లా ఎస్పీని ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి జోగి రమేష్

శతాధిక వృద్ధుడు మృతి

కళ్లు దానం, మృతదేహం విద్యార్థుల ప్రయోగశాలకు

వానపాముల(పెదపారుపూడి): శతాధిక వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని వానపాముల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జాస్తి కృష్ణమూర్తి (106) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 1916 లో జన్మించారు. కృష్ణమూర్తి 18 సంవత్సరాల క్రితమే ఆయన నేత్రాలను, మృతదేహాన్ని విద్యార్థుల ప్రయోగశాలకు దానం చేయటానికి ఆమోదం తెలిపారు. నేత్రాలను ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి, మృతదేహాన్ని చిన్నఅవుట్‌పల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ మెడికల్ కాలేజీకి విద్యార్థుల ప్రయోగాల కోసం దానం చేశారు. గ్రామంలో ఆయన అనేక సంవత్సరాలు వ్యవసాయం చేశారు. హైస్కూల్ విద్యార్థులకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. పొలం ద్వారా వచ్చిన డబ్బును బ్యాంక్‌లో వేసి వచ్చిన వడ్డీని ప్రతి సంవత్సరం 6 నుంచి 10 తరగతి వరకు చదువుతూ ప్రతిభ చూపించిన విద్యార్థులకు నగదు రూపంలో బహుమతులుగా అందించారు. పాఠశాలల్లో కంప్యూటర్‌లు, సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని సందర్శించి పూలు వేసి విద్యార్థులు నివాళులర్పించారు. భార్య గతంలో మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కృష్ణమూర్తి కమ్యూనిస్టు భావాల గల వ్యక్తిగా మెలిగే వారని గ్రామస్తులు చెప్పారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించే సమయంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు కడసారిగా చూడటానికి తరలివచ్చారు.





కృష్ణమూర్తి మృతదేహం



మోసం, లైంగిక దోపిడి నుంచి అమ్మాయిలను రక్షించే లేడీ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్తిసింగ్ తన్వర్‌కి మంచి పేరుంది. దీంతోపాటు సైబర్ నేరగాళ్ల నుంచి ఎంత అలెర్ట్‌గా ఉండాలో సోషల్ మీడియా ద్వారా అవగాహన కలిగిస్తుంటుంది. చట్టం గురించి వీడియో పాఠాలు చెబుతుంటుంది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు, మోటివేషనల్ స్పీచ్‌లు ఇస్తుంటుంది. ఆమె గైడ్‌లైన్స్‌కి లక్షల్లో ఫాలోవర్స్ ఉన్నారు. రాజస్థాన్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్తిసింగ్ తన అభిరుచితో బాధ్యత గల సామాజికవేత్తగానూ ప్రశంసలు అందుకుంటోంది.

పోలీస్ వీడియో పాఠాలు



ఈ లేడీ సబ్ ఇన్‌స్పెక్టర్ తన విధుల ద్వారానే కాదు రోజూ ఇచ్చే స్ఫూర్తిమంతమైన స్పీచ్‌లు, ఎలాంటి మోసం జరగకుండా ఇచ్చే సైబర్ గైడెన్స్‌తో ప్రతి రోజూ చర్చలో ఉంటుంది. 'నా అభిరుచిని వృత్తితో జోడీ కట్టించాను. ఫలితం ఎంతోమందికి చేరువయ్యాను' అంటారు ఈ లేడీ పోలీస్.



అమ్మాయిలకు సోషల్ మీడియా గురించి అవగాహన కల్పిస్తున్న సందర్భంలో..

■ వృత్తి... ప్రవృత్తితో కలిసి..

ఆర్తిసింగ్ కుటుంబ సభ్యులు, బంధువుల్లో చాలామంది పోలీసులుగా ఉన్నారు. వారిలాగే ఆర్తి కూడా పోలీస్ వృత్తినే ఎంచుకుంది. 2012లో రాజస్థాన్ పోలీస్ అకాడమీలో చేరి 2014లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులను చేపట్టింది. 'నేను సోషల్ మీడియా ఫ్రెండ్లీగా ఉంటాను. చేస్తున్న పనుల ద్వారానే నలుగురిలో అవగాహన కలిగిస్తే చాలనుకున్నాను. మహిళల గళం వినిపించాల్సిన చోటు, సైబర్ అవగాహన, సందేశాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాను. నా ఫాలోవర్స్ ఎప్పుడు ఇంతగా పెరిగిపోయారో తెలియనే లేదు' అనేస్తారు ఆమె నవ్వుతూ.

■ సోషల్ మీడియా సెల్...

పోలీస్ అకాడమీలో శిక్షణ ఇవ్వడంతోపాటు సోషల్ మీడియా సెల్ కూడా నిర్వహిస్తోంది ఈ సబ్‌ఇన్‌స్పెక్టర్. 'ఇటీవల మా సిబ్బందికి పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఫొటోతో ఓ మెసేజ్ వచ్చింది. గిఫ్ట్ కార్డుల సాకుతో ఎవరో నకిలీ నంబర్‌తో డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. వెంటనే అందరినీ అప్రమత్తం చేశాను. ఇలాగే.. షాపింగ్, వర్క్ ఫ్రమ్ హోమ్, మెసేజ్‌లలో వచ్చే షార్ట్ లింక్స్... వంటి ఆన్‌లైన్ మోసాలు ప్రతిరోజూ నమోదవుతున్నాయి. ఈ మోసాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన తప్పనిసరి అనుకున్నాను. లైవ్ ఇంటరాక్షన్స్ ద్వారా మోసాన్ని నివారించడానికి సూచనలు ఇస్తుంటాను. బాధితులు తమ అనుభవాలను కామెంట్స్‌లో లేదా డైరెక్ట్ మెసేజ్ ద్వారా తెలియజేస్తారు. దీంతో వారికి తక్షణ సహాయం అందివ్వడానికి ప్రయత్నిస్తుంటాం. మోసం, లైంగిక దోపిడీని ఎలా నివారించాలో సూచించే వీడియోలను అప్‌లోడ్ చేస్తుంటాను' అని వివరిస్తారు ఆమె.



విధుల్లోనూ సామాజిక మాధ్యమం ద్వారా అవగాహన కల్పిస్తూ..

ప్రతిరోజూ అవగాహన రీల్

ప్రతిరోజూ లక్షలాది మంది ఫాలోవర్లు ఆర్తి గైడెన్స్ రీల్స్ కోసం ఎదురు చూస్తుంటారు. వాటిలో చట్టం, న్యాయానికి సంబంధించి అవగాహన కంటెంట్‌కే ప్రాధాన్యమిస్తుంటుంది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల ద్వారా నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు ఆర్తి సూచనలను ఫాలో అవుతున్నారు.

■ యువతకు వీడియో పాఠాలు

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు, టైమ్ టేబుల్ తయారు చేసుకోవడం, రోజువారీ సిలబస్‌ను ఎలా సిద్ధం చేసుకోవాలి, ఏ సబ్జెక్టులను ఎప్పుడు, ఎలా చదవాలి, కంటెంట్ సులభంగా ఎలా గుర్తుంచుకోవచ్చు... ఇలాంటి వీడియోల కోసం యువత ఎదురు చూస్తుంటుంది.

■ కొత్త టెక్నాలజీ పరిచయం

సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వీడియోల ద్వారా షేర్ చేస్తుంటుంది ఆర్తి. మొబైల్ హ్యాక్ అయితే ఏం చేయాలి? ఇంట్లోని స్మార్ట్ టీవీ హ్యాక్ అయితే సమస్యను ఎలా పరిష్కరించాలి? సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ కొత్త ఫీచర్లు ఏమిటి?.. వీటికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తుంటుంది ఆర్తి.

■ ఖాకీ యూనిఫాంలో..

'నా వీడియోలలో చాలా వరకు నేను ఖాకీ యూనిఫాంలోనే కనిపిస్తాను. ఆఫీసులో పని చేస్తున్నప్పుడు చట్టపరమైన సమాచారాన్ని చిన్న చిన్న వీడియోలు చేసి పోస్ట్ చేస్తాను. కొన్నిసార్లు ఇంటి నుంచి ఆఫీసుకు లేదా ఆఫీసుకు నుంచి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు కారులో వీడియోలు షూట్ చేసి అప్‌లోడ్ చేస్తుంటాను. పోస్ట్ చేసిన గంటల్లోనే వేలల్లో వ్యూస్ వస్తాయి. దీనిని బట్టి ప్రజల్లో చట్టం, న్యాయం, మోసాలకు సంబంధించిన అవగాహన ఎంత అవసరం ఉందో గ్రహించవచ్చు' అని చెప్పే ఆర్తిసింగ్‌ను 'మా మంచి పోలీస్' అంటూ ప్రశంసిస్తున్నారు ఆమె ఫాలోవర్స్.

పరిశోధన

ఈ పరిశోధనాత్మక ఛాయాచిత్ర పుస్తకంలో 'అయ్యో!' అనిపించే జీవితాలు ఉన్నాయి. కన్నీటి సముద్రాలు ఉన్నాయి. ఏడు సంవత్సరాల పాటు ఎన్నో ప్రాంతాలు తిరిగి, పరిశోధించి ఢిల్లీకి చెందిన ఫొటో జర్నలిస్ట్ రూపొందించిన ఈ పుస్తకం బాధిత హృదయానికి నిలువుటద్దం...



ఉయ్ క్రై ఇన్ సైలెన్స్

చీకటి మింగిన వెన్నెలరేఖల కథ

ఢిల్లీలోని ఒక వ్యభిచార గృహం నుంచి పదిహేడు సంవత్సరాల యువతిని కాపాడారు పోలీసులు. ఆ అమ్మాయితో మాట్లాడిన ఫొటో జర్నలిస్ట్ స్మితాశర్మకు 'తెలుసుకోవాల్సి విషయాలు చాలా ఉన్నాయి' అనిపించింది. అలా తన పరిశోధన మొదలైంది. ఏడు సంవత్సరాలు ఎన్నెన్నో కష్టాలు పడి, ఎంతో పరిశోధించి 'ఉయ్ క్రై ఇన్ సైలెన్స్' అనే ఫొటోబుక్ తీసుకువచ్చింది. ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ భాషలలో ఈ పుస్తకం ప్రచురితం అయింది.



స్మితాశర్మ

తన పరిశోధనలో భాగంగా స్మిత తెలుసుకున్న ముఖ్యవిషయం ఏమిటంటే, చాలా కేసుల్లో మానవ అక్రమ రవాణా అనేది బెదిరింపులతో బలవంతంగా జరగడం లేదు. అమ్మాయిల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని రకరకాల మోసాలతో ఉచ్చులోకి దించుతున్నారు. ఉదాహరణకు మీనా(పేరు మార్చబడమైనది)

ఒక రోజు మీనాకు ఒక యువకుడి నుంచి ఫోన్ వచ్చింది. 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఒకసారి కలవాలనుకుంటున్నాను' అన్నాడు. రెండోరోజు మీనా దగ్గరకు వచ్చి ' వీరు మా అమ్మా,నాన్నలు' అంటూ ఇద్దరిని పరిచయం చేసి పెళ్లి ప్రపోజ్ చేశాడు. ఆ అద్దె తల్లిదండ్రులు కూడా తమ నటనతో రెచ్చిపోయారు. 'నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాం' అని నమ్మించారు. తన సోదరికి ఢిల్లీలో వస్త్రవ్యాపారం ఉందని, ఇద్దరం అక్కడే పనిచేద్దాం అన్నాడు యువకుడు. వీరి మాయమాటలు నమ్మి ఢిల్లీకి చేరిన మీనా దుర్మార్గుల బారిన పడింది.

బంగ్లాదేశ్‌కు చెందిన 12 సంవత్సరాల బాలికకు కుటుంబ పరిస్థితుల వల్ల ఉద్యోగం చేయడం అనివార్యం అయింది. తమ కుటుంబంతో కాస్త పరిచయం ఉన్న ఒక వ్యక్తి 'ముంబైలో ఉద్యోగం ఇప్పిస్తాను' అంటూ తీసుకెళ్లి బ్రోతల్ హౌస్‌కు అమ్మేశాడు. రెండు సంవత్సరాల తరువాత ఈ అమ్మాయి పోలీసుల సహాయంతో విముక్తి అయింది. ఒక ఆశ్రయంలో చేరింది. కొద్దిరోజులకు ఆమెకు ఒక మహిళ పరిచయం అయింది. 'మీ దేశం తీసుకెళతాను' అని నమ్మించి పశ్చిమ బెంగాల్‌లోని సమ్‌ఖానా అనే ఊరిలోని బ్రోతల్‌కు అమ్మేసింది... ఇలా చెప్పుకుంటూ పోతే ఈ పుస్తకంలో ఎందరో బాధితులు ఉన్నారు.

యాంటీ-హ్యూమన్ ట్రాఫికింగ్ ఆర్గనైజేషన్స్, లాయర్లు, పోలీస్ అధికారుల సహాయంతో మీనా లాంటి ఎంతోమంది అమ్మాయిలతో మాట్లాడింది స్మిత. దీనివల్ల అమ్మాయిల అమాయకత్వం, నేరగాళ్లు ఎన్ని రకాలుగా నమ్మిస్తారు? ఆ తరువాత ఎలా తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటారు? ఎలా మోసం చేస్తారు? మానవ అక్రమ రవాణా నేరవ్యవస్థ మూలాలు ఏమిటి?... ఇలా ఎన్నో విషయాలు తెలుసుకోగలిగింది స్మిత.

కొన్ని ప్రాంతాలలో అమ్మాయిలు ఇల్లు ఎందుకు విడిచి పెట్టాలనుకుంటున్నారనే విషయానికి వస్తే కొన్ని వాస్తవాలు తెలుస్తాయి. ఎన్నో కిలోమీటర్ల దూరం నడిచి నీళ్లు తేవడం, వంట వండడం, బట్టలు ఉతకడం, పొలానికి వెళ్లి పనులు చేయడం... పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఈ అంతులేని బండచాకిరీతో తమకు తెలియకుండానే ఇల్లు, ఊరు దాటే స్వేచ్ఛను కోరుకుంటున్నారు. ఈ సమయంలోనే మోసగాళ్ల బారిన పడుతున్నారు.


'సున్నితమైన అంశంపై పనిచేస్తున్నాను' అనే ఎరుకతో కెమెరాను చాలా జాగ్రత్తగా ఉపయోగించింది స్మిత. బాధితుల ముఖాలు కనిపించకుండా స్పాట్‌లైట్లు, షాడోస్... ఇతరత్రా క్రియేటివ్ మెథడ్స్‌ను ఉపయోగించింది. 'లైట్లు, షాడోస్ నా ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించాయి' అంటుంది స్మితా శర్మ. హైదరాబాద్‌లో జరిగిన 'ఇండియన్ ఫొటో ఫెస్టివల్-2022'లో పరిశోధనాత్మక ఫొటోబుక్ 'ఉయ్ క్రై ఇన్ సైలెన్స్' ఆవిష్కరణ జరిగింది.

కెరటోకోనస్

హెల్త్

కళ్లు నులుముకోకండి... కష్టాలు తెచ్చుకోకండి!





కళ్లలో కనుపాపగా పిలిచే నల్లగుడ్డు గోళాకారంలో ఉంటుంది. దానిపైన ఓ పారదర్శకపు పొర కారు అద్దంలా (విండ్‌షీల్డ్) ఉంటుంది. ఆ పొర క్రమంగా త్రిభుజాకారపు పట్టకంలా లేదా ఓ పిరమిడ్ ఆకృతి పొందవచ్చు... లేదా పైకి ఉబికినట్లుగా కావచ్చు. కనుపాప ఇలా 'కోనికల్'గా మారడాన్ని 'కెరటోకోనస్' అంటారు. ఈ సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం.

ఇది బాలబాలికల్లో పదేళ్ల నుంచి 25 ఏళ్ల మధ్యలో కనిపిస్తుంది. కొందరిలో ముప్ఫై ఏళ్ల తర్వాత కూడా కనిపించవచ్చు.

ఎందుకిలా జరుగుతుందంటే?

కంట్లో ఉండే నల్లగుడ్డు/కంటిపాపపై పొర... ప్రోటీన్లతో నిర్మితమై, సూక్ష్మమైన ఫైబర్‌ల సహాయంతో నల్లగుడ్డుపై అంటుకుని ఉంటుంది. ఇందుకు తోడ్పడే కణజాలాన్ని 'కొల్లాజెన్' అంటారు. ఈ కొల్లాజెన్ బలహీనపడి, కంటిపాపపై పొరను సరిగా అంటుకునేలా చేయనప్పుడు దాని ఆకృతి 'కోన్' లా మారుతుంది. మరీ బలహీనపడ్డప్పుడు ఈ పొర అతిగా పలుచబడి, నెర్రెలు బారవచ్చు కూడా. నార్మల్‌గా 500 మైక్రాన్లుండే ఈ పొర 150 నుంచి 100 మైక్రాన్లంత పలచబడుతుంది. దాంతో కొద్దిగా నులుముకున్నా అది నెర్రెలుబారుతుంది.

విస్తృతి : భారత్‌లో దీని విస్తృతి చాలా ఎక్కువ. ఇటీవలి ఓ అధ్యయనం ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా దీని విస్తృతి 0.13% మాత్రమే. ఉదా: యూఎస్‌లో ఈ కేసులు 0.54% ఉండగా... మనదేశంలో 2.3 శాతం. ఇరాన్‌లో 2.5% ఉండగా సౌదీ అరేబియాలో 4.79 శాతం. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో దీని విస్తృతి ఇంకా ఎక్కువ. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారత ఉపఖండంలో కేసులు 5 నుంచి 8 రెట్లు ఎక్కువ.


లక్షణాలు : ● రెండు కళ్లనూ ప్రభావితం చేస్తుంది. మసగ్గా కనిపించడం ప్రధాన లక్షణం. మసకబారడం రెండు కళ్లలోనూ సమానంగా జరగకపోవచ్చు. ఒక కన్నులోనే ఈ సమస్య రావడం చాలా అరుదు ● దృశ్యాలు స్పష్టంగా ఉండవు. దీన్ని డిస్టార్టెడ్ విజన్ అంటారు. ఉదా: సరళరేఖలు ఒంగినట్లు కనిపించవచ్చు ● ఒకే వస్తువు రెండుగా కనిపించవచ్చు ● వస్తువు చుట్టూ నీడలా మరో ఇమేజ్ కనిపించవచ్చు. దాన్ని 'ఘోస్ట్ ఇమేజ్' అంటారు ● వెలుతురుని కళ్లు భరించలేకపోవచ్చు ● అరుదుగా కళ్లు ఎర్రబారడం, వాపురావడం జరగవచ్చు ● ఈ కేసుల్లో మయోపియా (దగ్గరవి మాత్రమే కనిపించి, దూరం వస్తువులు అస్పష్టంగా ఉండటం) సాధారణం ● ఆస్టిగ్మాటిజం కూడా రావచ్చు. అంటే గ్రాఫ్‌లోని అడ్డుగీతలూ, నిలువుగీతలూ ఒకేసారి కనిపించకపోవచ్చు. ఏవో ఒకవైపు గీతలే కనిపిస్తాయి.

కారణాలు: ● కెరటోకోనస్ సమస్యకు కారణాలు ఇప్పటికీ పెద్దగా తెలియదు. వంశపారంపర్యంగా కనిపిస్తుంది. తల్లిదండ్రుల్లో ఎవరికైనా ఉంటే... పిల్లల్లో వచ్చే అవకాశం 5% నుంచి 20% వరకు ఉంటుంది ● కొందరిలో కళ్ల అలర్జీ (ఆక్యులార్ అలర్జీ) వల్ల కళ్లు దురదలుగా అనిపించి, నులుముకుంటుంటారు. దాంతో అప్పటికే పలచబడ్డ నల్లగుడ్డు పైపొర చిట్లడంతో ఇది వస్తుందని వైద్యశాస్త్రవేత్తల నమ్మకం ● మార్ఫన్స్ సిండ్రోమ్ కూడా ఇందుకు ఓ కారణంగా చెబుతున్నారు
● ఏదైనా కారణం వల్ల కంటివాపు, కన్ను ఎర్రబారడం వంటి ఇన్‌ఫ్లమేషన్ దీర్ఘకాలం కొనసాగితే కూడా రావచ్చు ● కళ్లకు సంబంధించిన సమస్యలైన వెర్నల్ కెరటోకంజంక్టవైటిస్ (వీకేసీ), అనిరిడియా (పుట్టుకతోనే కంటిలోపలి నల్లగుడ్డులో కొంత భాగం లేకుండా జన్మించడం), ఎక్టోపియా (కంటిలోని లెన్స్ భాగం జారడం), లెబర్ కంజెనిటల్ అమరోసిస్ (పుట్టుకతోనే వచ్చే ఒక రకం తీవ్రమైన కంటిజబ్బు), రెటినైటిస్ పిగ్మెంటోజా (రెటీనాకు వచ్చే ఒక రకం రుగ్మత), రేచీకటి వంటివి కూడా కెరటోకోనస్‌కు కారణం కావచ్చు.

ముప్పు ఎవరెవరిలో ఎక్కువ...

ముప్పు కలిగించే అంశం	ఏ మేరకు ముప్పు
ఆక్యులార్ అలర్జీ	ముప్పు 1.42 రెట్లు ఎక్కువ
కళ్లు నులుముకోవడం	ముప్పు 3 రెట్లు ఎక్కువ
ఆస్తమా (అలర్జీ కారణంగా)	ముప్పు 1.9 రెట్లు ఎక్కువ
ఎగ్జిమా (అలర్జీ కారణంగా)	ముప్పు 2.9 రెట్లు ఎక్కువ
కుటుంబ చరిత్ర	ముప్పు 6.4 రెట్లు ఎక్కువ
తల్లిదండ్రుల్లో ఉంటే	ముప్పు 2.8 రెట్లు ఎక్కువ

గుర్తించడం (డయాగ్నోజ్) ఎలా? కొంతమేర కంటికే కనిపిస్తుంది. నిర్ధారణకు డాక్టర్లు కొన్ని కంటి పరీక్షలు చేస్తారు. కార్నియా షేపు మారడాన్ని తెలుసుకునేందుకు 'కార్నియల్ టొపొగ్రఫీ', 'కార్నియల్ టోమోగ్రాఫీ' (పెంటా క్యామ్) అనే కంప్యూటర్ పరీక్షలతో నిర్ధారణ చేస్తారు.



చికిత్స : ● కార్నియా దెబ్బతినకముందే కనుగొంటే చూపును చాలావరకు కాపాడవచ్చు ● దీన్ని అర్లీ, మాడరేట్, అడ్వాన్స్‌డ్, సివియర్‌గా విభజిస్తారు. ఈ దశలపైనే చికిత్స ఆధారపడి ఉంటుంది ● అర్లీ, మాడరేట్ కేసుల్లో కొల్లాజెన్‌ను బలోపేతం చేసే చికిత్సలు చేయాలి. ఈ దశలో కంటి అద్దాలు మార్చడం/ కాంటాక్ట్ లెన్స్ (రిజిడ్ గ్యాస్ పర్మియబుల్ కాంటాక్ట్స్)తో చికిత్స ఇవ్వవచ్చు ●కొంతమందిలో ఇంటాక్స్ రింగులు వాడి... కార్నియాను మునపటిలా ఉండేలా నొక్కుతూ చికిత్స చేస్తారు ● 'కార్నియల్ కొల్లాజెన్ క్రాస్ లింకింగ్' అనే చికిత్సతో మరింత ముదరకుండా నివారించవచ్చు. ఇది అధునాతనమైనదీ, సులువైనది, ఖచ్చితమైన చికిత్స కూడా. రోగుల పాలిట వరమనీ చెప్పవచ్చు. దీనివల్ల కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ చాలా తగ్గాయి. కొంతమందిలో క్రాస్‌లింకింగ్‌తో పాటు లేజర్ చికిత్స కూడా చేస్తారు. మరికొంతమందిలో క్రాస్‌లింకింగ్‌తో పాటు ఐసీఎల్ అనే లెన్స్‌ను అమరుస్తారు.

● **చివరగా...** అడ్వాన్స్‌డ్ దశలోనూ, అలాగే సివియర్ దశల్లో కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (కంటిపాప/నల్లగుడ్డు) మార్పిడి చికిత్స చేయాల్సి రావచ్చు. ఆ శస్త్రచికిత్స తర్వాత కాంటాక్ట్‌లెన్స్ ధరించాల్సి ఉంటుంది.

నివారణ: ● పదేళ్ల నుంచి 25 ఏళ్ల వయసు వారు మయోపియా, ఆస్టిగ్మాటిజమ్, కళ్లద్దాలు వాడాక కూడా అస్పష్టంగా కనిపించడం, ఒకే వస్తువు చుట్టూ మరో నీడ (ఘోస్ట్ ఇమేజ్), ఖాళీలు కనిపించడం (హ్యాలోస్), ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డబుల్ ఇమేజ్) ఉన్నవారు కెరటోకోనస్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి ● ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవారు కూడా స్క్రీనింగ్ తప్పక చేయించుకోవాలి. ఒకవేళ ఈ స్క్రీనింగ్ పరీక్షల్లో ఉన్నట్లు తేలితే... ఎంత త్వరగా చికిత్స తీసుకుంటే అంత మంచిది ● కంటి అలర్జీ ఉన్నవారు కూడా కెరటోకోనస్ స్క్రీనింగ్ చేయించుకోవడం మేలు.



డాక్టర్ రవికుమార్ రెడ్డి
సీనియర్
కంటి వైద్య నిపుణులు

గర్భాశయ, ఎండోమెట్రియల్ క్యాన్సర్లు

గర్భసంచిలో ఒక లైనింగ్‌లా ఉండి ప్రతినెలా గర్భం దాల్చడానికి అనువుగా మందంగా తయారై, గర్భం ధరించకపోతే నెలసరి స్రావాల్లో బయటకు వెళ్లిపోయేదే ఎండోమెట్రియమ్ పొర. ఇది సగటున 6 నుంచి 7 మిల్లీమీటర్ల మందం ఉంటుంది. నెలసరి ముందు మందంగా ఉండటం, తర్వాత తగ్గడం జరిగే ఎండోమెట్రియమ్... హార్మోన్ల అసమతుల్యత వల్ల మరీ పలుచగా తయారైతే సంతానలేమికి దారితీస్తుంది. మెనోపాజ్ దశలో ఎండోమెట్రియమ్ పలుచగా మారిపోతుంది. పిల్లల్ని కనే వయసులో మరీ ఎక్కువగా ఈస్ట్రోజెన్ హార్మోన్, ఇతర హార్మోన్‌లు పెరిగితే మందంగానూ, ఎక్కువగా ప్రొజెస్టిరాన్ హార్మోన్ ఉన్న బర్త్ కంట్రోల్ పిల్స్‌వాడితే పలుచగానూ మారిపోతుంది. గర్భధారణ సమయంలో మందంగా తయారయ్యే ఎండోమెట్రియమ్ ద్వారానే పిండానికి పోషకాలు, ఆక్సిజన్ అందుతాయి. అందుకే సంతానలేమి సమస్యలతో బాధపడేవారికి చేసే పరీక్షల్లో, కృత్రిమ గర్భధారణ పద్ధతుల్లో సంతానభాగ్యం పొందాలనుకునేవారికి చేసే పరీక్షల్లో ఎండోమెట్రియమ్ పొర ఎంత మందంగా ఉందో తెలుసుకునే పరీక్ష కీలకమైనది. ఇది 6 మి.మీ నుంచి 14 మి.మీ. ఉంటే గర్భధారణకు అనువుగా ఉంటుంది.



ఎండోమెట్రియమ్ ఉండాల్సిన దానికంటే ఎక్కువ మందంగా ఉండటం లేదా ఎక్కువ పలచగా ఉండటం వంటి సమస్యలతో పాటు ఫైబ్రాయిడ్స్, సిస్ట్స్, ఎండోమెట్రియాసిస్, ఎండోమెట్రియల్ క్యాన్సర్స్ వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఈస్ట్రోజెన్ హార్మోన్ లెవెల్స్ శరీరంలో దీర్ఘకాలికంగా ఎక్కువగా ఉన్నా, ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వని స్త్రీలలో, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిన స్త్రీలకి, నెలసర్లు తొమ్మిదేళ్ల కంటే ముందు, మెనోపాజ్ దశకు లేటుగా చేరుకునే స్త్రీలలో, అధికబరువు ఉన్న మహిళల్లో ఎండోమెట్రియల్ క్యాన్సర్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుంది.

వాస్తవానికి గర్భాశయంలో లైనింగ్‌లా ఉండాల్సిన ఎండోమెట్రియమ్ (కొన్ని సందర్భాల్లో నెలసర్లు ప్రారంభం కాని అమ్మాయిల్లో, కొందరిలో మెనోపాజ్ దశ తర్వాత కూడా) గర్భాశయం బయట ఇతర అవయవాలచుట్టూ కూడా పెరగడం ప్రారంభిస్తుంది. ఇలా పెరిగే కండిషన్‌నే ఎండోమెట్రియోసిస్ అంటారు. అధికంగా పెరిగిన ఎండోమెట్రియమ్ వల్ల పొత్తికడుపు నొప్పి, కలయికలో నొప్పి, మూత్రం అదుపులో లేకపోవడం, నెలసరిలో స్రావం అధికంగా ఉండటం, అజీర్తి, అలసట వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయి.

అండాశయాల చుట్టూ పెరిగిన ఎండోమెట్రియమ్ చుట్టూ రక్తం చేరి బ్రౌన్ కలర్‌లో కనిపించడం వల్ల వాటిని చాకొలెట్ సిస్ట్స్ అంటారు. ఎండోమెట్రియోసిస్, ఎండోమెట్రియల్ క్యాన్సర్ లక్షణాలు ఒకేలా ఉండటమే కాకుండా, ఎండోమెట్రియాసిస్ ఉన్నవారికి ఒవేరియన్ క్యాన్సర్ వచ్చే రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా నాన్‌హాడ్జ్‌కిన్స్ లింఫోమా, పిట్యుటరీ, థైరాయిడ్ గ్రంథి క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎండోమెట్రియోసిస్‌తో బాధపడేవారు ఈ విషయాలపై అవగాహన పెంపొందించుకుంటే మంచిది.

ఎండోమెట్రియల్ ఫైబ్రాయిడ్స్ లేక యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ చిన్నగా ఉండి, చాలామందిలో ఎటువంటి లక్షణాలూ కలిగించకుండా కూడా ఉంటాయి. పొత్తికడుపు బరువుగా ఉండటం, నెలసరిలో రక్తస్రావం ఎక్కువగా కావడం, మూత్రం అదుపులో లేకపోవడం మొదలైన లక్షణాలు కనిపిస్తే మందులు లేదా శస్త్రచికిత్స వంటి చికిత్సలు తప్పనిసరి. దాదాపుగా ఎండోమెట్రియోసిస్, యుటెరైన్ సిస్ట్స్, ఫైబ్రాయిడ్స్, గర్భసంచి క్యాన్సర్ లక్షణాలు ఒకేలా ఉంటాయి. అంతేకాకుండా గర్భసంచికి సంబంధించిన ఈ సమస్యలు తలెత్తడానికి కూడా కారణాలు లేదా రిస్క్‌ఫ్యాక్టర్స్ కూడా ఒకేలా ఉంటాయి. అందుకే లక్షణాలు కనిపించినప్పుడు సమస్య ఏమై ఉంటుందా అని, అన్ని పరీక్షలూ సరిగా చేయించుకుని నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుంది. నెలసరి మధ్యలో రక్తస్రావం కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు.

స్త్రీలలో గర్భసంచి ముఖద్వారానికి సంబంధించిన క్యాన్సర్, ఒవేరియన్ క్యాన్సర్ తర్వాత ఎక్కువగా కనిపించే క్యాన్సర్ గర్భాశయ క్యాన్సర్. గర్భసంచిలో క్యాన్సర్ కణితి పెరిగిన ప్రదేశాన్ని బట్టి దీన్ని అనేక రకాలుగా విభజిస్తారు. లక్షణాలు కనిపించినప్పుడు పాప్‌స్మియర్‌తోపాటు ఎండోమెట్రియల్ బయాప్సీ, హిస్టెరోస్కోపీ, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు చేసి, గర్భసంచికి సంబంధించిన ఏ సమస్య అయి ఉంటుందో నిర్ధారణ చేస్తారు. క్యాన్సర్ అని నిర్ధారణ అయితే మాత్రం ప్రధానంగా సర్జరీయే సరైన చికిత్స. దశను బట్టి గర్భసంచిని, చుట్టూ ఉన్న లింఫ్ నాళాలను, అండాశయాలను తీసివేస్తారు. తొలిదశలో గుర్తిస్తే కీ-హోల్ సర్జరీలు చేయడమూ సాధ్యమవుతుంది.

స్టేజ్-1 కంటే ఎక్కువదశలో ఉంటే గర్భాశయాన్ని తీసివేశాక రేడియో, కీమోథెరపీలను దశను బట్టి ఎన్నిసార్లు ఇవ్వాలో నిర్ణయిస్తారు. ఈ క్యాన్సర్ 55 నుంచి 65 ఏళ్ల మహిళల్లో ఎక్కువగా కనబడుతుంది. వయసు పైబడేకొద్దీ ఈ క్యాన్సర్ వచ్చే రిస్క్ పెరుగుతుంది.

బ్రెస్ట్‌క్యాన్సర్‌కు టిమాక్సిఫిన్ మందు వాడిన స్త్రీలు, ఇతర కారణాల వల్ల పెల్విస్‌కు రేడియేషన్ థెరపీ తీసుకున్నవారు, హార్మోన్ థెరపీ ఎక్కువగా తీసుకున్న మహిళలు, 55 ఏళ్లు పైబడినా నెలసరులు ఆగని మహిళలు, స్మోకింగ్ అలవాటు ఉన్న స్త్రీలు తగిన పరీక్షలు చేయించుకుంటూ ఉండటం, ఏవైనా లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా ఉండటం చాలా మంచిది. వయసు పైబడిన స్త్రీలు, రిస్క్‌ఫ్యాక్టర్స్ ఉన్న మహిళలు డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా పాప్‌స్మియర్, అల్ట్రాసౌండ్, కాల్పోస్కోపీ పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.



డా. సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ నంబరు 9849022121



కాంస్యంతో చరిత్ర సృష్టించిన మనిక బత్రా

ఏషియన్ కప్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా అద్భుతం చేసింది. ఈ టోర్నీ చరిత్రలో పతకం సాధించిన తొలి భారతీయ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించింది. బ్యాంకాక్‌లో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ కాంస్య పతక మ్యాచ్‌లో 44వ ర్యాంకర్ మనిక 11-6, 6-11, 11-7, 12-10, 4-11, 11-2తో ప్రపంచ 6వ ర్యాంకర్ హినా హయాటా (జపాన్)పై సంచలన విజయం సాధించింది. కాంస్యం గెలిచిన మనిక బత్రాకు 10 వేల డాలర్ల (రూ. 8 లక్షల 15 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. అంతకుముందు సెమీఫైనల్లో మనిక 8-11, 11-7, 7-11, 6-11, 11-8, 7-11తో మిమా ఇటో (జపాన్) చేతిలో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. 'ఈ విజయం నాకెంతో గొప్పది. మేటి క్రీడాకారిణులను ఓడించినందుకు ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో జరిగే టోర్నీలలోనూ ఇదే జోరును కనబరుస్తా' అని మనిక వ్యాఖ్యానించింది.

రొనాల్డో... మెస్సీ... నెమార్... హ్యారీ కేన్... ఫుట్‌బాల్ ప్రపంచంలో ఇవేమీ కొత్త పేర్లు కాదు... కానీ ఇప్పుడు మళ్లీ అవన్నీ మన ముంగిట కొత్తగా వినిపిస్తాయి. సాధారణంగా ఎప్పుడు పిలవని, నోరు తిరగని నామ ధేయాలు కూడా ఇప్పుడు మన నోటిపై జపం చేస్తాయి. క్రీడాభిమానుల కళ్లన్నీ నెల రోజుల పాటు మిగతా ఆటలన్నీ గట్టున పెట్టేసి ఈ మ్యాచ్‌ల ఫలితం కోసం ఎదురు చూస్తాయి. ఇప్పుడు లెక్క సెంచరీల్లోనో, పరుగుల సంఖ్యలోనో కాదు... సింగిల్ డిజిట్‌లోనే సీన్లు మారిపోతాయి... అంతా గోల్స్ గోలనే ... ఒక్క అంకె ఒకవైపు ఆనందం నింపితే, మరోవైపు గుండెలు బద్దలు చేస్తుంది. 32 దేశాల మెరుపు వీరులు మైదానంలో పాదరసంలా దూసుకుపోతుంటే... ఉత్సాహం, ఉద్వేగానికి లోటు ఏముంటుంది... 64 మ్యాచ్‌లలో మన కళ్లన్నీ బంతి మీదే నిలిస్తే ఆఖరి రోజున జగజ్జేతగా మనమే నిలిచిన భావన అభిమానిది... అవును, ప్రపంచ వ్యాప్తంగా అందరినీ అలరించేందుకు ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ మళ్లీ వచ్చేసింది. 29 రోజుల పాటు కళ్లార్పకుండా చూసేందుకు, ప్రతీ క్షణాన్ని ఆస్వాదించేందుకు మీరంతా సిద్ధమైపోండి!

మరి కొన్ని గంటల్లో... ప్రపంచం మొత్తం అబ్బురపడే అత్యద్భుత ఘట్టానికి తెర లేవనుంది... ఎడారి దేశం ఖతర్‌లో ఇసుక తుఫాన్‌లు సాధారణం. అయితే రాబోయే నెలరోజులు సాకర్ సంగ్రామం ఎడారి దేశాన్ని ఒక ఊపు ఊపనుంది. సుమారు 16 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌తో సిద్ధమైన మెగా క్రీడా సంబరానికి విజిల్ మోగనుంది. ఇప్పటి వరకు 21 ప్రపంచ కప్‌లు జరిగాయి... కానీ 22వది మాత్రం అన్నింటికంటే భిన్నం! అమెరికా, యూరోప్ దేశాలను దాటి అరబ్ దేశంలో తొలిసారి నిర్వహిస్తున్న టోర్నీ కాగా... ఆతిథ్య దేశం ఆలోచనలకు అనుగుణంగా వచ్చిన నియమ నిబంధనలు ఈ మెగా టోర్నీని మరింత ప్రత్యేకంగా మార్చాయి... ఆతిథ్య హక్కులు కేటాయించిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు వివాదాలు వెంట వచ్చినా, ఖర్చు అంచనాలను దాటి ఆకాశానికి చేరినా వెనక్కి తగ్గని ఖతర్ దేశం టోర్నమెంట్‌ను మెగా సక్సెస్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే పండగ ముందు ఏర్పాట్లలో ఎంత కష్టం ఉన్నా... ఒక్కసారి ఆట మొదలైతే అన్నీ వెనక్కి వెళ్లిపోతాయి. 'ఫిఫా' కూడా సరిగ్గా ఇదే ఆశిస్తోంది.

-సాక్షి క్రీడా విభాగం

ఎడారి దేశంలో సాకర్ తుఫాన్

నేటి నుంచి ఫుట్‌బాల్ వరల్డ్ కప్ ● తొలి మ్యాచ్‌లో ఈక్వెడార్‌తో ఖతర్ 'ఢీ'

ఖతర్ దేశపు రాజధాని దోహా వేదికగా 22వ ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమైంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య ఖతర్‌తో ఈక్వెడార్ తలపడుతుంది. ఖతర్ జాతీయ దినోత్సవం అయిన డిసెంబర్ 18న ఫైనల్ జరుగుతుంది. 2006లో ఆసియా క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత ఖతర్‌లో మరో మెగా క్రీడా సంబరం ఇదే కావడం విశేషం. 2002లో జపాన్-దక్షిణ కొరియా సంయుక్తంగా పోటీలను నిర్వహించిన తర్వాత ఒక ఆసియా దేశంలో 'ఫిఫా' ప్రపంచ కప్ జరగడం ఇది రెండోసారి కాగా... ఒక మధ్యప్రాచ్య దేశం విశ్వ సంరంభానికి వేదిక కావడం ఇదే మొదటిసారి. 32 టీమ్‌లతో నిర్వహించనున్న ఆఖరి వరల్డ్ కప్ ఇదే కానుంది. వచ్చే ఈవెంట్ నుంచి 48 జట్లు బరిలోకి దిగుతాయి. నాలుగేళ్లకు ఒకసారి జరిగే ప్రతీ ప్రపంచకప్ సాధారణంగా జూన్-జూలైలో నిర్వహిస్తారు. అయితే ఆ సమయంలో 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఈ ఎడారి దేశంలో నిర్వహణ సాధ్యం కాదని 'ఫిఫా' మరో ప్రత్యామ్నాయాన్ని సూచించింది. పలు చర్చోపచర్చలు, ఒప్పందాల్లో సవరణలు, వివిధ దేశాల్లో జరిగే ఫుట్‌బాల్ లీగ్‌ల షెడ్యూల్‌లో మార్పులు చేస్తూ చివరకు దానిని నవంబర్-డిసెంబర్‌కు మార్చారు. అయితే ఈ సమయంలో కూడా వేదికలను సాధ్యమైనంత చల్లగా ఉంచేందుకు నిర్వాహక కమిటీ పలు కొత్త సాంకేతికలను ఉపయోగించి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 2018లో విజేతగా నిలిచిన ఫ్రాన్స్ ఈసారి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది.



FIFA WORLD CUP Qatar2022

• మొత్తం 8 వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. వరల్డ్ కప్ ట్రోఫీని, 8 వేదికలను గుర్తు చేయడంతో పాటు ఎప్పటికీ శాశ్వతం అన్నట్లుగా గణిత సంజ్ఞ 'ఇన్ఫినిటీ'ని కలుపుతూ టోర్నీ లోగోను నిర్వాహకులు తయారు చేశారు.

మహిళా రిఫరీలు...



పురుషుల ప్రపంచకప్‌లో మహిళా రిఫరీలను నియమించడం ఇదే తొలిసారి కావడం మరో విశేషం. స్టెఫానీ ఫ్రాపర్ట్ (ఫ్రాన్స్), సలీమా ముకసంగా (రువాండా), యోషిమి యమషిత (జపాన్) ఆ అరుదైన అవకాశం దక్కించుకున్నారు. ఈ ముగ్గురితో పాటు మరో ముగ్గురు మహిళలకు అసిస్టెంట్ రిఫరీలుగా కూడా తొలిసారి అవకాశం దక్కింది.

'ఖతర్'నాక్ నిబంధనలు!

అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, ఆస్ట్రేలియాలతో పోటీ పడి 2010లో ఖతర్ నిర్వాహక హక్కులు దక్కించుకుంది. వైశాల్యంపరంగా చూస్తే ప్రపంచకప్ నిర్వహణ హక్కులు దక్కించుకున్న అతి చిన్న దేశం ఇది. గతంలో ఒక్కసారి కూడా వరల్డ్ కప్‌లో పాల్గొనకుండా నిర్వహణ హక్కులు తీసుకున్న రెండో దేశం ఖతర్ (జపాన్ 2002లో కోసం 1996లోనే హక్కులు కేటాయించారు. అయితే నిర్వహణకు ముందు ఆ జట్టు 1998 టోర్నీకి క్వాలిఫై అయింది). ఈ క్రమంలో పెద్ద ఎత్తున వివాదాలు కూడా వెంట వచ్చాయి. తగినన్ని అర్హత ప్రమాణాలు లేకపోయినా... 'ఫిఫా' అధికారులు విపరీతమైన అవినీతికి పాల్పడి హక్కులు కేటాయించినట్లుగా విమర్శలు వచ్చాయి. విచారణలో అది వాస్తవమని కూడా తేలి చాలా మంది నిషేధానికి కూడా గురయ్యారు కానీ అప్పటికే ఏర్పాట్లు జోరుగా ఉండటంతో వెనక్కి తీసుకునే అవకాశం లేకుండా పోయింది. స్టేడియాల నిర్మాణంలో 6 వేలకు పైగా కార్మికులు మరణించారని, మానవ హక్కులకు తీవ్ర భంగం కలిగిందని కూడా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. అయితే ఎన్ని జరిగినా... చివరకు ఆట మాత్రం ముందుకు వెళ్లింది. అయితే ఇప్పుడు సరిగ్గా మెగా ఈవెంట్ సమయంలో ఆ దేశపు నిబంధనలు అటు 'ఫిఫా' అధికారులను, ఇటు ప్రపంచవ్యాప్త అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశ న్యాయవ్యవస్థ మొత్తం 'షరియా' ఆధారంగా ఉండటంతో అందరికీ ఇది కొత్తగా అనిపిస్తోంది. కానీ నిబంధనలు మాత్రం కఠినంగా ఉండటంతో పాటు ఉల్లంఘిస్తే శిక్షలు కూడా కఠినమే. భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా ఇందులో ఉన్నాయి.



• ముందుగా 'హయ్యా' కార్డును తీసుకోవాలి. ఆ దేశపు 'వీసా', మ్యాచ్ టికెట్ ఉన్నా సరే... హయ్యా కార్డు ఉంటేనే ఎక్కడికైనా వెళ్లేందుకు అనుమతిస్తారు. రవాణా సౌకర్యం వాడుకునేందుకు కూడా ఇది అవసరం.

• స్టేడియం పరిసరాల్లో ఆల్కహాల్ నిషేధం.. బీర్లకు కూడా అనుమతి లేదు. దీని వల్ల సుదీర్ఘకాలంగా తమకు స్పాన్సర్‌గా ఉన్న ప్రఖ్యాత కంపెనీ 'బడ్‌వైజర్'తో 'ఫిఫా'కు ఒప్పంద ఉల్లంఘన సమస్య వచ్చింది. దీనిని సరిదిద్దేందుకు వారికి తలప్రాణం తోకకు వచ్చింది. చివరగా



స్టేడియాలకు కొద్ది దూరంలో 'ఫ్యాన్ ఫెస్టివల్' జోన్‌లు ఏర్పాటు చేసి అక్కడ తాగేందుకు అనుమతినిచ్చారు. అయితే ఎవరైనా తాగి గ్రౌండ్‌లోకి వచ్చి ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే మాత్రం దేశం నుంచి బయటకు పంపించేస్తారు.

• ఇష్టమున్నట్లుగా దుస్తులు ధరిస్తే కుదరదు. భుజాలు, మోకాళ్లు కనిపించేలా మహిళల దుస్తులు ఉండరాదు. పబ్లిక్ బీచ్‌లలో స్విమ్‌సూట్‌లు ధరించరాదు. అది హోటల్ స్విమ్మింగ్‌పూల్‌లకే పరిమితం. మైదానంలో ఉత్సాహంతో షర్ట్‌లు తొలగించడం కూడా కుదరదు. స్పెషల్ జూమ్ కెమెరాలతో వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటారు.

• భార్యాభర్తలైనా సరే, బహిరంగ ప్రదేశాల్లో రూపంలో కూడా తమ ప్రేమను ప్రదర్శించరాదు. హోమో సెక్సువల్స్‌కైతే అసలే కలిసి ఉండేందుకు అనుమతి లేదు.

విజేత జట్టుకు రూ. 341 కోట్లు

ప్రపంచకప్ మొత్తం ప్రైజ్‌మనీ 440 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 3,500 కోట్లు) కాగా... విజేతలకు 42 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 341 కోట్లు), రన్నరప్‌కు 30 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 244 కోట్లు) లభిస్తాయి.

• వరల్డ్ కప్‌లో జట్లు ఒక్కో మ్యాచ్ నుంచి మరో మ్యాచ్ కోసం విమానాల్లో ప్రయాణించే అవసరం లేకుండా వెళ్లేలా వేదికలు ఉండటం 1930 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. ఎనిమిది స్టేడియాలు, ప్రాక్టీస్ మైదానాలన్నీ 10 కిలోమీటర్ల పరిధిలో ఉండటమే ఇందుకు కారణం. ప్రతీ జట్టు తమకు ప్రాక్టీస్ కోసం కేటాయించిన ఒకే బేస్ క్యాంప్‌లోనే టోర్నీ మొత్తం సాధన చేస్తుంది.

'ఫిఫా' ప్రపంచకప్-2022 షెడ్యూల్

మ్యాచ్	తేదీ	ఎవరితో ఎవరు	సమయం (భారత కాలమానం ప్రకారం)
1	నవంబర్ 20	ఖతర్ X ఈక్వెడార్	రాత్రి గం. 9:30 నుంచి
2	నవంబర్ 21	ఇంగ్లండ్ X ఇరాన్	సాయంత్రం గం. 6:30 నుంచి
3	నవంబర్ 21	నెదర్లాండ్స్ X సెనెగల్	రాత్రి గం. 9:30 నుంచి
4	నవంబర్ 21	వేల్స్ X అమెరికా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
5	నవంబర్ 22	అర్జెంటీనా X సౌదీ అరేబియా	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
6	నవంబర్ 22	డెన్మార్క్ X ట్యునీషియా	సాయంత్రం గం. 6:30 నుంచి
7	నవంబర్ 22	మెక్సికో X పోలాండ్	రాత్రి గం. 9:30 నుంచి
8	నవంబర్ 22	ఫ్రాన్స్ X ఆస్ట్రేలియా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
9	నవంబర్ 23	క్రొయేషియా X మొరాకో	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
10	నవంబర్ 23	జర్మనీ X జపాన్	సాయంత్రం గం. 6:30 నుంచి
11	నవంబర్ 23	స్పెయిన్ X కోస్టారికా	రాత్రి గం. 9:30 నుంచి
12	నవంబర్ 23	బెల్జియం X కెనడా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
13	నవంబర్ 24	స్విట్జర్లాండ్ X కామెరూన్	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
14	నవంబర్ 24	ఉరుగ్వే X దక్షిణ కొరియా	సాయంత్రం గం. 6:30 నుంచి
15	నవంబర్ 24	పోర్చుగల్ X ఘనా	రాత్రి గం. 9:30 నుంచి
16	నవంబర్ 24	బ్రెజిల్ X సెర్బియా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
17	నవంబర్ 25	ఇరాన్ X వేల్స్	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
18	నవంబర్ 25	ఖతర్ X సెనెగల్	సాయంత్రం గం. 6:30 నుంచి
19	నవంబర్ 25	నెదర్లాండ్స్ X ఈక్వెడార్	రాత్రి గం. 9:30 నుంచి
20	నవంబర్ 25	ఇంగ్లండ్ X అమెరికా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
21	నవంబర్ 26	ఆస్ట్రేలియా X ట్యునీషియా	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
22	నవంబర్ 26	పోలాండ్ X సౌదీ అరేబియా	సాయంత్రం గం. 6:30 నుంచి
23	నవంబర్ 26	ఫ్రాన్స్ X డెన్మార్క్	రాత్రి గం. 9:30 నుంచి
24	నవంబర్ 26	అర్జెంటీనా X మెక్సికో	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
25	నవంబర్ 27	జపాన్ X కోస్టారికా	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
26	నవంబర్ 27	బెల్జియం X మొరాకో	సాయంత్రం గం. 6:30 నుంచి
27	నవంబర్ 27	క్రొయేషియా X కెనడా	రాత్రి గం. 9:30 నుంచి
28	నవంబర్ 27	జర్మనీ X స్పెయిన్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
29	నవంబర్ 28	కామెరూన్ X సెర్బియా	మధ్యాహ్నం గం. 3:30 నుంచి
30	నవంబర్ 28	దక్షిణ కొరియా X ఘనా	సాయంత్రం గం. 6:30 నుంచి
31	నవంబర్ 28	బ్రెజిల్ X స్విట్జర్లాండ్	సాయంత్రం గం. 6:30 నుంచి
32	నవంబర్ 28	పోర్చుగల్ X ఉరుగ్వే	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
33	నవంబర్ 29	ఈక్వెడార్ X సెనెగల్	రాత్రి గం. 8:30 నుంచి
34	నవంబర్ 29	నెదర్లాండ్స్ X ఖతర్	రాత్రి గం. 8:30 నుంచి
35	నవంబర్ 29	ఇరాన్ X అమెరికా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
36	నవంబర్ 29	ఇంగ్లండ్ X వేల్స్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
37	నవంబర్ 30	డెన్మార్క్ X ఆస్ట్రేలియా	రాత్రి గం. 8:30 నుంచి
38	నవంబర్ 30	ఫ్రాన్స్ X ట్యునీషియా	రాత్రి గం. 8:30 నుంచి
39	నవంబర్ 30	అర్జెంటీనా X పోలాండ్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
40	నవంబర్ 30	మెక్సికో X సౌదీ అరేబియా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
41	డిసెంబర్ 1	కెనడా X మొరాకో	రాత్రి గం. 8:30 నుంచి
42	డిసెంబర్ 1	బెల్జియం X క్రొయేషియా	రాత్రి గం. 8:30 నుంచి
43	డిసెంబర్ 1	జర్మనీ X కోస్టారికా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
44	డిసెంబర్ 1	స్పెయిన్ X జపాన్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
45	డిసెంబర్ 2	ఘనా X ఉరుగ్వే	రాత్రి గం. 8:30 నుంచి
46	డిసెంబర్ 2	పోర్చుగల్ X దక్షిణ కొరియా	రాత్రి గం. 8:30 నుంచి
47	డిసెంబర్ 2	బ్రెజిల్ X కామెరూన్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
48	డిసెంబర్ 2	సెర్బియా X స్విట్జర్లాండ్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి

నాకౌట్ దశ (ప్రిక్వార్టర్ ఫైనల్స్)

మ్యాచ్	తేదీ	ఎవరితో ఎవరు	సమయం
49	డిసెంబర్ 3	1ఎ X 2బి	రాత్రి గం. 8:30 నుంచి
50	డిసెంబర్ 3	1సి X 2డి	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
51	డిసెంబర్ 4	1డి X 2సి	రాత్రి గం. 8:30 నుంచి
52	డిసెంబర్ 4	1బి X 2ఎ	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
53	డిసెంబర్ 5	1ఇ X 2ఎఫ్	రాత్రి గం. 8:30 నుంచి
54	డిసెంబర్ 5	1జి X 2హెచ్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
55	డిసెంబర్ 6	1ఎఫ్ X 2ఇ	రాత్రి గం. 8:30 నుంచి
56	డిసెంబర్ 6	1హెచ్ X 2జి	అర్ధరాత్రి గం. 12:30 నుంచి

క్వార్టర్ ఫైనల్స్

మ్యాచ్	తేదీ	ఎవరితో ఎవరు	సమయం
57	డిసెంబర్ 9	53 విజేత X 54 విజేత	రాత్రి గం. 8:30
58	డిసెంబర్ 9	49 విజేత X 50 విజేత	అర్ధరాత్రి గం. 12:30
59	డిసెంబర్ 10	55 విజేత X 56 విజేత	రాత్రి గం. 8:30
60	డిసెంబర్ 10	52 విజేత X 51 విజేత	అర్ధరాత్రి గం. 12:30

సెమీఫైనల్స్

మ్యాచ్	తేదీ	ఎవరితో ఎవరు	సమయం
61	డిసెంబర్ 13	57 విజేత X 58 విజేత	అర్ధరాత్రి గం. 12:30
62	డిసెంబర్ 14	59 విజేత X 60 విజేత	అర్ధరాత్రి గం. 12:30

మూడో స్థానం కోసం ప్లే ఆఫ్

మ్యాచ్	తేదీ	ఎవరితో ఎవరు	సమయం
63	డిసెంబర్ 17	61 పరాజిత X 62 పరాజిత	రాత్రి గం. 8:30

ఫైనల్

మ్యాచ్	తేదీ	ఎవరితో ఎవరు	సమయం
64	డిసెంబర్ 18	61 విజేత X 62 విజేత	రాత్రి గం. 8:30

ఏ గ్రూప్‌లో ఎవరంటే...

'ఎ': ఖతర్, ఈక్వెడార్, సెనెగల్, నెదర్లాండ్స్
'బి': ఇంగ్లండ్, ఇరాన్, అమెరికా, వేల్స్
'సి': అర్జెంటీనా, సౌదీ అరేబియా, మెక్సికో, పోలాండ్
'డి': ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, ట్యునీషియా
'ఇ': జర్మనీ, స్పెయిన్, కోస్టారికా, జపాన్
'ఎఫ్': బెల్జియం, క్రొయేషియా, కెనడా, మొరాకో
'జి': బ్రెజిల్, సెర్బియా, స్విట్జర్లాండ్, కామెరూన్
'హెచ్': పోర్చుగల్, ఉరుగ్వే, ఘనా, దక్షిణ కొరియా

మ్యాచ్‌లను స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు



హార్దిక్ విలియమ్సన్

నేడు భారత్, కివీస్ రెండో టి20

మధ్యాహ్నం గం. 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రత్యక్ష ప్రసారం

మౌంట్ మాంగనుయ్: తొలి టి20 మ్యాచ్ వర్షార్పణం కావడంతో... సిరీస్‌లో తొలి విజయమే లక్ష్యంగా నేడు జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ తలపడనున్నాయి. ప్రపంచకప్‌లో సెమీఫైనల్లో నిష్క్రమించాక భారత్ ఆడుతున్న తొలి సిరీస్ ఇదే కావడంతో యువ ఆటగాళ్లపై అందరి దృష్టి ఉంది. హార్దిక్ పాండ్యా నాయకత్వంలో బరిలోకి దిగనున్న భారత్ ఎలాంటి వ్యూహాలను అమలు చేస్తుందో చూడాలి. శుబ్‌మన్ గిల్‌కు జతగా ఓపెనర్ ఇషాన్ కిషన్ లేదా రిషభ్ పంత్‌లలో ఒకరు వచ్చే అవకాశముంది. మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ రాణిస్తే భారత్ భారీ స్కోరు చేసే అవకాశముంటుంది. బౌలర్లలో భువనేశ్వర్‌తోపాటు అర్ష్‌దీప్, హర్షల్ పటేల్ బరిలోకి దిగడం ఖాయం. మరోవైపు ఓపెనర్లు కాన్వే, అలెన్ శుభారంభం అందిస్తే... విలియమ్సన్, ఫిలిప్స్, మిచెల్ మెరుపులతో న్యూజిలాండ్ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే చాన్స్ ఉంటుంది.

తెలుగు టైటాన్స్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: వరుసగా 11 పరాజయాల తర్వాత ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు రెండో విజయం అందుకుంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 32-26తో యు ముంబాను ఓడించింది. టైటాన్స్ తరఫున సిద్ధార్థ్ దేశాయ్ తొమ్మిది పాయింట్లు, అభిషేక్ ఐదు పాయింట్లు, విశాల్ భరద్వాజ్ నాలుగు పాయింట్లు స్కోరు చేశారు. యు ముంబా తరఫున గుమన్ సింగ్ ఎనిమిది పాయింట్లతో రాణించాడు. ఇతర మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీ 30-27తో పట్నా పైరేట్స్‌పై... జైపూర్ పింక్ పాంథర్స్ 42-29తో యూపీ యోధాస్‌పై గెలిచాయి.

సినిమా



● అల్లు అరవింద్, వరుణ్, కృతీ

ఆ ఎల్లలను తీసేశాం - అల్లు అరవింద్

''బాహుబలి' తర్వాత సౌత్, నార్త్ అనే ఎల్లలను తీసేశాం. నార్త్ సినిమా బాగుంటే సౌత్‌లో, దక్షిణాది సినిమా బాగుంటే నార్త్‌లో బాగా చూస్తున్నారు. అలాగే మంచి సినిమాలను ఆదరించడం అనేది ఇక్కడ ఓ సంస్కృతిగా మారిపోయింది. ఇందుకు తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. 'భేదియా' ట్రైలర్ బాగుంది. సినిమా కూడా కొంత చూశాను. హిట్టవుతుందనిపించింది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. వరుణ్ ధావన్, కృతీ సనన్ జంటగా అమర్ కౌశిక్ దర్శకత్వంలో దినేష్ విజన్ నిర్మించిన హిందీ చిత్రం 'భేదియా'. ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. 'తోడేలు' టైటిల్‌తో గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ ధావన్ మాట్లాడుతూ– ''ఓ దర్శకుడి (డేవిడ్ ధావన్) కొడుకుగా నా బ్లడ్‌లోనే సినిమా ఉంది. త్వరలోనే నేను తెలుగులో ఓ సినిమా చేసి, దాన్ని హిందీలో రీమేక్ చేస్తా'' అన్నారు.

సుమన్‌కు కాంతారావు అవార్డు

ప్రముఖ నటులు కాంతారావు శతజయంతి పురస్కార సభ డిసెంబరులో రవీంద్ర భారతి వేదికగా ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో జరగనుంది. నటుడు సుమన్‌కు ఈ పురస్కారం అందజేయనున్నారు. శనివారం ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో దర్శక-నిర్మాత, నటుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ – ''ఎన్టీఆర్, ఏయన్నార్‌గార్లు అగ్రహీరోలుగా ఉన్న టైమ్‌లోనే వారికి దీటుగా కాంతారావు నిలబడ్డారు'' అన్నారు. ''కాంతారావుగారి బయోపిక్ కోసం పరిశోధన చేస్తున్నాం'' అన్నారు దర్శకుడు పీసీ ఆదిత్య. దర్శకుడు రేలంగి నరసింహారావు, ఫిక్కీ సీఎండీ అచ్యుత జగదీష్ చంద్ర, కాంతారావు కుమారుడు, నటుడు రాజా పాల్గొన్నారు.



● కాంతారావు, సుమన్



● విజయ్ ● అజిత్

వివాదంలో అనువాదం

అనువాద చిత్రాల వివాదం ముదిరేలా కనబడుతోంది. కరోనా తర్వాత ఏర్పడిన పరిస్థితుల కారణంగా నిర్మాణ వ్యయాన్ని తగ్గించే విషయమై, ఇతర సమస్యల గురించి చర్చలు జరపడానికి ఆ మధ్య తెలుగు సినిమాల షూటింగ్స్‌ను నిలిపివేసిన విషయం తెలిసిందే. కానీ ఆ సమయంలో 'వారిసు' (తెలుగులో 'వారసుడు') సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరిగిందనే టాక్ వినిపించింది. అయితే 'వారిసు' తమిళ సినిమా కాబట్టి షూటింగ్ ఆపలేదని 'దిల్' రాజు పేర్కొన్నట్లుగా వార్తలు వచ్చాయి. దీంతో 'వారిసు' తమిళ సినిమాయే అనే ముద్ర పడిపోయింది. విజయ్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వారిసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. కాగా సంక్రాంతి సందర్భంగానే నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' చిత్రాలు విడుదలకు రెడీ అవుతున్నాయి. అలాగే అనిల్ సుంకర నిర్మించిన 'ఏజెంట్' సంక్రాంతి రిలీజ్‌కే ముస్తాబు అయ్యింది. వీటితో పాటు తమిళంలో అజిత్ 'తునివు' కూడా సంక్రాంతి రిలీజ్‌కే రెడీ అవుతోంది. దాంతో సంక్రాంతికి రిలీజ్ అయ్యే సినిమాల థియేటర్ల సంఖ్య గురించిన అంశాలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో సంక్రాంతి, దసరా పండగ సమయాల్లో తెలుగు సినిమాలకు ప్రాధాన్యత ఇచ్చి, ఆ తర్వాత అనువాద చిత్రాలకు థియేటర్స్ కేటాయించాలన్నట్లుగా తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఓ నోట్‌ను రిలీజ్ చేసింది. ఈ విషయంపై కొందరు తమిళ దర్శక-నిర్మాతలు అసహనంగా ఉన్నారని టాక్. ఒకవేళ తెలుగులో అనువాద చిత్రాలకు థియేటర్లు ఇచ్చే పరిస్థితి లేకపోతే తమిళంలోనూ తెలుగు చిత్రాలకు థియేటర్లు కేటాయించ కూడదన్నట్లుగా కోలీవుడ్‌లో చర్చలు జరుగుతున్నాయట. మరోవైపు సంక్రాంతి, దసరా సీజన్స్‌లో డబ్బింగ్ సినిమాల విడుదలను ఆపడం అనేది జరిగే పని కాదని 'తోడేలు' ఈవెంట్‌లో అల్లు అరవింద్ పేర్కొన్నారు. ''డబ్బింగ్ సినిమాల రిలీజ్‌లను ఆపాలని మేం ఎక్కడా చెప్పలేదు. సంక్రాంతి, దసరా సీజన్స్‌లో తొలి ప్రాధాన్యత తెలుగు చిత్రాలకు ఇవ్వాలని ఎగ్జిబిటర్స్‌ను కోరుతూ లేఖ రాశాం'' అని నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.



● దిల్ రాజు, అనిల్, రాధిక, రవీనా, ఇవానా, ప్రదీప్

అందుకే డబ్ చేశాం - దిల్ రాజు

ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'లవ్ టుడే'. ఇవాన హీరోయిన్‌గా, రవీనా కీలక పాత్రలో నటించారు. ఈ నెల 4న తమిళంలో విడుదలైన ఈ చిత్రం మంచి విజయం సాధించింది. ఈ సినిమాను అదే టైటిల్‌తో 'దిల్' రాజు తెలుగులో ఈ నెల 25న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన 'లవ్ టుడే' ఆడియో, ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకులు వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, నటి రాధికా శరత్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''చిన్న సినిమాగా విడుదలైన 'లవ్ టుడే' యాభై కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. తమిళ ట్రైలర్ చూసి రీమేక్ ఆలోచన వచ్చింది. కానీ మ్యాజిక్ మిస్సవుతుందేమోనని తెలుగులో డబ్ చేశాం'' అన్నారు. ''తమిళంలోలానే ఈ చిత్రం తెలుగులోనూ పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు ప్రదీప్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

మునిసిపల్ హెడ్మాస్టర్లకు డీడీవో పవర్స్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మునిసిపల్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్) అధికారాలను కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి జీవో-180 విడుదల చేసింది. ఎన్నో ఏళ్లుగా మునిసిపల్ స్కూళ్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తుండగా ప్రభుత్వం నెరవేర్చింది. ప్రభుత్వ నిర్ణయంపై మునిసిపల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. 1996లోనే జెడ్పీ ప్రధానోపాధ్యాయులకు డీడీవో అధికారాలు కల్పించారు. ఇంతకుముందు జీవో-40కు సవరణ చేసి మునిసిపల్ హెడ్మాస్టర్లకు విద్యాపరమైన అధికారాలు ఇచ్చి ఆర్థికపరమైన అధికారాలను తొక్కిపెట్టారు. దీంతో 20 ఏళ్లపాటు మునిసిపల్ టీచర్లు నరకం అనుభవించారు. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులతో వారి సమస్యకు పరిష్కారం లభించింది.

జీతాలను వారే డ్రా చేయొచ్చు

మునిసిపల్ ప్రధానోపాధ్యాయులకు డీడీవో పవర్స్ ఇవ్వడం వల్ల ఈ నెల నుంచి ఉపాధ్యాయుల జీతాలను వారే డ్రా చేసే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలోని 334 పురపాలక హైస్కూళ్లలో పని చేస్తున్న 3 వేలకు పైగా ఉపాధ్యాయుల జీతాల కష్టాలు తప్పుతాయి. ప్రతి నెల జీతాలు, లీవ్ ఎరియర్స్ , పీరియాడికల్ ఇంక్రిమెంట్లు, 6, 12, 18, 24 సంవత్సరాల ఇంక్రిమెంట్లు, మెడికల్ ఎరియర్స్, పెన్షన్ బకాయిలకు సంబంధించిన అంశాలపైనా మునిసిపల్ హైస్కూళ్ల హెడ్మాస్టర్లకు అధికారాలు దక్కుతాయి.

ఉపాధ్యాయ సంఘాల కృతజ్ఞతలు

మునిసిపల్ ఉపాధ్యాయుల చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

హరిత నగరాలకు సొంత మొక్కలు

రాష్ట్రంలో మూడుచోట్ల ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ సొంత నర్సరీలు

- కొన్ని యూఎల్బీల్లో ధరల వ్యత్యాసాన్ని గుర్తించిన గ్రీనింగ్ కార్పొరేషన్
- ఏపీజీబీసీ నిర్ణయించిన ధరలు తక్కువని ముందుకురాని కాంట్రాక్టర్లు
- మొదటి విడతలో 45 యూఎల్బీల్లో సుందరీకరణ పనులు
- మిగిలిన 78 యూఎల్బీలకు సొంత మొక్కలే సరఫరా

సాక్షి, అమరావతి: నగరాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న హరిత నగరాలకు అవసరమైన మొక్కలను సొంతంగా అభివృద్ధి చేయనున్నారు. అందుకోసం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మూడుచోట్ల నిర్వహిస్తున్న నర్సరీల్లో అవసరమైన మొక్కలను పెంచుతోంది. మొదటి విడతగా జూలై నెలలో 45 నగరాలు, పట్టణాల్లో సుందరీకరణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, గ్రీనింగ్ కార్పొరేషన్ సొంతంగా పనులు చేపట్టిన 11 యూఎల్బీల్లో మినహా, సొంతంగా పనులు చేపట్టిన మిగిలిన యూఎల్బీల్లో మొక్కల ధరల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. గ్రీనింగ్ కార్పొరేషన్ నిర్ణయించిన ధరలు గిట్టుబాటు కావంటూ.. నాలుగైదు పర్యాయాలు టెండర్లు పిలిచినా కొన్ని మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఐదోసారి ఇటీవల ఈ పట్టణాలకు మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో హరిత ప్రాజెక్టు చేపట్టినా అవసరమైన మొక్కలు ఒకే ధరకు లభించేలా, మార్కెట్ ధర కంటే తక్కువకే అందించేలా చర్యలు చేపట్టారు. అందుకోసం గ్రీనింగ్ కార్పొరేషన్ నర్సరీల నుంచే మొక్కలు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు శ్రీకాళహస్తి, సింహాచలం, విజయవాడ (నున్న) ప్రాంతాల్లోని నర్సరీలను సిద్ధం చేశారు. హరిత నగరాల్లో మొత్తం 54 రకాల మొక్కల జాతులను ఎంపిక చేసి నాటుతున్నారు. మరో మూడు, నాలుగు నెలల్లో 78 యూఎల్బీల్లో చేపట్టనున్న జగనన్న హరిత నగరాల్లో వీటిని నాటనున్నారు.



సింహాచలం వద్ద ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

అధిక ధరలకు చెక్ పెట్టిన గ్రీనింగ్ కార్పొరేషన్

సాధారణంగా పట్టణాల్లో గ్రీనింగ్ పనులను ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు సొంతంగా చేపట్టేవి. మొక్కల ధరలు కూడా స్థానికంగానే నిర్ణయించేవారు. దీనివల్ల ఒక్కో యూఎల్బీలో మొక్కల ధరలో భారీ వ్యత్యాసం ఉండేది. అయితే, జూలైలో 45 నగరాల్లో హరిత కార్యక్రమాలు చేపట్టారు. అంతకు నెలరోజుల ముందే ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ అధికారులు నర్సరీ రైతుల నుంచి సీల్డ్ కవర్లలో మొక్కల ధరలను సేకరించారు. వాటిలో తక్కువగా ఉన్న ధరలను ప్రామాణికంగా తీసుకుని, మొక్కల రవాణాలో జరిగే నష్టానికి ఐదు శాతం ధర కలిపి కాంట్రాక్టర్‌కు లాభదాయకంగా ఉండేలాగా ధరలను నిర్ణయించారు. ఈ విధంగా మొత్తం 14 యూఎల్బీల్లో చేపట్టే పనులకు మొక్కల రేట్లు ఒకేలా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అయితే, వీటిలో 11 యూఎల్బీల్లో పనులు ప్రగతిలో ఉండగా, ఎమ్మిగనూరు, బాపట్ల, పాలకొల్లు యూఎల్బీల్లో గ్రీనింగ్ పనులు చేపట్టలేదు. వీటికి నాలుగు దఫాలుగా టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాకపోగా, స్థానిక అధికారులు సైతం చొరవ చూపలేదు. మిగిలిన 31 యూఎల్బీలు సొంతంగా టెండర్లు పిలిచి, వారు నిర్ణయించిన ధరకు మొక్కలు కొనుగోలు చేశారు. ఈ ధరలు గ్రీనింగ్ కార్పొరేషన్ నిర్ణయించిన ధరలకంటే అధికంగా ఉండడం గమనార్హం. ఇకపై అలాంటి ధరల వ్యత్యాసం, బయటి నుంచి మొక్కలు కొనుగోలు చేసే అవకాశం లేకుండా ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ సొంతంగా హరిత నగరాలకు అవసరమైన మొక్కల పెంపకాన్ని చేపడుతోంది. రెండో విడత జగనన్న హరిత నగరాలకు అవసరమైన 54 రకాల మొక్కలను గ్రీనింగ్ కార్పొరేషన్ నర్సరీల నుంచే సరఫరా చేయాలని నిర్ణయించారు.

కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం

- మంత్రి విడదల రజిని
- ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో పలు తండాల పరిశీలన
- అక్కడే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశం
- అవసరమైన వారికి విజయవాడలో వైద్యం అందిస్తామని ప్రకటన
- రూ. 38 కోట్లతో మండలానికి స్వచ్ఛమైన నీరు ఇస్తామని వెల్లడి



కిడ్నీ రోగులకు ప్రత్యేక వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: కిడ్నీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించారు. కృష్ణారావుపాలెం శివారు మాన్‌సింగ్, దీప్లా నగర్, గిరిజన తండాల్లోని కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శించారు. వ్యాధి సోకటానికి కారణాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్, పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా స్థానిక పీహెచ్‌సీలో స్క్రీనింగ్ టెస్టులు చేయిస్తామని చెప్పారు. అవసరమైన వారికి విజయవాడలో 12 ప్రైవేటు ఆసుపత్రుల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి, మందులు కూడా ఇస్తామని తెలిపారు. రోగుల కోసం శనివారం నుంచి ఇక్కడ ఒక వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. స్థానిక పీహెచ్‌సీలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 104 వాహనం ద్వారా ప్రతి నెలా కిడ్నీ రోగులకు మందులు అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఐదు తండాల్లో తాత్కాలికంగా ట్యాంకర్లతో తాగునీరు అందిస్తున్నామని, త్వరలో మరో 15 తండాల్లో రూ. 6 కోట్లతో పైపులైన్ల ద్వారా తాగునీరిస్తామని చెప్పారు. ఈ మండలానికి స్వచ్ఛమైన తాగు నీరు అందించడం కోసం రూ.38 కోట్లతో కృష్ణా జలాలను ఇంటింటికి అందిస్తామని, దీనికి టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం కిడ్నీ రోగుల కోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.రక్షణనిధి,తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం కిడ్నీ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. గుంటూరులో శనివారం జరిగిన నెఫ్రాలజిస్టుల రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణాలపై ఐసీఎంఆర్‌తో కలిసి పరిశోధనలు చేసినట్లు చెప్పారు. నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వాడటం, తాగే నీటిలో సిలికాన్, హెవీ మెటల్స్ ఎక్కువగా ఉండటం, ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం కారణాలని తేలిందన్నారు. ఉద్దానంతో పాటు, ఎ.కొండూరులో కూడా కిడ్నీ కేసులు వెలుగులోకి వచ్చాయని, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు.

క్లుప్తంగా

బీఎస్సీ నర్సింగ్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సర్వీస్, నాన్ సర్వీస్ సీట్ల భర్తీకి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్ సీట్లు కేటాయింపు జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసింది. సర్వీస్ సీట్లు 22కు గాను 17, నాన్ సర్వీస్ సీట్లు 826కు గాను 492 భర్తీ అయ్యాయి. విద్యార్థులు తమకు కేటాయించిన సీట్లలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోగా రిపోర్ట్ చేయాలని విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది.

మధ్యాహ్న భోజన పథకం అమలుపై విజి'లెన్స్'

రాష్ట్రంలో 54 పాఠశాలల్లో క్షేత్రస్థాయి తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం (జగనన్న గోరుముద్ద) అమలు తీరుపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాష్ట్రంలో 54 పాఠశాలల్లో విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేశాయి. చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో), జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)లు క్షేత్రస్థాయిలో పరిశీలించడంలేదని గుర్తించారు. కొన్ని చోట్ల సరుకుల్లో, నిల్వల్లో తేడాలున్నట్లు పసిగట్టారు. వీటన్నింటినీ ప్రభుత్వానికి నివేదించనున్నారు.

నా బిడ్డ ప్రాణాలు నిలిపిన జగనన్న

చిన్నారి హని తండ్రి రాంబాబు


పాదయాత్ర చేస్తున్న రాంబాబు

కోవూరు (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): 'నా బిడ్డ హనికి వచ్చిన అరుదైన గాకర్స్ వ్యాధి చికిత్సకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి రూపాయలు మంజూరు చేయించి ప్రాణాలు నిలిపారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం' అంటున్నారు కోనసీమ జిల్లా అల్లవరం మండలానికి చెందిన కొప్పాడ రాంబాబు. జూలై 26న కోనసీమ జిల్లా వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వచ్చిన సీఎం జగన్.. చిన్నారికి వచ్చిన వ్యాధి విషయం తెలుసుకుని చలించిపోయారు. కోటి రూపాయలు మంజూరు చేయించడంతో పాటు తక్షణమే రూ.10 లక్షలు విలువ చేసే ఇంజెక్షన్‌లను అమెరికా నుంచి తెప్పించి చికిత్స చేయించారు. తన బిడ్డకు ఆరోగ్యం కుదుటపడితే తిరుమలకు పాదయాత్ర చేస్తామని రాంబాబు మొక్కుకున్నారు. చిన్నారి కోలుకోవడంతో తన బావమరిదితో కలిసి ఈ నెల 7న పాదయాత్రగా బయలుదేరారు. శనివారం వారి పాదయాత్ర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరుకు చేరుకుంది.

తిరునగరిలో కళా సంబరం


కళా సంబరాలను ప్రారంభిస్తున్న నారాయణస్వామి, చిత్రంలో రోజా, భూమన, గురుమూర్తి, వంగపండు ఉష

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తలపెట్టిన 'జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు' శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీలను ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాకారుల కుటుంబాలు బాగా చదువుకుని విద్యావంతులు కావాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష అని చెప్పారు. జగనన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్వర్ణోత్సవ సంబరాలకు శ్రీకారం చుట్టిన మంత్రి ఆర్కే రోజాకు అభినందనలు తెలిపారు.

కళా రంగం నుంచే వచ్చా: రోజా

మంత్రి రోజా మాట్లాడుతూ.. తిరుపతిలో పుట్టిన తనకు కళారంగంలో వచ్చిన పేరు ప్రఖ్యాతులే రాజకీయాల్లో రాణించడానికి దోహదం చేశాయన్నారు. కళాకారులకు అండగా నిలుస్తూ కళాకారుల పింఛన్, అమ్మ ఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో గుంటూరు, 29, 30, డిసెంబర్ 1న రాజమండ్రి, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో విశాఖపట్నంలో జోనల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 19, 20 తేదీల్లో విజయవాడలో ఫైన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వంగపండు ఉష, మేయర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల మార్కెట్‌ను కుదిపేస్తున్న 'ఈక్వెడార్'

- బుల్లి దేశం ప్రపంచానికి గట్టి పోటీ
- ఉత్పత్తి పెంచి నాణ్యమైన రొయ్యలు సరఫరా
- ఆరు నెలల్లో 1,150 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి
- యాంత్రీకరణతో తగ్గిపోయిన ఉత్పత్తి వ్యయం
- మన దేశంతో సహా ఇతర దేశాలకంటే అక్కడి రొయ్యల ధర తక్కువ
- నాణ్యత, తక్కువ ధర ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్
- దీంతో మిగతా దేశాల రొయ్యల ధరలు పతనం
- మన రాష్ట్రంలోని రొయ్యలపైనా దాని ప్రభావం


డెల్టాలో సాగు చేస్తున్న వనామి రొయ్య

ఆకివీడు: ఈక్వెడార్.. ఓ బుల్లి దేశం. అంతర్జాతీయంగా రొయ్యల మార్కెట్‌కు పెద్ద దెబ్బే కొట్టింది. మొత్తం ప్రపంచ దేశాలను కుదిపేస్తోంది. నాణ్యతతో కూడిన రొయ్యలను తక్కువ ధరకు ఎగుమతి చేస్తుండటంతో ఇతర దేశాల రొయ్యల ధరలు పడిపోయాయి. ఈ ప్రభావం రాష్ట్రంలోని రొయ్యల ఎగుమతులపైనా పడింది. ధరలు తగ్గిపోయి, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మొత్తం ప్రపంచవ్యాప్తంగా రొయ్యల ఉత్పత్తి 5049.5 మెట్రిక్ టన్నులు. ఇందులో ఇండియా వాటా 700 మెట్రిక్ టన్నులు.మన దేశం నుంచి ప్రాసెసింగ్ జరిగిన రొయ్యలు అమెరికా, చైనా, జపాన్, బంగ్లాదేశ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. ఆ దేశాల్లో ప్యాకింగ్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇటీవలి కాలంలో రొయ్యల సాగులో ఈక్వెడార్ తారాజువ్వలా దూసుకొచ్చింది. గత ఆరు నెలల్లో ఏకంగా 1,150 మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేసింది. దీనిలో 1,010 మెట్రిక్ టన్నులు వనామి, మిగిలినవి టైగర్ రొయ్య. 2021లో ఈక్వెడార్ ఉత్పత్తులు 1,010 మెట్రిక్ టన్నులు మాత్రమే. అయితే, గత ఆరు నెలల్లోనే అక్కడ అంతకు మించి రొయ్యల ఉత్పత్తి జరిగింది. పైగా, ఈక్వెడార్‌లో వేగంగా యాంత్రీకరణ జరిగి, రొయ్యల ఉత్పత్తి వ్యయం బాగా తగ్గింది. ఎకరాకు 50 వేల పిల్లలను మాత్రమే పెంపకానికి వినియోగిస్తారు. ఎగుమతుల ఖర్చు తక్కువ. ఆరు నెలల్లోనే కౌంట్‌కు వస్తున్నాయి. ఈక్వెడార్‌లో తల్లి రొయ్య నుంచి 3 నుంచి 5 సార్లు మాత్రమే సీడ్ తీస్తారు. దీంతో నాణ్యమైన సీడ్ రైతులకు లభిస్తుంది. ఇది వైరస్‌లు, వ్యాధులను తట్టుకుంటుంది. దీంతో ఉత్పత్తి నాణ్యత ఎక్కువగా ఉంది. మన దేశంలో తల్లి రొయ్య నుంచి 10 నుంచి 15 సార్లు సీడ్ తీస్తున్నారు. దీంతో నాసిరకం, ఇమ్యూనిటీ లేని రొయ్య సీడ్ వస్తోంది. దీనినే పెంపకందారులకు సరఫరా చేస్తున్నారు. ఇటువంటి రొయ్యలు వ్యాధులు, వైట్‌గట్ తదితర వైరస్‌ల బారిన పడుతున్నాయి. 30, 40, 50 కౌంట్ రొయ్యల పెంపకానికి మన దేశంలో.. ముఖ్యంగా డెల్టా ప్రాంతాల్లో రూ.250 పైబడి ఖర్చవుతుంది. దీంతో పోలిస్తే ఈక్వెడార్‌లో అన్ని కౌంట్ రొయ్యలు రూ.100 తక్కువకు లభిస్తున్నాయి. దీంతో మన దేశం రొయ్యలకు ఆర్డర్లు తగ్గిపోయాయి. చైనా, అమెరికా దేశాల నుంచి ఆర్డర్లు రావడంలేదని బయ్యర్లు వాపోతున్నారు.

మంచి ధర లభించేలా ప్రభుత్వ చర్యలు..

రొయ్య రైతులను ఆదుకునేందుకు గత రెండు నెలలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. రొయ్య ధరలు తగ్గకుండా చూసేందుకు ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్ యజమానులతో సంప్రదింపులు జరిపేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన సాధికార కమిటీని నియమించింది. నిపుణుల కమిటీని వేసి పరిశీలన జరుపుతోంది. సాధికార కమిటీ నిత్యం రొయ్యల మార్కెట్‌ను సమీక్షిస్తోంది. ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి సంస్థలు, సీడ్, ఫీడ్ ఉత్పత్తిదారులతో సంప్రదింపులు జరుపుతోంది. మేత ధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా నాణ్యమైన రొయ్య ఉత్పత్తికి చర్యలు తీసుకుంది. దీనివల్ల కొద్ది రోజుల్లోనే మన రాష్ట్రంలోని రొయ్యలకు కూడా మంచి డిమాండ్ వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువ.. నాణ్యత ఎక్కువ



అంతర్జాతీయ రొయ్యల మార్కెట్‌లో ఈక్వెడార్ విపరీతంగా పోటీనిస్తోంది. అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువ. నాణ్యత ఎక్కువ. పోటీని తట్టుకునేందుకు మన దేశంలో నాణ్యమైన రొయ్య సీడు రైతులకు అందజేయాలి. మేత, మందుల ధరలను నియంత్రించాలి. ఉత్పత్తి వ్యయం బాగా తగ్గాలి. ఆధునిక పద్ధతులు వినియోగించాలి. ప్రభుత్వ సబ్సిడీలు కొనసాగించాలి. ఆక్వా రైతులకు తర్ఫీదు ఇవ్వాలి. ఈ ఏడాది చివరి నాటికి ఈక్వెడార్ ఉత్పత్తులు రెండువేల మెట్రిక్ టన్నులకు చేరుకుంటుందని అంచనా. అప్పటికల్లా మనమూ పోటీని తట్టుకొని నిలబడగలగాలి.

– గోవిందరావు, ఆక్వా కన్సల్టెంట్, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా

ఒడుదుడుకులు తాత్కాలికమే



ఆక్వా మార్కెట్‌లో ఒడుదుడుకులు తాత్కాలికమే. రొయ్య ధరలు తగ్గకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది. మంత్రుల కమిటీ, నిపుణుల కమిటీలను వేసి పరిశీలన చేస్తోంది. ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సంప్రదింపులు జరుపుతోంది. త్వరలోనే రొయ్యలకు మంచి ధర లభిస్తుంది.

–కేఎస్‌వీ నాగ లింగాచారి, జిల్లా మత్స్య శాఖ, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

ఐఐసీలో ఏయూకు త్రీ స్టార్ ర్యాంకింగ్



సాక్షి, విశాఖపట్నం: జాతీయ స్థాయిలో కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్స్ కౌన్సిల్(ఐఐసీ) ర్యాంకింగ్స్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం త్రీ స్టార్ ర్యాంకింగ్‌ను సాధించినట్లు ఏయూ ఐఐసీ చైర్మన్ డాక్టర్ హెచ్.పురుషోత్తం శనివారం తెలిపారు. కేంద్ర మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ దీనికి సంబంధించిన ర్యాంకులను విడుదల చేశారని చెప్పారు. ఏఐసీటీఈ ఈవో అందించిన ఈ ర్యాంకింగ్‌లో ఏయూ మొదటి సంవత్సరమే ప్రతిభ చూపినట్లు తెలిపారు. జాతీయ స్థాయి ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ విద్యా సంస్థల్లో తొలి ఐదు సంస్థల్లో ఒకటిగా ఏయూ నిలిచిందన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ వసతులు, ప్రోత్సాహం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని అందించడం జరుగుతుందని తెలిపారు. ఏయూ ఇంక్యుబేషన్ కౌన్సిల్(ఆ హబ్) భారత దేశంలోనే అతిపెద్ద సమీకృత ఇంక్యుబేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తోందని వివరించారు,. ఈ సందర్భంగా ఐఐసీ సభ్యులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అభినందించారు.

పశుఆరోగ్య సేవా రథాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

6 జిల్లాల్లో 144 మంది సిబ్బంది నియామకానికి చర్యలు

- జిల్లాకు 8 పశువైద్యులు, 8 పారావెట్‌లు, 8 పైలట్ పోస్టులు
- 22, 23 తేదీల్లో విజయవాడ జేడీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు
- అంబులెన్సుల ప్రాంతీయ పర్యవేక్షకుడు అనిల్‌కుమార్



సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాల్లో పశు వైద్యులు, పారా వెట్‌లు, డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని అంబులెన్స్‌ల ప్రాంతీయ పర్యవేక్షకుడు అనిల్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పనిచేసేందుకు సిబ్బంది కావాలని తెలిపారు. ప్రతీ జిల్లాలో ఎనిమిది మంది పశువైద్యులు, ఎనిమిది మంది పారా వెట్(వెటర్నరీ టెక్నీషియన్)లు, ఎనిమిది మంది పైలట్ల (డ్రైవర్లు) చొప్పున మొత్తం 144 మంది సిబ్బంది అవసరమన్నారు. వెటర్నరీ వైద్యుల పోస్టులకు బ్యాచలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలని, కొత్తగా పట్టా పొందిన వారితో పాటు రిటైర్డ్ డాక్టర్లు కూడా అర్హులే అన్నారు. పారా వెట్ పోస్టులకు డిప్లమో ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇక పైలట్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, హెచ్ఎంవీ లైసెన్సుతో కనీసం 2–3 ఏళ్ల అనుభవం కలిగి ఉండాలని, 35 ఏళ్ల లోపు వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు విజయవాడలోని ముత్యాలంపాడు వీధిలోని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9154984484లో సంప్రదించాలన్నారు.

ఏసీఏ అధ్యక్షుడిగా మళ్లీ శరత్‌చంద్రరెడ్డి

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఏకగ్రీవం

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ సంఘం(ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్ మరో మూడేళ్లపాటు కొనసాగనుంది. ఏసీఏ ఎన్నికలకు నామినేషన్ల పర్వం శనివారం ముగిసింది. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌లోని ఆరు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఈసారి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21వ తేదీ వరకు గడువు ఉంది. డిసెంబర్ 3న ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే, ఒక్కో పదవికి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. మరోసారి పి.శరత్‌చంద్రరెడ్డి అధ్యక్షుడిగా కొనసాగనుండగా, గత కమిటీలో కోశాధికారిగా వ్యవహరించిన ఎస్.గోపీనాథరెడ్డి కార్యదర్శిగా నామినేషన్ వేశారు. ఇక ఉపాధ్యక్షుడిగా రోహిత్‌రెడ్డి, కోశాధికారిగా శేషాచలం, సంయుక్త కార్యదర్శిగా రాకేష్ నామినేషన్లను దాఖలు చేశారు.

మార్గదర్శిలో ఇంకా డిపాజిట్ల సేకరణ

▶ మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో శనివారం ఆయన రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్ పేరిట డబ్బులు సేకరించారని, గతంలో డిపాజిట్ అని ఉంటే.. ప్రస్తుతం దాన్ని రిసీట్‌గా మార్చి వసూలు చేస్తున్నారని వెల్లడించారు. 'డిపాజిట్లు తీసుకోను' అని ఆర్‌బీఐకి రాసిచ్చిన వ్యక్తి.. చిట్‌ఫండ్ పేరు మీద ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్ మీదే రశీదు సైతం ఇస్తున్నారన్నారు. ఇలా సేకరించిన డబ్బును ఇతర వ్యాపారాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. 'బ్యాలెన్స్ షీట్‌లో మార్చి 31 నాటికి అవుట్ స్టాండింగ్ రూ.139 కోట్లు చూపించారు. అంటే చీటీ పాడుకున్న కస్టమర్లు ఏప్రిల్‌లో కట్టాల్సిన సొమ్మును మార్చి నెలలోనే ముందస్తుగా కట్టారా? మార్గదర్శికి 3 శాతం మంది కూడా డిఫాల్టర్లు లేరా? అందులో ఏదో కిటుకు దాగుంది' అని అన్నారు. ఉండవల్లి ఇంకా ఏమన్నారంటే..

తప్పులకు మీడియా ముసుగు

- పెద్ద బ్యాంకులు, సహకార శాఖలకు సాధ్యం కాని వసూళ్లు ఇక్కడ జరుగుతున్నాయా? మనీ ల్యాండరింగ్ జరుగుతోందా? కట్టకుండానే కట్టినట్లు చూపిస్తున్నారా? దీనిపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందా? రామోజీ అంటే ప్రభుత్వానికి, అధికారులకు భయమా?
- ఇలాంటి వ్యక్తికి బ్యాంకులను అప్పగిస్తే అద్భుతంగా నడిపిస్తారేమో! రామోజీ తెలివితేటలకు పద్మ విభూషణ్ కాదు.. భారతరత్న ఇవ్వాలి. మార్గదర్శి కేస్ స్టడీని విదేశాల్లో యూనివర్సిటీ విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలి.
- రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి మార్గదర్శి కేసులో ఇంప్లీడ్ అయ్యింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలు చేస్తోంది. దీనిపై.. రామోజీరావు టీడీపీకి అనుకూలంగా ఉంటాడని, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి.. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని.. అందుకే ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపట్టిందని ఆయన పేపర్లో రాసుకుంటాడు.
- 2007లో ఇదే వాదనతో సుప్రీంకోర్టుకు వెళ్తే.. అప్పట్లో సుప్రీంకోర్టు జడ్జి రవీందర్ 'రామోజీరావు రెండు టోపీలు పెట్టుకుని తిరుగుతున్న వ్యక్తి. పారిశ్రామికవేత్తగా చేసిన తప్పులను ప్రభుత్వం పట్టుకుంటే మీడియా టోపీ పెట్టుకుని నేను జర్నలిస్ట్ కాబట్టి టార్గెట్ చేస్తున్నారని మీడియా ముసుగులో తప్పులను కప్పిపుచ్చుకుంటున్నాడు. నువ్వు తప్పు చేశావా? లేదా? అనేది అవసరం. రాజశేఖరరెడ్డి పేరు పర్సనల్‌గా పెట్టింది తీసేస్తున్నాం' అని చెప్పింది చాలా మందికి గుర్తుండే ఉంటుంది.

సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలతో విచారించాలి

- మార్గదర్శి కుంభకోణంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలతో కమిటీ వేసి విచారణ జరిపించాలి. ఆ స్థాయి వ్యక్తులు నిష్పక్షపాతంగా విచారణ చేస్తారు. ఇటీవల రిటైర్డ్ అయిన ఎన్వీ రమణ.. మార్గదర్శి రికార్డులు పరిశీలించి రామోజీ చేస్తున్నది కరెక్ట్, ఉండవల్లి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని చెబితే నేను స్వాగతిస్తా.
- రాష్ట్ర ప్రభుత్వం నన్ను పిలిస్తే.. వారు స్వాధీనం చేసుకున్న రికార్డులు నేనూ చూస్తాను. లేదా ఆర్టీఐ ద్వారా ఇచ్చే వెసులుబాటు కలిగినవి నాకివ్వాలి. అప్పుడు నా ద్వారా మరింత సమాచారం అందే అవకాశం ఉంటుంది. ఎవరి డబ్బులు వారికి ఇచ్చేశామని రామోజీ చెబుతున్నారు.. నేను ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్తాను. రామోజీరావు ఈ విషయం నిరూపించాలి.
- రామోజీపై ఆరోపణలు చేస్తుంటే నేనూ, జగన్ కలిసిపోయామని వార్తలొస్తున్నాయి. చంద్రబాబు, జగన్ చేసిన మంచి పనులు ప్రచారం చేసేందుకు మీడియా ఉంది. చంద్రబాబు చేసిన తప్పులు బయటకు రాకపోవడం వల్లే అప్పట్లో బాబును విమర్శించాల్సి వచ్చింది. ప్రస్తుతం జగన్‌పై వ్యతిరేక వార్తలు పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. జగన్‌కు వ్యతిరేకంగా ఈనాడు అన్ని వార్తలు రాస్తున్నా ప్రభుత్వ ప్రకటనలు మాత్రం తగ్గాయా? సర్క్యులేషన్ నిబంధనల ప్రకారం ప్రకటనలు ఇవ్వాల్సిందే. ఈ లెక్కన మార్గదర్శిలో సైతం చట్టానికి లోబడే కార్యకలాపాలు నడవాలన్నదే నా ఉద్దేశం.

ఆయిల్‌పామ్ అరుదైన రికార్డు

సాక్షి, అమరావతి: ఆయిల్‌పామ్ గెలల సేకరణలో మన రాష్ట్రం అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. 2021–22 సీజన్‌లో రికార్డు స్థాయిలో ఆయిల్‌పామ్ గెలలను సేకరించడంతో పాటు ప్రాసెస్ కూడా చేసింది. చరిత్రలో ముందెన్నడూ లేని రీతిలో 1.25 లక్షల టన్నుల గెలలను సేకరించగా.. 94 వేల టన్నులను గెలలను క్రషింగ్ చేసి సత్తా చాటింది. ప్రాసెస్ చేయగా మిగిలిన గెలలను ప్రీమియం రేటుకు విక్రయించడం ద్వారా ఏపీ ఆయిల్ ఫెడ్ మంచి లాభాలను ఆర్జించింది. ఏపీ ఆయిల్ ఫెడ్ పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో గంటకు టన్ను గెలల క్రషింగ్ సామర్థ్యంతో 1992లో ఆయిల్‌పామ్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. గతంలో ప్రైవేట్ కంపెనీలతో కుమ్మక్కైన టీడీపీ పాలకులు ఏనాడూ ఈ ఫ్యాక్టరీని పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా నిత్యం మరమ్మతులకు గురవుతూ సామర్థ్యం తగ్గిపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో రూ.10 కోట్లతో 24 టన్నుల సామర్థ్యానికి ప్లాంట్‌ను అప్‌గ్రేడ్ చేసింది. ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియా (ఓఈఆర్)ను కూడా 16.08 శాతం నుంచి 18.68 శాతానికి పెంచింది. ఫలితంగా ఆయిల్ పామ్ గెలల ధర మూడు రెట్లు పెరిగింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.